
'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి
శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల
భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 77

శనివారం 8-6-2024


ఉర్దూ మీడియంలో చదివి... -IIలో


పక్షిని ఎగరనివ్వాలి! -IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

నీట్ టాపర్ ఆరిఫ్ అమీనా

ఉర్దూ మీడియంలో చదివి..



'మెహనత్ కర్నా హై... మోటివేట్ రెహనా హై (కష్టపడాలి... ప్రేరణతో ఉండాలి) అని చెప్పింది అమీనా ఆరిఫ్ తన విజయం గురించి. వైద్యవిద్యలో ప్రవేశం కోసం దేశవ్యాప్తంగా నిర్వహించే 'నీట్'లో 2024 సంవత్సరానికి 720 మార్కులకు 720 మార్కులతో టాప్ 1 ర్యాంకు సాధించింది అమీనా. ఈసారి దేశవ్యాప్తంగా దాదాపు 24 లక్షల మంది పరీక్ష రాస్తే వారిలో 67 మందికి టాప్ 1 ర్యాంకు వచ్చింది. వారిలో 14 మంది అమ్మాయిలు ఉన్నారు. వీరిలో మిగిలిన వారితో పోల్చితే అమీనా గెలుపు కాస్త భిన్నమైనది. ఎందుకంటే 10వ తరగతి వరకూ ఆమె ఉర్దూ మీడియంలో చదివింది.

బేకరి వర్కర్ కుమార్తె

ముంబై పశ్చిమ శివార్లలో ఉండే జోగేశ్వరి ప్రాంతం అమీనాది. తండ్రి బేకరీలో పని చేస్తాడు. అక్కడ ఉన్న మద్నీ హైస్కూల్ మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో పేరు గడించింది. ఉర్దూ మీడియంలో బోధన సాగే ఆ స్కూల్లోనే అమీనా పది వరకు చదివింది. ఆ తర్వాత పార్లెలోని మిఠిబాయి కాలేజీలో బైపీసీలో చేరింది. 'అంతవరకూ ఉర్దూ మీడియంలో చదవడం వల్ల బైపీసీ ఇంగ్లిష్ మీడియం చదవడం కష్టమైంది. ఇంగ్లిష్‌లో నా వెనుకంజ నా చదువునే వెనక్కు నెట్టకూడదని గట్టిగా కష్టపడ్డాను' అని తెలిపింది అమీనా. ఆమెకు ఇంటర్‌లో 95 శాతం మార్కులు వచ్చాయి.

మళ్లీ ప్రయత్నించి

'అమ్మా నాన్నా నన్ను బాగా చదువుకోమని ప్రోత్సహించారు. లాక్‌డౌన్ వల్ల మొదటిసారి నీట్ రాసినప్పుడు నాకు గవర్నమెంట్ కాలేజీలో సీట్ వచ్చేంత ర్యాంక్ రాలేదు. నిస్పృహ చెందకుండా ప్రయత్నించాను. ఈసారి కోచింగ్ తీసుకున్నాను. ఆరు గంటలు కోచింగ్, ఇంట్లో మరో నాలుగైదు గంటలు సెల్ఫ్ స్టడీ... ఇలా సాగింది నా కృషి. కోచింగ్ సెంటర్‌లో మాక్ టెస్టులు రాసేటప్పుడు 700 మార్కులకు తరచూ 620 వచ్చేవి. అప్పుడే అనుకున్నాను... కచ్చితంగా 700 దాటుతానని ముందే అనుకున్నాను' అని తెలిపింది అమీనా.

ఆమెకు వచ్చిన ర్యాంక్‌కు దేశంలోని ఏ మెడికల్ కాలేజీలో అయినా సీట్ వస్తుంది కానీ అమీనా మాత్రం ఢిల్లీ ఎయిమ్స్‌లో చదవాలనుకుంటోంది.

'నీట్' ఎగ్జామ్‌లో ఆలిండియా టాప్ ర్యాంకర్‌గా నిలవడం సామాన్యం కాదు.
ముంబైలో ఓ బేకరి వర్కర్ కుమార్తె అయిన **అమీనా ఆరిఫ్** పది వరకూ ఉర్దూ మీడియంలో చదివింది.
ఇంటర్‌లో ఇంగ్లిష్ మీడియంతో ఇబ్బంది పడింది.
అయినా నీట్ 2024లో 720 కి 720 తెచ్చుకుని టాప్ ర్యాంకర్‌గా నిలిచింది.
ఆమె స్ఫూర్తిదాయక కథనం...

మనలో చాలా మంది పక్షులను పెంచుకుంటూ ఉంటారు. కానీ ఎక్కువశాతం తమ ఆహ్లాదం కోసమే. నిజానికి పక్షులను ఆదరించాల్సింది మన ఆహ్లాదం కోసం కాదు, వాటి ఆనందం కోసం దగ్గరకు తీయాలి. వాటి రెక్కలు విరిచి పంజరంలో పెట్టి మనం చూస్తూ ఆనందించడం హేయమైన చర్య. స్వేచ్ఛగా ఎగరడం వాటి సహజ లక్షణం. అది వాటికి ప్రకృతి ఇచ్చిన హక్కు. ఆ హక్కును కాలరాసే అధికారం మనకు లేదు... అంటున్నారు మహారాష్ట్ర, పుణేలో నివసిస్తున్న రాధికా సోనావానే.

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్న రాధిక పక్షి సంరక్షకురాలిగా మారిన క్రమాన్ని ఆమె చాలా ఇష్టంగా వివరిస్తారు.

పక్షిని ఎగరనివ్వాలి!



రాధికా సోనావానే

"ప్రస్తుతం నా ఉద్యోగరీత్యా పూనాలో ఉన్నాం. మా స్వస్థలం ఔరంగాబాద్. బర్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ సలీం అలీ బర్డ్ సాంక్చురీకి ఎన్నిసార్లు వెళ్లానో లెక్కచెప్పలేను. పక్షుల మీద మమకారం ఏర్పడింది. నేను బర్డ్ లవర్‌ని బర్డ్ వాచర్‌ని మాత్రమే అనుకున్నాను. కానీ ఏ మాత్రం ముందస్తు ప్రణాళికలు లేకుండా అనుకోకుండా పక్షి సంరక్షకురాలినయ్యాను. పెళ్లి తర్వాత నా నివాసం ఔరంగాబాద్‌లోనే ఒక ఫ్లాట్‌లోకి మారింది. మా పొరుగింట్లో ఓ పెద్దాయన బాల్కనీలో బర్డ్ ఫీడర్, ఒక గిన్నెలో నీరు పెట్టడం చూసిన తర్వాత నాకూ అలాగే చేయాలనిపించింది. పుణేకి బదిలీ అయిన తర్వాత కూడా కొనసాగింది. ఇప్పుడు మా ఇంటి గార్డెన్ పక్షుల విహార కేంద్రమైంది. నాకు తోచిన గింజలు పెట్టి సరిపెట్టకుండా ఏ పక్షికి ఏమి ఇష్టమో తెలుసుకోవడానికి పక్షుల జీవనశైలిని అధ్యయనం చేశాను. రామ చిలుకలకు వేరుశనగ పప్పులు ఇష్టం. గోరువంకలు అరటి పండు తింటాయి. రామ చిలుక ముక్కు పెద్దది. గోరువంక, పిచ్చుకల ముక్కులు చిన్నవి. ఆ సంగతి దృష్టిలో పెట్టుకుని ఫీడర్ బాక్సులు డిజైన్ చేయించాను. నేను పెట్టిన ఆహారాన్ని అవి ఇష్టంగా తింటున్నాయా లేదా, నేను చదివింది నిజమేనా కాదా అని తెలుసుకోవడానికి బాల్కనీలో కూర్చుని శ్రద్ధగా గమనించేదాన్ని. అరటి పండు ముక్కలను చూడగానే గోరువంకలు సంతోషంగా పాటలు పాడడం మొదలుపెడతాయి. పాట పూర్తయిన తర్వాత తింటాయి. టైయిలర్ బర్డ్ అయితే పత్తి దూదిని చూడగానే రాగాలు మొదలుపెడుతుంది. గూడు కట్టుకోవడానికి పత్తి కనిపిస్తే దాని ఆనందానికి అవధులు ఉండవు. మనం సాధారణంగా కాకులను ఇష్టపడం. కానీ అవి చాలా హుందాగా వ్యవహరిస్తాయి. కాకులు, పిచుకలు, చిలుకలు, గోరువంకలు ఇతరులకు హాని కలిగించవు. పావురాలు అలా కాదు. వాటి ఆహారపు అలవాట్లు కూడా అంత సున్నితంగా ఏమీ ఉండవు. తమ ఆహారంలో ఇతరులను ముక్కు పెట్టనివ్వవు, ఇతరుల ఆహారాన్ని కూడా తామే తినేయాలన్నంత అత్యాశ వాటిది.



పక్షి స్వేచ్ఛాజీవి

పెట్ డాగ్‌లాగా యజమానితో అనుబంధం పెంచుకోవడం పక్షుల్లో ఉండదు. స్వేచ్ఛగా విహరిస్తూ అనేక ప్రదేశాలకు వెళ్తుంటాయి. ఒక ప్రదేశంతో కానీ వ్యక్తితో కానీ అనుబంధం పెంచుకోవు. మా ఇంటికి వచ్చే నా అతిథుల్లో చిలుకలే ఎక్కువ. అలెగ్జాండ్రియన్ ప్యారట్, ఇండియన్ రింగ్‌నెక్ ప్యారట్‌లు తరచూ కనిపిస్తుంటాయి. సన్‌బర్డ్, వీవర్ బర్డ్ కూడా వస్తుంటాయి. కాలం మారేకొద్దీ అవి అప్పటి వరకు ఉన్న ప్రదేశాలను వదిలి తమకు అనువైన ప్రదేశాలకు వెళ్లిపోతుంటాయి. వాయు కాలుష్యం, వాతావరణంలో వస్తున్న మార్పులు కూడా పక్షుల వలసలకు కారణమే. సెల్ ఫోన్ టవర్‌ల నుంచి వెలువడే రేడియేషన్ కారణంగా పక్షులు కంటి చూపును కోల్పోతున్నాయి. దాంతో అవి తమకు సురక్షితమైన ప్రదేశాలను వెతుక్కుంటూ ఎటుపోతున్నాయో తెలియడం లేదు. కరవు, అధిక వర్షాలు, యాసిడ్ వర్షాలు, అడవులలో చెట్లు నరకడం, మంటలు వ్యాప్తించడం... వాటికి ఎదురయ్యే ప్రమాదాలు. పక్షులు అడవిలో జీవించినంత ధైర్యంగా మనుషుల మధ్య జీవించలేవు. వాటికి మనుషులంటే భయం. ఆ భయాన్ని వదిలించి మచ్చిక చేసుకోవాలంటే వాటికి ఆహారాన్ని అందుబాటులో ఉంచడం ఒక్కటే మార్గం. ఆహారం కోసం ధైర్యం చేస్తాయి, క్రమంగా మన మీద నమ్మకం కలిగిన తర్వాత మన ఇంటిని తమ ఇంటిలాగా భావిస్తాయి. మా గార్డెన్‌కి రోజూ నలభై నుంచి యాభై పక్షుల వరకు వస్తుంటాయి. వాటి కోసం ఇంట్లో వంట గది, హాలు, బాల్కనీల్లో పక్షుల కోసం నీటి పాత్రలు పెట్టాను. దాహం వేసినప్పుడు నేరుగా దగ్గరలో ఉన్న నీటి పాత్ర దగ్గరకు వెళ్లిపోతాయి. పక్షులు మనతో మాట్లాడతాయి. రోజూ మా ఇంటి ఆవరణలో వినిపించే కిచకిచలన్నీ అవి నాకు చెప్పే కబుర్లే. కరోనా సమయంలో నా టైమ్ అంతా వీటి కోసమే కేటాయించాను. నన్ను నిత్య చైతన్యంగా ఉంచాయవి. నిజానికి పక్షి ప్రేమికులెవ్వరూ పక్షులను పంజరంలో బంధించరు. తమ సంతోషం కోసం పక్షులను పెంచే స్వార్థజీవులే ఆ పని చేస్తారు. దయచేసి పక్షులను బంధించవద్దు. వాటిని స్వేచ్ఛగా ఎగరనివ్వండి. చేతనైతే రోజుకు గుప్పెడు గింజలు, ఒక పండు పెట్టండి" అంటూ పక్షుల గురించి ఆసక్తికరమైన విషయాలెన్నో చెబుతారు రాధిక.

వారి చేతుల్లో...

వ్యర్థాలు కూడా బొమ్మలవుతాయి

ఈ మహిళల చేతిలో రూపుదిద్దుకున్న బొమ్మలు ఒక్కోటి ఒక్కో కథ చెబుతుంటాయి.
బొమ్మల శరీరాలు కాటన్ కాన్వాస్‌తో విభిన్న రంగులతో సాంస్కృతిక వైవిధ్యంతో ఆకట్టుకుంటాయి.
మూస ధోరణులకు భిన్నంగా స్త్రీల చేతుల్లో తల్లీ–బిడ్డలు, భార్యాభర్తలు, పిల్లల బొమ్మలు రూపుదిద్దుకుంటాయి.
న్యూఢిల్లీలోని అఫ్గాన్ శరణార్థ మహిళలకు హస్తకళల్లో నైపుణ్యాలకు శిక్షణ ఇస్తూ ఫ్యాబ్రిక్ వ్యర్థాలతో అందమైన బొమ్మలు, గృహాలంకరణ వస్తువులను రూపొందిస్తుంది ఐరిస్ స్ట్రిల్.
శరణార్థులకు స్థిరమైన ఆదాయవనరుగా మారడమే కాదు పర్యావరణ హితంగానూ తనదైన ముద్ర వేస్తోంది.



భారతదేశంలో నివసిస్తున్న ఫ్రెంచ్ డిజైనర్ ఐరిస్ స్ట్రిల్. టెక్స్‌టైల్, క్రాఫ్ట్ పరిశ్రమలో విస్తృతమైన అనుభవం ఉన్న సీనియర్ క్రియేటివ్ డిజైనర్. ఆమె భర్త బిశ్వదీప్ మోయిత్రా ఢిల్లీవాసి. కళాకారుల ప్రతిభను పెంపొందించడం, మహిళా సంఘాలను ప్రోత్సహించడం, ట్రెండ్‌ను అంచనా వేయడం, అట్టడుగు హస్తకళాకారుల కోసం వారి సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను అమలు చేయడంలో ఐరిస్ విస్తృత స్థాయిలో పని చేస్తుంది. దేశంలోని హస్తకళాకారులతో ఆమెకు మంచి పరిచయాలు ఉన్నాయి. అందమైన ఇండియన్ ఫ్యాబ్రిక్ వ్యర్థాలు, వస్త్రాల తయారీలో మిగిలి పోయిన వస్త్రాల గుట్టలను చూస్తూ ఉండేది.

పర్యావరణ అనుకూలమైన ఆలోచన

"ఈ వ్యర్థాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో కొన్నాళ్లు పాటు ఆలోచించాను. అదే సమయంలో అఫ్గాన్ మహిళా శరణార్థులను శక్తిమంతం చేయాల్సిన అవసరాన్ని కూడా గుర్తించాను. ఇక్కడ డిజైన్ పని చేస్తున్న సమయంలో తరచూ భారతీయ గ్రామీణ మహిళలకు వారి సంప్రదాయ నైపుణ్యాలను ప్రపంచ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో శిక్షణ ఇచ్చే ప్రాజెక్ట్‌లను చేయడం మొదలుపెట్టాను. ఆ విధంగా అనేకమంది హస్తకళాకారులతో నాకు పరిచయం ఏర్పడింది. యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యుఎన్‌హెచ్‌సిఆర్) జీవనోపాధి కార్యక్రమాలలో భాగమైన అఫ్గన్ శరణార్థ మహిళలతో కలిసి అనేక శిక్షణా కార్యక్రమాలలో పాల్గొన్నాను. అలా నాలో శరణార్థులతో కలిసి పనిచేయాలనే ఆలోచన కలిగింది. ఆ ఆలోచన నుంచే 'సిలైవాలి' సంస్థ పుట్టింది. పర్యావరణ అనుకూలమైన, స్థిరమైన, వ్యర్థ పదార్థాలను ఉపయోగించి చేతి వృత్తుల ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా జీవనోపాధిని పొందడంలో అట్టడుగున ఉన్న కళాకారులకు సహాయపడే ఒక సామాజిక సంస్థను నెలకొల్పాను. బొమ్మలు శరణార్థ మహిళల ప్రత్యేకతగా మారినప్పటికీ, ఇతర గృహోపకరణాలు కూడా వారు తయారుచేస్తారు.





స్థిరమైన ఆదాయం

మా ఉత్పత్తులు పూర్తిగా పర్యావరణ అనుకూలమైనవి. వీటికి సరైన ధరలను నిర్ణయించి, వాటి ద్వారా కళాకారుల సంఘాలను ఏర్పాటు చేయడానికి సహాయపడేందుకు ఒక స్థిరమైన ఆదాయానికి కల్పిస్తున్నాం. అభివృద్ధి చెందిన దేశాలలో స్థిరపడాలనే ఉద్దేశంతోనూ, వారి స్వదేశంలో అస్థిరత కారణంగా పారిపోతున్న అఫ్గాన్ శరణార్థులకు న్యూఢిల్లీ ఒక ఇల్లుగా చెప్పవచ్చు. సిలైవాలి సంస్థ ద్వారా 70 మంది మహిళా శరణార్థులకు స్థిరమైన ఆదాయం లభిస్తోంది. శరణార్థుల ఇళ్లకు కూతవేటు దూరంలో పరిశుభ్రమైన పని వాతావరణం, పిల్లలను కూడా పనిలోకి అనుమతించడం వల్ల ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావడం లేదు. ఈ సంస్థ ద్వారా తయారైన బొమ్మలు, ఇతర అలంకార వస్తువులు ప్రపంచవ్యాప్తంగా 100కి పైగా కాన్సెప్ట్ స్టోర్‌లలో అమ్మకానికి ఉన్నాయి. దేశరాజధానిలో సొంత స్టోర్‌తో పాటు వెబ్‌సైట్ ద్వారా కూడా అమ్మకాలను జరుపుతున్నాం. కళాత్మక వస్తువులను క్లాత్‌తో రూపొందించడం వల్ల ఫ్యాషన్ దృష్టిని ఆకర్షిస్తున్నాం. వేస్ట్ ఫ్యాబ్రిక్‌ను అందమైన స్మారక చిహ్నాలు, గృహాలంకరణలో హ్యాండ్ క్రాఫ్ట్ వస్తువుల తయారీకి మూడు గంటల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నాం. దీనితో కళాకారుల నుంచి మహిళలు కుట్టుపని, ఎంబ్రాయిడరీ వంటివి నేర్చుకుంటున్నారు. సోషల్ మీడియా ద్వారా మా ఉత్పత్తులను ప్రజల ముందుకు తీసుకెళుతున్నాం. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ సంవత్సరం గ్యారెంటీడ్ ఫెయిర్ ట్రేడ్ ఎంటర్‌ప్రైజ్‌గా వరల్డ్ ఫెయిర్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సర్టిఫికెట్ ను కూడా పొందింది. మా సంస్థ ద్వారా గుడ్డ బొమ్మలు, బ్యాగులు, ఆభరణాలు తయారు చేస్తాం" అని వివరిస్తారు ఈ క్రియేటర్.

సముద్ర సంరక్షణలో...



దివ్య హెగ్డే



భర్త ఇంద్రనీల్ సేన్‌గుప్తాతో రబియా తివారీ

సముద్రమంత గాంభీర్యం అంటారు.
సముద్రమంత సాహసం అంటారు.
సముద్రమంత సహనం అంటారు.
అయితే ఇప్పుడు 'గాంభీర్యం' 'సాహసం' 'సహనం' స్థానంలో 'ప్రమాదం' కనిపిస్తోంది.
కాలుష్యం బారిన పడి తల్లడిల్లుతున్న సముద్రం గుండె చప్పుడు విన్న వాళ్లు బాధ పడుతూ కూర్చోవడం లేదు.
సముద్ర కాలుష్యాన్ని నివారించే కార్యక్రమాల్లో భాగం అవుతున్నారు.
'వరల్డ్ ఓషన్స్ డే' సందర్భంగా ఓషన్ యాక్టివిస్ట్‌లు దివ్య హెగ్డే, రబియా తివారీ గురించి...

గూగుల్ మాజీ ఉద్యోగి అయిన దివ్యా హెగ్డే కర్నాటక కోస్తా ప్రాంతాలలో సముద్ర కాలుష్యం, నివారణ మార్గాల గురించి ప్రచారం చేస్తోంది. క్లైమెట్ యాక్టివిస్ట్, సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా గుర్తింపు పొందిన దివ్య వివిధ కళారూపాల ద్వారా సముద్ర కాలుష్యంపై పోరాడుతుంది.


ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను సముద్రంలో పారవేయకుండా నిరోధించడానికి యక్షగాన ప్రదర్శనల ద్వారా ప్రచారం నిర్వహిస్తోంది. ఈ యక్షగాన ప్రదర్శనలో 'ప్లాస్టిక్' ను రాక్షసుడిగా చూపించారు. ఆ రాక్షసుడిని మట్టికరిపించే శక్తి మానవుడిలో ఉంది అనే సందేశాన్ని ఇచ్చారు.ఈ యక్షగానంలో తడి చెత్త, పొడి వ్యర్థాల పాత్రలను కళాకారులు పోషించారు.

సముద్రంపై ప్లాస్టిక్ హానికరమైన ప్రభావాన్ని చూపించేలా 'ప్లాస్టిక్ అసుర' పాత్రను రూపొందించారు.

'కర్ణాటకలో యక్షగానానికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ బలమైన కళారూపం ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడం నుంచి తడి, పొడి చెత్తను వేరు చేయడం వరకు ఎన్నో విషయాలు చెబుతున్నాం. ఈ ప్రచారాల ద్వారా ప్రజలకు మంచి విషయాలను చేరువ చేయడం ఒక కోణం అయితే కళాకారులకు ఆర్థికపరంగా సహాయపడడం మరో కోణం' అంటుంది దివ్య.

'బేరు' అనే స్వచ్ఛందసంస్థ ద్వారా తీరప్రాంత వ్యర్థాల నిర్వహణపై పనిచేస్తోంది దివ్య.

వ్యర్థాలను ప్రాసెస్ చేయడం గురించి మహిళలకు శిక్షణ ఇచ్చారు. వీరు ఇంటింటికి వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తారు. సముద్ర వ్యర్థాలను తగ్గించే విధానాలలో ఇది ఒకటి. తడి చెత్త ప్రాసెసింగ్ ద్వారా వచ్చే సేంద్రియ ఎరువులను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తారు.



వ్యర్థాలను సేకరించడం, ప్రాసెస్ చేయడం ద్వారా మహిళలు ఉపాధి పొందుతున్నారు.

మత్స్యకారుల కుటుంబాలలో డిజిటల్ నైపుణ్యాలు పెంచడంపై కూడా 'బేరు' దృష్టి పెట్టింది.

దీనిలో భాగంగా యూజర్–ఫ్రెండ్లీ వేస్ట్ మేనేజ్‌మెంట్ యాప్‌ను రూపొందించారు. 'డోర్–టు–డోర్ వేస్ట్ కలెక్షన్' కార్యక్రమాలలో మహిళలకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

ముంబైకి చెందిన రబియా తివారీ తన భర్త ఇంద్రనీల్ సేన్‌గుప్తాతో కలిసి సముద్ర కాలుష్యంపై పోరాడుతుంది. ముంబైలో సముద్రతీర అపార్ట్‌మెంట్‌కు మారినప్పుడు బీచ్‌లో టన్నుల కొద్ది చెత్తను చూసి చలించిపోయారు ఈ దంపతులు. ఆ బాధలో నుంచే 'ఎథికో ఇండియా' అనే సామాజిక సంస్థను మొదలుపెట్టారు.

ఇద్దరు వ్యక్తులతో మొదలైన 'ఎథికో ఇండియా' ఆ తరువాత 'సిటిజెన్ మూవ్‌మెంట్' స్థాయికి చేరుకుంది.

ఉద్యమం ఊపందుకోవడంతో వాలంటీర్లు మాహిమ్ బీచ్ నుంచి కిలోల కొద్దీ పోగుపడిన సముద్ర వ్యర్థాలను తొలగించారు.

సోషల్ మీడియా వేదికగా ఎంతోమందిని ఉద్యమంలో భాగం చేసింది 'ఎథికో ఇండియా'.

'మాహిమ్ బీచ్ క్లీన్ అప్ డ్రైవ్'ను ఐక్యరాజ్య సమితి గుర్తించింది. ఈ ఉద్యమం మరికొన్ని ఉద్యమాలకు ద్వారాలు తెరిచింది. 'ఓపెన్ ఫెస్ట్' అనేది అందులో ఒకటి. కళల ద్వారా సముద్ర కాలుష్యంపై పోరాడటమే దీని లక్ష్యం.

'ఓపెన్ ఫెస్ట్'లో అంకుర్ తివారీ, మానసీ పరేఖ్, అనురాగ్ శంకర్, చందన బాల కళ్యాణ్, సుమిత్ నాగ్‌దేవ్‌లాంటి ప్రముఖ కళాకారులు భాగం అయ్యారు.

'మా ప్రయత్నం ఫలించినందుకు సంతోషంగా ఉంది. అధికారులలో మార్పు వచ్చింది. ప్రక్షాళన కార్యక్రమాల్లో మాతో కలిసి చురుగ్గా పాల్గొంటున్నారు' అంటుంది రబియా తివారీ.

సత్యమేవ జయతే
సాక్షి
'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 77
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

పదేళ్ల పాలన ట్రైలరే..

దేశాభివృద్ధికి మరింత శ్రమిస్తాం: మోదీ



- ఎన్డీఏ.. న్యూ, డెవలప్డ్, ఆస్పిరేషనల్ ఇండియా
- దేశ హితమే మా కూటమి ఏకైక లక్ష్యం
- అతిబలమైన, విజయవంతమైన సంకీర్ణం
- అధికార దాహంతోనే విపక్షాల కలయిక
- ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్నే పోగొట్టుకున్నారు.. ఇండియా కూటమిపై మోదీ తీవ్ర విమర్శలు
- ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలను ఉద్దేశించి ప్రసంగం

6లో

ప్రధానిగా తనను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అందించిన లేఖను మీడియాకు చూపుతున్న మోదీ

"ప్రజలు మాకు స్పష్టమైన మెజారిటీ కట్టబెట్టారు. తద్వారా ప్రభుత్వాన్ని నడిపే సదవకాశమిచ్చారు. దీన్ని సద్వినియోగం చేసుకుంటామని, దేశాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి పథంలో నడుపుతామని దేశ ప్రజలందరికీ మాటిస్తున్నా." - మోదీ

రేపే మోదీ ప్రమాణం

- రాత్రి 7:15 గంటలకు ముహూర్తం.. ఎన్డీఏపీపీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- అనంతరం రాష్ట్రపతిని కలిసిన మోదీ.. ప్రధానిగా నియమిస్తూ ముర్ము నిర్ణయం - 6లో
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం

ఎమ్మెల్సీ ఉపఎన్నికలో తీన్మార్ మల్లన్న గెలుపు

- పోటీలో ఉన్న అభ్యర్థుల్లో 50 మంది ఎలిమినేట్.. మిగిలిన ఇద్దరిలో బీఆర్ఎస్ అభ్యర్థి కంటే ఆధిక్యంలో కాంగ్రెస్ అభ్యర్థి
- ఎన్నికల సంఘం వివరణ కోసం లేఖ రాసిన ఆర్‌ఓ హరిచందన
- ఈసీ నుంచి స్పష్టత రావడంతో అధికారికంగా ప్రకటించిన ఆర్‌ఓ

2లో

వానాకాలం పంటలకు కాళేశ్వరం నీళ్లు..

- వేగంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు తాత్కాలిక మరమ్మతులు: మంత్రి ఉత్తమ్
- ఎన్డీఎస్ఏ సూచనల మేరకు పంటలకు నీరిచ్చేందుకు యత్నాలు
- బ్యారేజీలు, మరమ్మతు పనులను పరిశీలించిన మంత్రి.. అధికారులు, ఏజెన్సీతో సమీక్ష - 14లో



టీచర్ల బదిలీలు, పదోన్నతులు

రంగారెడ్డి మినహా నేటి నుంచి ప్రక్రియ మొదలు.. షెడ్యూల్ విడుదల

మొత్తం 18,495 మందికి ప్రమోషన్లు

- వివరాలు 14లో

'లోకల్' రూట్లో విస్తరణ!

- స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పట్టు దిశగా రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేర్పులు!
- అన్ని సామాజిక వర్గాలు, ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం ఉండేలా ముఖ్యమంత్రి రేవంత్ ఉండేలా కసరత్తు

2లో

క్లుప్తంగా...

21 వరకు కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈనెల 21 వరకు ప్రత్యేక కోర్టు పొడిగించింది. కస్టడీ ముగియడంతో కవితను వర్చువల్‌గా ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. కవిత కస్టడీ పొడిగించాలన్న సీబీఐ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు. తదుపరి విచారణను ఈ నెల 21కు వాయిదా వేశారు. మరోవైపు, ఈ కేసులో కవిత పాత్రపై దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీటును పరిగణనలోకి తీసుకోవాలని సీబీఐ కోరింది. దీనిపై జులై 6న విచారణ చేపడతామని న్యాయమూర్తి పేర్కొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ బీజేపీ ఎంపీలు

ఈటల, రఘునందన్‌లకు అభినందనలు

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: పార్లమెంట్‌లో తెలంగాణ బీజేపీ ఎంపీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు దాటిన తర్వాత, అధికార పార్టీతో సమానంగా 8 సీట్లలో బీజేపీ గెలిచి సత్తా చాటడంపై పలువురు చర్చించుకున్నారు. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలోనూ కాంగ్రెస్ సర్కారు ఉన్నా...అక్కడ అత్యధిక ఎంపీ సీట్లు బీజేపీ గెలవడాన్ని కొనియాడారు. పార్లమెంట్‌లో శుక్రవారం జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశం సందర్భంగా రాష్ట్రం నుంచి గెలిచిన ఎంపీలను నరేంద్రమోదీ, అమిత్‌షా, జేపీ నడ్డాలు అభినందించారు.

దీపాదాస్‌తో కొత్త ఎంపీల భేటీ



సాక్షి, హైదరాబాద్: నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల నుంచి గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ కొత్త ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికలు జరిగిన తీరుపై చర్చించిన నేతలు.. ఫలితాలపై విశ్లేషించారు. సమావేశంలో కోమటిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డి, నీలం మధు, దానం నాగేందర్, అనిల్‌కుమార్ యాదవ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్షీ వాంగ్మూలం రికార్డు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌పై పరువు నష్టం కేసులో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె స్టేట్‌మెంట్‌ను కోర్టు రికార్డు చేసింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. కాంగ్రెస్ నేతల నుంచి దీపాదాస్ మున్షీ బెంజ్‌కారు లబ్ధి పొందినట్లు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపణలు చేశారు. ఎంపీ టికెట్ ఆశావహుల్లో ఒకరు దీపాదాస్ మున్షీకి బెంజ్ కార్‌ను బహూకరించినట్లు చెప్పారు. దీపాదాస్‌కు బెంజ్ కారు కొనివ్వడంపై తన దగ్గర సాక్ష్యాలు కూడా ఉన్నాయన్నారు. ఎంపీ టికెట్ కోసం ఆమెకు ఎవరు కారును గిఫ్ట్‌గా ఇచ్చారన్నది మాత్రం ఆయన చెప్పలేదు. దీపాదాస్ మున్షీపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని...దీపాదాస్ మున్షీ, ఆమెకు గిఫ్ట్ ఇచ్చిన నేతలు స్పందిస్తేనే తాను సమాధానం చెబుతానని, అలాగే ఆధారాలు చూపిస్తానని చెప్పారు. ఈ క్రమంలోనే తనపై చేసిన ఆరోపణలపై దీపాదాస్ మున్షీ నాంపల్లి కోర్టును ఆశ్రయించి..ప్రభాకర్‌పై రూ.10 కోట్లు పరువు నష్టం దావా వేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నాంపల్లి కోర్టుకు హాజరై ఆమె వాంగ్మూలం ఇచ్చారు.


3 మార్కెట్ కమిటీలకు చైర్మన్లు

సాక్షి, హైదరాబాద్: లక్సెట్టిపేట్, కాగజ్‌నగర్, మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలక సభ్యులను, చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.

‘లోకల్’ రూట్లో కేబినెట్ విస్తరణ!

స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పట్టు దిశగా రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేర్పులు!

- అన్ని సామాజిక వర్గాలు, ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం ఉండేలా సీఎం రేవంత్ ఉండేలా కసరత్తు
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు దక్కనున్న బెర్తులు.. రెడ్డి, వెలమలకూ చాన్స్
- దీనితో ప్రస్తుత మంత్రుల్లో ఒకరిద్దరిని తొలగించవచ్చనే చర్చ
- నేడు అధిష్టానంతో చర్చించనున్న రేవంత్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గంలో మార్పు చేర్పులకు రంగం సిద్ధమవుతోంది. కీలక ఎన్నికలన్నీ ముగియడం, కేబినెట్‌లో బెర్తులు ఖాళీ ఉండటం నేపథ్యంలో త్వరలోనే మంత్రివర్గ విస్తరణ చేపట్టవచ్చని తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా.. అన్ని జిల్లాలు, సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం దక్కేలా కేబినెట్‌లో మార్పులు చేర్పులు ఉంటాయని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఆగస్టు నాటికి విస్తరణ జరిగే అవకాశం ఉందని తెలిసింది. ప్రస్తుతం సీఎం రేవంత్ సహా 12 మంది మంత్రులు ఉన్నారు. మరో ఆరుగురిని కేబినెట్‌లోకి తీసుకునేందుకు వీలుంది. ఈ మేరకు కేబినెట్ కూర్పుపై సీఎం రేవంత్ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్టు సమాచారం. ప్రస్తుతమున్న మంత్రుల్లో ఒకరిద్దరిని తొలగించవచ్చనే చర్చ జరుగుతోంది. దీనికితోడు ప్రస్తుతం సీఎం వద్ద ఉన్న పలు కీలక శాఖలను పంపిణీ చేసే క్రమంలో.. కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు ఉంటాయనే చర్చ జరుగుతోంది. సీడబ్ల్యూసీ సమావేశాల్లో పాల్గొనేందుకు శుక్రవారమే ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్.. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై అధిష్టానంతో చర్చించే అవకాశం ఉంది.

పాలన, పట్టు.. రెండింటిపై ఫోకస్‌తో..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక 12 మంది మంత్రులతోనే పరిపాలన కొనసాగుతోంది. కొన్ని కీలక శాఖలు ఇంకా సీఎం రేవంత్ వద్దనే ఉన్నాయి. గత ఐదు నెలల్లో మూడు నెలల పాటే పాలన సజావుగా సాగింది. రెండు నెలలకుపైగా ఎన్నికల కోడ్‌తోనే గడిచిపోయింది. పాలన విషయంలో పలు రకాల సమస్యలు అటు సీఎం, ఇటు కేబినెట్ దృష్టికి వచ్చాయి. ఈ క్రమంలో మంత్రివర్గ విస్తరణతో త్వరలో పూర్తిస్థాయి పరిపాలన మొదలుపెట్టాలనే యోచనలో సీఎం రేవంత్ ఉన్నారని తెలిసింది. ప్రస్తుతం కీలక ఎన్నికలన్నీ ముగిశాయి. లోక్‌సభతోపాటు పలు ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థలకు, తర్వాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు జరగాలి. ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉంది. కొన్ని ఉమ్మడి జిల్లాలకు కేబినెట్లో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఈ ‘స్థానిక’ ఎన్నికల సందర్భంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. పలు సామాజిక వర్గాలకు కేబినెట్లో స్థానం లేకపోవడం కూడా ‘స్థానిక’ ఎన్నికల్లో ప్రభావం చూపవచ్చని నేతలు అంటున్నారు. కేబినెట్ విస్తరణతో ఈ ఇబ్బందులు తీరుతాయని పేర్కొంటున్నారు.

కొందరు మంత్రుల పనితీరుపై అసంతృప్తి!

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కొందరు మంత్రుల పనితీరుపై అధిష్టానం అసంతృప్తితో ఉందన్న చర్చ జరుగుతోంది. కొందరు మంత్రులు ఇన్‌చార్జులుగా ఉన్న నియోజకవర్గాల్లో సరిగా పనిచేయకపోవడం, చాలా మంది మంత్రుల నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభ ఎన్నికల్లో తక్కువ ఓట్లు రావడం వంటి అంశాలు నివేదికల రూపంలో అధిష్టానానికి చేరినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో స్వల్పంగా ఓట్లు తక్కువగా వచ్చినప్పటికీ.. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన తీరు, రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తడంపై అధిష్టానం మన్ననలు పొందినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

అధిష్టానంతో చర్చించనున్న సీఎం!

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్ శుక్రవారం సాయంత్రమే ఢిల్లీ వెళ్లారు. శనివారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఎంపీలకు విందు ఇస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ పార్టీ అధిష్టానంతో మంత్రివర్గ విస్తరణపై కీలక చర్చలు జరిపే అవకాశం ఉందని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. కేంద్ర రాజకీయాల హడావుడి ముగిసిన తర్వాత ఆగస్టు నాటికి కేబినెట్ విస్తరణ జరగవచ్చని అంటున్నాయి.

రాష్ట్ర కేబినెట్ నుంచి ఒకరిద్దరికి ఉద్వాసన ఉండవచ్చన్న ప్రచారం జరుగుతున్నా టీపీసీసీ నుంచి ఎలాంటి స్పష్టత రావడం లేదు. మంత్రులుగా నియామకమై చాలా తక్కువ సమయమే కావడంతో ఎవరి పనితీరు ఏమిటనేది అంచనా వేయడం సాధ్యం కాదనే చర్చ జరుగుతోంది. కానీ ఒకరిద్దరు మంత్రుల వ్యవహారశైలిపై అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లాయన్న ప్రచారమూ ఉంది. మరోవైపు మంత్రివర్గంలోకి కొత్తగా ఎవరు వస్తారన్న దానిపై మాత్రం ఆసక్తి నెలకొంది. కేబినెట్ ప్రస్తుత కూర్పును బట్టి.. కొన్ని ఉమ్మడి జిల్లాలు, కొన్ని సామాజిక వర్గాలకు అవకాశం కల్పించాల్సి ఉంది. అందులో ఎస్సీ (మాదిగ), ఎస్టీ (లంబాడా), బీసీ (ముదిరాజ్)లకు బెర్త్ ఖాయమని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి.

‘చాన్స్’పై సామాజిక వర్గం, జిల్లాలవారీ లెక్కలు!

- పెద్ద బీసీ సామాజిక వర్గాల్లో ఒకటైన మున్నూరు కాపులకు కేబినెట్ చాన్స్ రాలేదు. కొండా సురేఖ ఉన్నా ఆమెను పద్మశాలి కోటాలోనే లెక్క వేస్తున్నారు. ఈ క్రమంలో మున్నూరుకాపులకు విస్తరణలో చాన్స్ ఉంటుందనే చర్చ జరుగుతోంది.
- ఇక కేబినెట్‌లో ముదిరాజ్‌లకు అవకాశమిస్తామని లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ ప్రకటించిన నేపథ్యంలో ఆ వర్గానికి బెర్త్ దక్కే చాన్స్ ఉంది.
- ఇతర వర్గాల విషయానికి వస్తే రెడ్డి ఎమ్మెల్యేల్లో ఒకరికి చాన్స్ ఉంటుందని అంటున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వకుంటే వెలమ వర్గాన్ని పరిగణనలోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు చెప్తున్నారు. వెలమ కోటాలో ముగ్గురు నేతల పేర్లు వినిపిస్తున్నాయి.
- గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి కేబినెట్‌లో ఎవరికి స్థానం దక్కలేదు. ఇప్పటికే ఇక్కడ పార్టీ బలహీనంగా ఉండటం, రాష్ట్రానికి గుండెకాయ వంటి ప్రాంతానికి కేబినెట్లో ప్రాతినిధ్యం లేకపోవడం నష్టమన్న అంచనాలో పార్టీ ముఖ్యులు ఉన్నారు. దీనితో గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి ఒకరికి కేబినెట్ చాన్స్ రావొచ్చని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి.
- కేబినెట్ కూర్పులో స్థానం దక్కని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు కూడా ఈసారి ప్రాతినిధ్యం కల్పిస్తారని నేతలు చెప్తున్నారు.
- ఎవరికి చాన్స్ దక్కుతుందన్నదానిపై స్పష్టత లేకపోయినా.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, రెడ్డి లేదా వెలమ, జీహెచ్ఎంసీ, ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల కోటా లెక్కల్లోనే కేబినెట్ విస్తరణ ఉంటుందని చర్చ జరుగుతోంది.

హస్తినలో సీఎం రేవంత్‌రెడ్డి

నేడు సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరు

- కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవులపై హైకమాండ్‌తో చర్చ



శుక్రవారం ఢిల్లీ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత తొలిసారిగా సీఎం రేవంత్‌రెడ్డి హస్తినకు చేరుకున్నారు. రెండురోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి వచ్చిన రేవంత్‌రెడ్డి శనివారం జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొంటారు. కోడ్ ముగిసినందున కేబినెట్ విస్తరణతోపాటు నామినేటెడ్ పదవుల కేటాయింపునకు సంబంధించిన అంశాలపై పార్టీ హైకమాండ్‌తో చర్చించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవలి లోక్‌సభ ఫలితాల్లో ఇండియా కూటమి మెరుగైన ప్రదర్శన నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని కలిసి అభినందించనున్నారు. 2019లో తెలంగాణలో కేవలం మూడు లోక్‌సభ స్థానాలకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ , తాజా ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు గెలిచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని తాజా పరిస్థితి గురించి రాహుల్ సహా పార్టీ పెద్దలకు రేవంత్‌రెడ్డి వివరించే అవకాశాలున్నాయి. రేవంత్ ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవితో పాటు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పూర్తిస్థాయి నూతన పీసీసీ అధ్యక్షుడిని నియమించే అంశంపైనా హైకమాండ్‌తో చర్చించే అవకాశముందని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. కాగా శనివారం ఏఐసీసీ కార్యాలయంలో జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, సీడబ్ల్యూసీ సభ్యురాలు దీపాదాస్ మున్షీ, శాశ్వత ఆహ్వానితుడు, రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రత్యేక ఆహ్వానితుడు, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డిలు హాజరు కానున్నారు.

ప్రజలకు సీఎం మృగశిర కార్తె శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: మృగశిర కార్తె సందర్భంగా...రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. తొలకరి జల్లుల పలకరింపుతో పుడమి పులకరించిందని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు వృద్ధి చెందాలని, అన్నదాతల ఇంట సిరులు పండాలని కోరుకుంటున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో ఆకాంక్షించారు.

అన్నారం బ్యారేజీని పరిశీలించిన జస్టిస్ పీసీ ఘోష్ బృందం



అన్నారం బ్యారేజీని పరిశీలిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం(సరస్వతీ) బ్యారేజీని జస్టిస్ పినాకి చంద్రఘోష్ బృందం పరిశీలించింది. శుక్రవారం సాయంత్రం జస్టిస్ చంద్రఘోష్, ఇరిగేషన్ కార్యదర్శి ప్రశాంత్‌పాటిల్‌తో కలిసి అన్నారం బ్యారేజీకి వచ్చారు. బ్యారేజీ గేట్ల ముందు సీసీ బ్లాక్‌లు కొట్టుకుపోవడంపై ఇంజనీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. డిజైన్ ఆధారంగా పనులు చేపట్టలేదా అని అడిగారు. బ్యారేజీని శాశ్వతంగా బాగు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీలో 40 మీటర్ల మేర వేసిన ఇసుక మేటలను తొలగించగా.. ఆస్థానంలో ఏమైనా సీపేజీ బుంగలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. గ్రౌటింగ్ పనులను కూడా ఆయన పరిశీలించారు. వర్షాలు పడకముందే మరమ్మతులు చేయాలన్నారు. శనివారం ఉదయం ఆయన పెద్దపల్లి జిల్లాలోని సుందిళ్ల బ్యారేజీని సందర్శించనున్నారు. ఇంజనీర్లు శ్రీనివాస్, విజయ్ భాస్కర్, ఈఈ యాదగిరి తదితరులు వారి వెంట ఉన్నారు.

ఆదాయాన్ని పెంచండి!

ఆ మార్గాలపై దృష్టి పెట్టండి

- కీలక శాఖలకు డిప్యూటీ సీఎం ఆదేశం



శుక్రవారం అధికారులతో జరిగిన సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూర్చే శాఖల ఉన్నతాధికారులు, ఆదాయం పెంచే మార్గాలపై దృష్టి కేంద్రీకరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, భూగర్భ గనులు తదితర శాఖలు ఈ అంశంపై ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం సచివాయంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి వివిధ విభాగాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా మొదటి రెండు నెలలు కనబరిచిన పనితీరును సమీక్షించిన తరువాత ఆయా శాఖల్లో పనితీరు మెరుగుపరుచుకోవడానికి యంత్రాంగం సిద్ధం కావాలని సూచించారు. ఎటువంటి లీకేజీలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని పటిష్టపరిచి బడ్జెట్ అంచనాలను అందుకోవాలన్నారు. ఆదాయం పెంచుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖలో వేసిన కమిటీ పనితీరును డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ అంశంలో పురోగతిని తరచూ సమావేశాల ద్వారా సమీక్షించుకోవాలని సూచించారు.

తక్కువ వడ్డీ సంస్థలకు ఆర్టీసీ రుణాలు బదలాయించాలి

ఆర్టీసీ ప్రస్తుతం వివిధ బ్యాంకులు, సంస్థలకు చెల్లిస్తున్న రుణాల వడ్డీ రేటును సమీక్ష చేసుకొని, తక్కువ వడ్డీ రేటు ఇచ్చే సంస్థలకు రుణాలు బదలాయించాలని, ఆదాయం పెంచుకునే మార్గాలు వెతకాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఇటీవల సింగరేణిలో చేసిన ఈ ప్రయోగం ద్వారా వందల కోట్ల ప్రయోజనం చేకూరిన విషయాన్ని ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులకు వివరించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

ఎల్ఆర్ఎస్ కింద చేసుకున్న దరఖాస్తులు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి ఖజానాకు అదనపు ఆదాయం సమకూర్చాలని కోరారు. హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ పథకాల ద్వారా నిర్మించిన ఇళ్లు, వచ్చిన ఆదాయం వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా సామాన్యుడు సంతృప్తి చెందడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలను నెలవారీ చెల్లించే పద్ధతిని ఆచరణలో పెడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అమలు చేస్తున్న ప్యాకేజీల ధరలకే ప్రైవేటు ఆసుపత్రిలోనూ ఆయా చికిత్సలు అందించేలా వారితో చర్చించి ఒప్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ శ్రీదేవి, రవాణా శాఖ కమిషనర్ బుద్ధ ప్రసాద్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు డెల్టా ఎయిర్‌లైన్స్ ఆసక్తి



డెల్టా ఎయిర్‌లైన్స్ వైస్ ప్రెసిడెంట్ నారాయణన్ కృష్ణకుమార్‌తో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు

మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

- హైదరాబాద్ నుంచి అట్లాంటాకు విమానం నడపాలన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- కోకోకోలా గ్రూప్ డైరెక్టర్‌తో మంత్రుల భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెట్టుబడులకు డెల్టా ఎయిర్‌లైన్స్ సంస్థ ఆసక్తితో ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం అట్లాంటాలోని డెల్టా ఎయిర్‌లైన్స్ కార్యాలయంలో ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అండ్ సీటీఓ నారాయణన్ కృష్ణకుమార్‌తో తెలంగాణ మంత్రుల బృందం సమావేశమైంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సౌకర్యాలు కల్పిస్తుందని శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులకు వివరించారు. ఏవియేషన్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారిందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖంగా ఉన్నట్లు డెల్టా టీమ్ తెలిపిందని శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఇలావుండగా శ్రీధర్‌బాబుతో పాటు పర్యటనలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. హైదరాబాద్ నుంచి అట్లాంటాకు నేరుగా విమానం నడపాలని కృష్ణకుమార్‌ను కోరారు. నేరుగా విమాన సర్వీసులు లేకపోవడం వలన అమెరికాలో విద్యాభ్యాసం కోసం వచ్చే విద్యార్థులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కృష్ణకుమార్.. డెల్టా ఎయిర్‌లైన్స్ యాజమాన్యం ఈ దిశగా తక్షణం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

‘కోకో కోలా’ సానుకూల స్పందన

అట్లాంటాలోని కోకో కోలా హెడ్ క్వార్టర్స్‌లో కంపెనీ అంతర్జాతీయ ప్రభుత్వ సంబంధాల విభాగ గ్రూప్ డైరెక్టర్ జోనాథాన్ రీఫ్‌తో కూడా మంత్రులు సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. దాదాపు గంటన్నర పాటు జరిగిన సమావేశం సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన పరిస్థితులను విజువల్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులు వివరించారు. రాష్ట్రంలో ఎక్కడ ప్లాంట్ స్థాపించినా అందుకు ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి హామీ ఇచ్చారు. పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంగా మారిందని, రెండు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులు పెరిగాయని వివరించారు. సానుకూలంగా స్పందించిన జోనాథాన్ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పెట్టుబడుల శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి మంత్రులతో ఉన్నారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నికలో తీన్మార్ మల్లన్న గెలుపు

పోటీలో ఉన్న అభ్యర్థుల్లో 50 మంది ఎలిమినేట్

- మిగిలిన ఇద్దరిలో బీఆర్ఎస్ అభ్యర్థి కంటే ఆధిక్యంలో కాంగ్రెస్ అభ్యర్థి
- ఎన్నికల సంఘం వివరణ కోసం లేఖ రాసిన ఆర్ఓ హరిచందన
- ఈసీ నుంచి స్పష్టత రావడంతో అధికారికంగా ప్రకటించిన ఆర్ఓ



శుక్రవారం రాత్రి 12.45 గంటలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న మల్లన్న

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలిచారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత కూడా గెలుపునకు సరిపడా కోటా రాకపోయినప్పటికీ తీన్మార్ మల్లన్నకు అత్యధిక ఓట్లు ఉండడంతో ఆయన్నే విజేతగా ప్రకటించారు. గత నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ జరగ్గా, , నల్లగొండలో ఈ నెల 5వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. మూడు రోజులపాటు నిర్విరామంగా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. రెండోరోజు గురువారం రాత్రి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది.

మొదటి ప్రాధాన్యతతో రాని మెజారిటీ

మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థికీ గెలుపు టార్గెట్ కోటా అయిన 1,55,095 ఓట్లు రాలేదు. ఈ ఎన్నికల్లో 3,36,013 ఓట్లు పోల్ కాగా, అందులో 3,10,189 ఓట్లు చెల్లుబాటు అయినట్టు అధికారులు ప్రకటించారు. 25,824 ఓట్లు చెల్లలేదు. చెల్లుబాటు అయిన ఓట్లలో సగానికిపైగా అంటే 1,55,095 ఓట్లు గెలుపునకు టార్గెట్ కోటాగా నిర్ణయించారు. అయితే మొదటి ప్రాధాన్యత ఓట్లలో అత్యధికంగా తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి 1,04,248 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కు 29,697 ఓట్లు వచ్చాయి. మిగిలిన అభ్యర్థులందరికి కలిపి 10,118 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇందులో అత్యధికంగా ఓట్లు వచ్చిన మల్లన్న బీఆర్ఎస్ అభ్యర్థి కంటే 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. అయినా గెలుపు కోటా 1,55,095 ఓట్లు ఎవరికీ రాలేదు. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్లను గురువారం సాయంత్రం నుంచి లెక్కించారు.

రెండు ప్రాధాన్యతలోనూ దక్కని కోటా ఓట్లు

రెండో ప్రాధాన్యత ఓట్లలో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేసి వారికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లను ఆయా అభ్యర్థులకు (ఓటర్లు రెండో ప్రాధాన్యతను ఎవరికి ఇచ్చారో వారికి) కలుపుతూ లెక్కించారు. 48 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ తర్వాత తీన్మార్ మల్లన్నకు 1,24,899 ఓట్లు , రాకేష్‌రెడ్డికి 1,0,5,524 ఓట్లు , ప్రేమేందర్ రెడ్డికి 43,096 ఓట్లకు చేరుకున్నారు. అయినా గెలుపు కోటా ఓట్లు ఎవరికీ రాలేదు. దీంతో నాలుగోస్థానంలో ఉన్న స్వతంత్ర పాలకూరి అశోక్‌ను ఎలిమినేట్ చేసి, ఆయనకు వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఎవరికి ఇచ్చారో లెక్కించారు.అప్పటికీ గెలుపు కోటాకు అవసరమైన ఓట్లు రాలేదు. దీంతో మూడోస్థానంలో ఉన్న బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డిని ఎలిమినేట్ చేసి ఆయన ఓట్లు లెక్కించారు. అయినా కూడా గెలుపునకు సరిపడా ఓట్లు రాలేదు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేసిన 52 మంది అభ్యర్థుల్లో 50మందిని ఎలిమినేట్ చేశారు. అందులో ముందుగా నిర్ణయించిన గెలుపు టార్గెట్ ఓట్లు తీన్మార్ మల్లన్న, రాకేష్‌రెడ్డిలకు రాలేదు.

ఎన్నికల సంఘం వివరణకు లేఖ రాసిన ఆర్ఓ

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నికలో గెలుపునకు అవసరమైన టార్గెట్ కోటా ఓట్లు (1,55,095) ఎవరికీ రాకపోవడం, మెజారిటీలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను విజేతగా ప్రకటించాలా? లేదంటే సమీప ప్రత్యర్థి రాకేశ్‌రెడ్డికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించిన తర్వాత టార్గెట్ రీచ్ అయ్యే వరకు వేచి ఉండాలా అని, ఎన్నికల సంఘానికి రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన లేఖ రాశారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఈసీ నుంచి అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థిని విజేతగా ప్రకటించాలని సమాచారం అందింది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను విజేతగా ప్రకటిస్తూ ఆర్ఓ హరిచందన ధ్రువీకరణపత్రం అందజేశారు.

ఇది సమష్టి విజయం: తీన్మార్ మల్లన్న

నల్లగొండ టూటౌన్: ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తన విజయం..కాంగ్రెస్ నాయకుల సమష్టి విజయమని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. శుక్రవారం నల్లగొండలోని కౌంటింగ్ సెంటర్ మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం నూరు శాతం పట్టభద్రుల విజయం అన్నారు. తనకు టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి, గెలుపునకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులకు, తన టీం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు.

నైతిక విజయం నాదే : బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్: ఎమ్మెల్సీ ఉపఎన్నికలో సాంకేతికంగా ఓడిపోవచ్చు కానీ, బలంగా ఉన్న కాంగ్రెస్‌కు గట్టిపోటీ ఇచ్చి నైతికంగా తానే గెలిచానని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో సగం మంది పవర్‌ఫుల్ మంత్రులు ఉన్నారని, 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 32 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎంపీలున్న కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఇచ్చామని తెలిపారు. తనకు ఓటేసిన లక్షా 35 వేల మందికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు టికెట్ ఇచ్చిన కేసీఆర్ , గెలుపు కోసం కృషి చేసిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



ప్రాథమిక ఆధారాలున్నాయని ఎలా చెబుతున్నారో నాకర్థం కావడం లేదు!

క్లుప్తంగా...

గుర్తింపు ఉన్న కాలేజీల్లోనే చేర్చాలి

- ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శృతి ఓజా వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంటర్ బోర్డ్ గుర్తింపు ఉన్న కాలేజీల్లో మాత్రమే విద్యార్థులను చేర్పించాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శృతి ఓజా శుక్రవారం ఓ ప్రకటనలో విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. గుర్తింపు లేని కాలేజీ ల్లో చేర్పిస్తే పరీక్షలకు పంపడానికి ఇబ్బంది ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఏయే కాలేజీ లకు గుర్తింపు ఉందనే వివరాలను తమ వెబ్‌సైట్‌లో పేర్కొన్నామని, ఈ సైట్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నామని ఆమె తెలిపారు. tgbie.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా గుర్తింపు ఉందా? లేదా? అని తెలుసుకోవచ్చని సూచించారు.

‘బీసీ గురుకుల కాలేజీ’ల్లో రెండోవిడత ప్రవేశాల జాబితా విడుదల

- 14వ తేదీలోపు నిర్దేశించిన కాలేజీలో రిపోర్ట్ చేయాలి
- బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: బీసీ గురుకుల జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి రెండోవిడత ఎంపిక జాబితా శుక్రవారం సొసైటీ కార్యదర్శి బి.సైదులు విడుదల చేశారు. ఈ జాబితాను బీసీ గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో బీసీ గురుకుల కాలేజీల్లో 21,920 సీట్లు ఉండగా...మొదటి విడతలో 18,749 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేశామని, ఇందులో భాగంగా 10,562 మంది విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేశారన్నారు. మిగులు సీట్ల భర్తీకి రెండో జాబితాను తాజాగా విడుదల చేశామని, ఎంపికైన విద్యార్థులు ఈనెల 14వ తేదీలోగా కాలేజీలో రిపోర్టు చేయాలన్నారు.

‘కాళోజీ’ వీసీ పదవికి దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తూ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం.. దరఖాస్తు చేసు కునే వారు ఉన్నత స్థాయి యోగ్యత, నైతికతతో పాటు కనీసం పదేళ్ల విద్యానుభవం ఉండాలి. కనీసం రెండేళ్లు డీన్‌గా లేదా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉండాలి. నోటిఫికేషన్ జారీ తేదీ నాటికి దరఖాస్తుదారుల వయస్సు 67 ఏళ్లు దాటరాదు. అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ అనుభవాన్ని హైలైట్ చేసే వివరణాత్మక కరికులం వీటే కోసం ప్రొఫార్మా health.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దరఖాస్తును ఈ నెల 22వ తేదీ 5 గంటల వరకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కార్యదర్శి, వైద్య ఆరోగ్యశాఖ, రూమ్ నంబర్-17, మొదటి అంతస్తు, డాక్టర్. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్‌కు పంపించాలని సూచించారు.

‘అంగన్‌వాడీ’ల రిటైర్మెంట్ లబ్ధిని రెట్టింపు చేయాలి

- ప్రభుత్వానికి సంఘం నేతల వినతి

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ లబ్ధి పరిమితిని పెంచాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి ప్రభుత్వాన్ని కోరారు. అరకొర భృతితో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ లాభసాటిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకటి కరుణను తమ సంఘం ప్రతినిధులతో కలిశారు. అంగన్‌వాడీ టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50 వేల చొప్పున ఆర్థికసాయాన్ని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, కానీ ఈ మొత్తాన్ని రెట్టింపు చేయాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సాయం సరిపోదని వివరించారు. కార్యదర్శిని కలిసిన వారిలో సంఘం కోశాధికారి వేదవతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ తదితరులు ఉన్నారు.

బడిబాటలో కీలకం అమ్మ కమిటీలు

మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల చేరికల బాధ్యత కూడా..

- ప్రైవేటు, ప్రభుత్వ స్కూళ్లకు మధ్య ఉన్న తేడాలపై తల్లిదండ్రులకు వివరణ
- ప్రభుత్వ స్కూళ్లలోని సౌకర్యాలపై అవగాహన కల్పించనున్న కమిటీలు
- 19వ తేదీ వరకు కొనసాగనున్న కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు మరింత గురుతర బాధ్యత అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మౌలిక వసతుల కల్పనలో కీలక భూమిక పోషించబోయే ఈ కమిటీలు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమ నిర్వహణలోనూ క్రియాశీలంగా వ్యవహరించనున్నాయి. బడిబాట కార్యక్రమం శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొదలైంది. ఈ నెల 19వ తేదీ వరకూ ఇది కొనసాగుతుంది. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావడం, విద్యార్థుల చేరికల శాతాన్ని పెంచడం దీని ముఖ్యోద్దేశం. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో జరుగుతున్న కార్యక్రమమే అయినా, ఈసారి వినూత్నంగా నిర్వహించాలని, ప్రైవేటు, ప్రభుత్వ స్కూళ్లకు మధ్య ఉన్న తేడాలను తల్లిదండ్రులకు వివరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ స్కూళ్లపై అపోహలు తొలగించేలా..

ప్రైవేటు స్కూళ్లపై ప్రజల్లో ఉన్న మోజును తగ్గించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా కన్పిస్తోంది. ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య అందదనే అపోహ ఉందని, ఈ కారణంగానే ప్రైవేటు బాట పడుతున్నారనేది ప్రభుత్వ పరిశీలన. దీన్ని దూరం చేయాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే సర్కారీ స్కూళ్లలో ఉండే నాణ్యత, విద్యా ప్రమాణాలు, ఖర్చుపై బడిబాటలో భాగంగా అవగాహన కల్పించాలని, ఈ బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాలలు సమర్థవంతంగా నిర్వహించగలవని ప్రభుత్వం భావిస్తోంది. ప్రైవేటు స్కూల్‌లో చేరితే రూ.50 వేల నుంచి రూ 1.50 లక్షల వరకు ఖర్చవుతుందని, అలా కాకుండా ప్రభుత్వ స్కూళ్లల్లో చేర్పించి, ఆదా చేసే డబ్బును ఉన్నత చదువులకు ఉపయోగించవచ్చనే ఆలోచన ప్రజల్లోకి తీసుకెళ్లాలంటూ కమిటీలకు చెబుతున్నారు. ఇంగ్లిష్ విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం లాంటి అంశాలను ప్రజలకు వివరించాలని సూచించారు.



సౌకర్యాల కల్పనలో కమిటీలు..

రాష్ట్రంలో మొత్తం 26,823 ప్రభుత్వ పాఠశాలల్లో 20,680 చోట్ల ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన బాధ్యతను ఆ కమిటీలకు అప్పగించారు. 17,729 పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులన్నీ ఈ కమిటీలకు అప్పగించారు. పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, బ్లాక్ బోర్డులు, ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల తాత్కాలిక మరమ్మతుల పనులన్నింటినీ ప్రభుత్వం ఈసారి వేసవిలోనే మొదలు పెట్టింది. ఈ పనులకు రూ.667.25 కోట్లు కేటాయించింది. అందులో ఇప్పటికే రూ.147 కోట్లు కమిటీలకు అడ్వాన్సుగా చెల్లించింది.

ప్రైవేట్ ఇంటర్ కాలేజీలకు ముకుతాడు !

దోస్త్ తరహాలో ప్రవేశాలు.. విద్యాశాఖపై సీఎం సమీక్ష



సాక్షి, హైదరాబాద్ : ఇంటర్ ప్రవేశాలను కూడా పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు సంబంధించి ప్రణాళిక రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ప్రైవేట్ కాలేజీల పెత్తనాన్ని అడ్డుకోవాల్సిన అవసరముందని, ఇది ఏ విధంగా సాధ్యమనే అంశాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పలువురు ఉన్నతాధికారులతో సీఎం విద్యాశాఖపై శుక్రవారం సమీక్షించారు. సకాలంలో స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించాల్సిన అంశాన్ని ప్రస్తావించారు. ఇంటర్ కాలేజీల ఫీజులపై తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత ఉందనే విషయాన్ని సీఎం గుర్తించినట్టు తెలిసింది. దీనిని కట్టడి చేయడానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నట్టు సమాచారం. ఈ సందర్భంగా వీసీల నియామకం, పలు విద్యాశాఖ అంశాలపై చర్చించినట్టు తెలిసింది.

సమస్యలపై కదం తొక్కిన విద్యార్థులు



ఇంటర్ బోర్డ్ కార్యాలయం లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేస్తున్న విద్యార్థులు

- ఇంటర్మీడియెట్ బోర్డు కార్యాలయం ముట్టడి
- కార్పొరేట్ కాలేజీల ఆగడాలకు కళ్లెం వేయాలని డిమాండ్
- ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన

నాంపల్లి (హైదరాబాద్): రాష్ట్రంలో కార్పొరేట్ కాలేజీల ఆగడాలకు కళ్లెం వేయాలంటూ విద్యార్థులు కదం తొక్కారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు వేర్వేరుగా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పోలీసుల బారికేడ్లను తోసుకుంటూ కార్యాలయంలోనికి చొచ్చుకెళ్లారు. ఈ క్రమంలో పోలీసులకు, విద్యార్థుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ప్రసంగిస్తూ.. కార్పొరేట్ కాలేజీలపై ఇంటర్ బోర్డ్ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆరోపించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు కార్యాలయం గేట్లపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు రజనీకాంత్, ఇతర నాయకులతో కూడిన ప్రతినిధి బృందం ఇంటర్మీడియెట్ బోర్డ్ కమిషనర్ శృతి ఓజాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కాగా, రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలల అక్రమాలపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు నాగరాజు తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ నేతల అరెస్టు..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇంటర్ బోర్డ్ వద్ద ఆందోళనకు దిగిన ఏఐఎస్ఎఫ్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి నుంచి బేగంబజార్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు పీఎస్ వద్ద ఉంచి వదిలిపెట్టారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని, అనుమతులు లేని కళాశాలల జాబితాను బహిర్గతం చేయాలని కోరుతూ ముట్టడి నిర్వహించారు.

తహసీల్దార్లను పాత స్థానాలకు పంపండి

మంత్రి పొంగులేటికి ట్రెసా విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బదిలీ చేసిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను తిరిగి వారి పాత స్థానాలకు పంపాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సచివాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసింది. వీఆర్ఏ సమస్యలు పరిష్కరించాలని, వీఆర్వోలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని కూడా అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, కార్యదర్శి వేణు, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు గోల్కొండ సతీశ్ తదితరులున్నారు.

లతాశ్రీ మూల్యాంకనంలో అధికారులదే తప్పు

- విద్యార్థినికి 9.3 సీజీపీఏతో కొత్త మెమో

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: ఓ విద్యార్థినికి ఎస్సెస్సీ పరీక్షల్లో జరిగిన అన్యాయంపై ‘సాక్షి’దినపత్రిక వెలువరించిన కథనంపై టెన్త్ పరీక్షల విభాగం స్పందించింది. ఇందుకు బాధ్యులైన అసిస్టెంట్ ఎగ్జామినర్‌పై చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది. ‘తొలుత ఫెయిల్..రీ వ్యాల్యుయేషన్‌లో 90% మార్కులు’ అనే శీర్షికతో ‘సాక్షి’దిన పత్రికలో ఓ కథనం ప్రచురితమైంది. మేడ్చల్ జిల్లా సూరారం శివాలయనగర్‌కు చెందిన లతాశ్రీ అనే విద్యార్థిని ఇంగ్లిష్ పేపర్‌లో ఫె యిల్ అయింది. దీంతో ఆమె రీవెరిఫికేషన్ చేయించింది. సమాధాన పత్రంలో 74 మార్కులు వచ్చినట్టు తేలింది. దీంతో ఆమె ఫలితాన్ని 9.3 సీజీపీఏగా మార్చు చేసి, కొత్త మెమోను పంపాలని బోర్డ్ నిర్ణయించింది. ఈ వ్యవహారంలో తప్పు చేసి న సంబంధిత ఎగ్జామినర్‌పై చర్య తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిని పరీక్షల విభాగం సంచాలకుడు కృష్ణారావు ఆదేశించారు.

వ్యవసాయ అధికారుల సస్పెన్షన్

సాక్షి,హైదరాబాద్: ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించిన పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో జరిగిన అక్రమాలపై వ్యవసాయశాఖ తీవ్రంగా స్పందించింది. దీనికి బాధ్యులైన అధికారులపై సస్పెన్షన్ వేటు వేసింది. మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూర్ మండల వ్యవసాయ అధికారి సోమకుమార్ యాదవ్, ఏఈవో ఎం.జమున, ఏ.దీపిక, అరవింద్‌లను సస్పెండ్ చేస్తూ వ్యవసాయశాఖ నిర్ణయం తీసుకుంది.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నీట్–పీజీ మాక్ టెస్ట్!

సాక్షి, హైదరాబాద్: జనరల్ మెడిసిన్, రేడియాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, సైకియాట్రీ, అనస్థీషియాలజీ మొదలైన స్పెషలైజేషన్లలో వారి భవిష్యత్ కెరీర్‌లకు పునాది వేయడానికి ఔత్సాహిక వైద్యులకు నీట్–పీజీ చాలా కీలకమైన పరీక్ష. పీజీ మెడికల్ స్టడీస్ ప్రాముఖ్యతను గుర్తిస్తూ, సాక్షి మీడియా గ్రూప్ జూన్ 16, 2024న.. విద్యార్థులకు చేయూతనిచ్చేలా నిపుణుల ఆధ్వర్యంలో నీట్–పీజీ మాక్ పరీక్షను నిర్వహిస్తోంది. పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, మరింత మెరుగుపరచుకోవచ్చు. ఈ మాక్ టెస్ట్ క్లినికల్ నాలెడ్జ్, ఎగ్జామ్–టేకింగ్ స్ట్రాటజీలను పదును పెట్టడంలో సహాయపడటమే కాకుండా, నిజమైన నీట్–పీజీలో రాణించడానికి అభ్యర్థుల సన్నద్ధతను నిర్ధారిస్తుంది. ఈ మాక్ పరీక్షకు ‘మై ర్యాంక్ టెక్నాలజీ పార్టనర్‌గా వ్యవహరిస్తోంది.

ఆసక్తి గల అభ్యర్థులు రూ. 500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి https://www.arenaone.in/mock/neetpg ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లాగిన్ హాల్ టికెట్ నెంబర్, పాస్‌వర్డ్ పరీక్షకు రెండు రోజుల ముందు అభ్యర్థి రిజిస్టర్ చేసుకున్న ఈ-మెయిల్ ఐడీ/ఫోన్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది. మాక్ పరీక్ష ఆన్‌లైన్‌లో https://sakshimocktest.myrank.co.in లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎప్పుడైనా లాగిన్ అయి రాసుకోవచ్చు. పరీక్ష సమయం మూడు గంటల 30 నిముషాలు. అలాగే పరీక్ష ముగిసిన వెంటనే మీ స్కోర్‌ను కూడా మీరు చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్లు: 99126 71555, 96660 13544, 96665 72244

ప్రైవేట్ వర్సిటీల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

కాచిగూడ(హైదరాబాద్): ప్రైవేట్ యూనివర్సిటీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ప్రవేశ పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన వెంటనే చేపట్టి పంచాయతీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని అన్నారు. శుక్రవారం కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఇతర నేతలు నీల వెంకటేశ్, వేముల రామకృష్ణలతో కూడిన ప్రతినిధి బృందం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వివిధ అంశాలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీల సమస్యలపై ఆర్.కృష్ణయ్య మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చించారు. పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఇస్తున్న మాదిరిగా బీసీ విద్యార్థులకు కూడా మొత్తం ఫీజులు చెల్లించే స్కీంను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, కులగణనను త్వరలోనే చేపడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని ఆర్.కృష్ణయ్య తెలిపారు.

ప్రైవేటు స్కూళ్లలో పుస్తకాల అమ్మకాలపై స్పష్టత ఇవ్వండి

- ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు స్కూళ్లలో పాఠ్య, నోటు పుస్తకాల అమ్మకం తీవ్ర వివాదం రేపుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై స్పష్టత ఇస్తూ మార్గదర్శకాలు ఇవ్వాలని రాష్ట్రంలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం కోరుతోంది. వివాదం నేపథ్యంలో సంఘం ప్రతినిధులు గతంలోనే విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసారు. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అమ్మడం చట్ట విరుద్ధం కాదని, దీనిపై రాష్ట్ర హైకోర్టు కూడా స్పష్టత ఇచ్చిందని వివరించారు. దీంతో దీనిపై దృష్టి పెట్టిన అధికారులు.. స్కూళ్లపై దాడులు చేయవద్దంటూ కింది స్థాయి అధికారులకు అప్పట్లోనే ఆదేశాలు జారీ చేశారు. అయినా దాడులు కొనసాగుతుండటంతో ఈ వ్యవహారంపై స్పష్టత ఇస్తూ మార్గదర్శకాలు ఇవ్వాలని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు కోరుతున్నాయి.

ఏమిటీ వివాదం?

ప్రైవేటు స్కూళ్లలో పుస్తకాల అమ్మకాలను నిషేధిస్తూ ప్రభుత్వం 2010లో జీవో విడుదల చేసింది. స్కూళ్ల యాజమాన్యాలు దీన్ని హైకోర్టులో సవాల్ చేశాయి. విద్యార్థుల తల్లిదండ్రులు పుస్తకాల కోసం అనేక చోట్ల తిరగకుండా, అవసరమైన స్టేషనరీ తామే అమ్ముతున్నామన్నారు. ఈ వాదనను హైకోర్టు సమర్థిస్తూ 2015లో ఉత్తర్వులు ఇచ్చింది. ఎలాంటి లాభాపేక్ష లేకుండా (నో ప్రాఫిట్, నో లాస్) అమ్ముకోవచ్చని తెలిపింది. అయితే ఈ విషయాన్ని పాఠశాల విద్యా శాఖ జిల్లా అధికారులకు వివరించకపోవడంతో వారు తమపై దాడులు చేస్తున్నట్టు స్కూల్ యాజమాన్యాలు చెబు తున్నాయి. విద్యార్థి సంఘాలు కూడా ఆందోళనలు చేస్తున్నారని అంటున్నాయి. అయితే విద్యాశాఖ తాజాగా మే 27వ తేదీన ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, ఇతర స్టేషనరీ, యూనిఫాంలు, షూస్ అమ్మకూడదంటూ ఉత్తర్వులు ఇవ్వడంతో యాజమాన్యాలు మరో సారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళాయి. ఈ వ్యవహారంపై పాఠశాల విద్య కమిషనర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె స్పందించ లేదు.

అన్ని స్కూళ్లనూ ఒకే గాటన కట్టొద్దు



రాష్ట్రంలోని 11,500 ప్రైవేటు స్కూళ్లకు గాను 10 వేలు బడ్జెట్ స్కూళ్లే. వీటి ల్లో ఫీజులు చాలా తక్కువ. విద్యార్థుల సౌకర్యం కోసమే స్టేషనరీ నిర్వహిస్తున్నాయి. ఒక్క పైసా కూడా ఇందులో లాభాలు తీసుకోవడం లేదు. అలా తీసుకున్నట్టు ఆధారాలుంటే చర్య లు తీసుకోవాలి. అంతే తప్ప పెద్ద స్కూళ్ల దోపిడీ చేస్తుంటే మమ్మల్ని హింసించడం అన్యాయం.
– సాదుల మధుసూదన్ (ట్రస్మా అధ్యక్షుడు)

రాష్ట్రంలో 220 రకాల వరి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీని విస్తరిస్తామన్న మంత్రి ఉత్తమ్
- హైదరాబాద్‌లో గ్లోబల్ రైస్ సమ్మిట్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో 220 వెరైటీల వరి సాగు జరుగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. ఇందులో 60 శాతం ముతక రకాలు ఉన్నాయని చెప్పారు. కొత్త ప్రభుత్వం స్థానికంగా, ప్రపంచ మార్కెట్‌లో ఎక్కువ గిరాకీ ఉన్న మంచి రకాల వరి వైపు వెళ్లేలా రైతులను ప్రోత్సహించడానికి అన్ని ప్రయత్నాలు చేసిందని అన్నారు. గ్లోబల్ రైస్ సమ్మిట్–2024 శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యింది. రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, 30 దేశాల నుంచి 250 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

వరి సాగులో రాష్ట్రం నంబర్ వన్

వరి సాగులో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని మంత్రి తుమ్మల ఈ సందర్భంగా పేర్కొన్నారు. కొన్నేళ్లుగా రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. గతేడాది 1.2 కోట్ల ఎకరాలు సాగవగా, 26 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగిందని తెలిపారు. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన సూపర్ ఫైన్ రైస్ రకం తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048) దేశవ్యాప్తంగా ప్రజాదరణ పొందిందన్నారు.



గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో ఉత్తమ్, తుమ్మల తదితరులు

రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా రాష్ట్రం: ఉత్తమ్

తెలంగాణ రాష్ట్రం రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా అవతరించిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల రైతులు ఒక సంవత్సరంలోనే 2 , 3 సార్లు వరి పండిస్తారని చెప్పారు. రాష్ట్రంలో రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీని విస్తరిస్తామని తెలిపారు.

డిగ్రీలో బయోమెడికల్

14 కాలేజీల్లో కొత్తగా ఈ ఏడాది నుంచే మొదలు

- ప్రతీ కాలేజీలో 50 సీట్లు
- ఫార్మా, కార్పొరేట్ సంస్థలతో ఎంఓయూలో ఉంటేనే అనుమతి
- ఉన్నత విద్యామండలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కొన్ని కాలేజీల్లో ఈ ఏడాది నుంచి బీఎస్సీలో బయోమెడికల్ కోర్సు అందుబాటులోకి తెస్తున్నారు. నా లుగేళ్ల కాలపరిమితి గల ఈ కోర్సుకు మంచి భవిష్యత్ ఉంటుందని భావిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులు, ఫార్మా ఇండస్ట్రీలో క్రియాశీలపాత్ర పోషించేస్థాయిలో దీనిని తీర్చిదిద్దాలని కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నారు. ఉన్నత విద్యామండలి వైస్ చాన్సలర్ ఎస్‌కే.మహ్మమూద్ దీనిపై కొన్నేళ్లుగా కసరత్తు చేస్తున్నారు. పలు ఫార్మాకంపెనీలు, కార్పొరేట్ వైద్యరంగంలోని ముఖ్యసంస్థలతో ఆయన నేరుగా చర్చలు జరిపి, అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు సహకరించారు. మరోవైపు ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, కార్యదర్శి శ్రీరాంవెంకటేశ్ బోధన ప్రణాళిక రూపొందించడంపై దృష్టి పెట్టారు. దీనిని ఇప్పటికే అన్ని యూనివర్సిటీలకూ పంపారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో అనేక వైద్య విధానాలు అమలు చేస్తున్నారు. వీటి నిర్వహణకు అవసరమైన మానవవనరుల కొరత వేధిస్తోంది. బయోమెడికల్ కోర్సు లో దీనిపై ప్రత్యేక బోధన అంశాలు చేర్చారు. కార్పొరేట్ ఆస్పత్రులు, ఫార్మా కంపెనీల్లో నైపుణ్యశిక్షణ కూడా ఇస్తారు. రాష్ట్రంలో 15 కాలేజీల్లో ఈ ఏడాది దీనిని అనుమతిస్తున్నా రు. ప్రతీ కాలేజీలో 50 సీట్లకు పరిమితి పెట్టా లని నిర్ణయించారు. ఉన్నత విద్యామండలి శుక్రవారం సమావేశమై దీనిపై సమగ్రంగా చర్చించింది. రెడ్డీస్ లేబరేటరీస్, నిమ్స్, మ హావీర్‌తో పాటు పలు ఫార్మా కంపెనీల ప్రతినిధులు, ఆంధ్ర మహిళాసభ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.



కార్యకారణ స్వరూపుడైన ఆ పరబ్రహ్మ తత్వాన్ని తెలుసుకొనడంతోనే, ఈ జీవాత్మ హృదయంలోని చిక్కుముడులు విడిపోతాయి. సంశయాలన్నీ తొలగిపోతాయి. సమస్త శుభాశుభ కర్మలూ నష్టమైపోతాయి.
– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 8 జూన్ 2024

విలువల జాడేది?!

వేదికలపై గంభీరోపన్యాసాలు చేయడంలో, విలువల గురించి మాట్లాడటంలో మన నాయకులకు ఎవరూ సాటిరారు. ఆ ఉపన్యాసాలకూ, ఆచరణకూ పెద్దగా పొంతనవుండదు. శుక్రవారం జరిగిన ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్, టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ప్రసంగాలు ఈ సంగతిని మరోసారి ధ్రువీకరించాయి. అన్ని నిర్ణయాలూ ఏకాభిప్రాయం ప్రాతిపదికనే తీసుకుంటామని మోదీ ప్రకటించారు. మంచిదే. గత అయిదేళ్ల పాలనలో ఏకాభిప్రాయం జాడ ఎక్కడా కనబడకపోగా చాలా నిర్ణయాలు విపక్షాన్ని సభనుంచి గెంటేశాక మూజువాణి ఓటుతో ఆమోదం పొందాయి. ఆ నిర్ణయాలపై తీవ్ర విమర్శలూ వచ్చాయి. ప్రతిఘటన కూడా ఎదురైంది. బహుశా అందువల్లే కావొచ్చు... 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా వచ్చిన మెజారిటీ ఈసారి మాయమైంది. మిత్రపక్షాలపై ఆధారపడక తప్పని స్థితి ఏర్పడింది. రామమందిర నిర్మాణం లక్ష్యంగా ఉద్యమాన్ని నడిపి, దానిమాటున మూడున్నర దశాబ్దాలుగా ఎదుగుతూ వచ్చిన బీజేపీ... తీరా ఆలయ నిర్మాణం కొనసాగుతున్న దశలో కనీస మెజారిటీకి దూరంకావటం, యూపీలో సగంపైగా సీట్లు కోల్పోవటం కేవలం యాదృచ్ఛికమని మోదీ చెప్పగలరా? చివరకు అయోధ్య ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గాన్ని సైతం బీజేపీ కోల్పోవలసి వచ్చిందని ఆయనకు గుర్తుందో లేదో! అయోధ్య ప్రాంతంలోని 9 స్థానాల్లో 5, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి ప్రాంతంలోని 12 స్థానాల్లో తొమ్మిదింటిని ఈసారి బీజేపీ చేజార్చుకుంది. బీజేపీ హిందుత్వ ప్రాజెక్టుకు ఈ రెండు ప్రాంతాలూ ఆయువుపట్టు. అంతేకాదు... వివిధ రాష్ట్రాల్లో బీజేపీ 2019 ఎన్నికల్లో 50 శాతంపైగా వోట్లతో 224 స్థానాలు గెల్చుకోగా, ఇప్పుడు ఆ సంఖ్య 156కి పడిపోయింది. బీజేపీ 500 కంటే తక్కువ వోట్లతో గెలిచిన స్థానాలు 30... వేయి కంటే తక్కువ వోట్లతో గెలిచిన స్థానాలు 100 ఉన్నాయి. ఇండియా కూటమి, మరీ ముఖ్యంగా అందులోని సమాజ్‌వాదీ పార్టీ దాదాపు అన్నిచోట్లా గణనీయంగా కోలుకుంది. తమ గెలుపును ఓటమిగా చిత్రిస్తున్న కాంగ్రెస్‌ను విమర్శిస్తూ ఇప్పుడూ, గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకొచ్చిన మొత్తం సీట్ల సంఖ్యతో పోల్చినా ఈసారి తమకొచ్చిన స్థానాలు చాలా ఎక్కువని ఎద్దేవా చేయటం బాగానేవుంది. అయితే జరిగిందేమిటో లోతుగా విశ్లేషిస్తే సత్యం బోధపడుతుంది. మోదీ పైకేమి మాట్లాడినా నిరుపేదలూ, మధ్యతరగతి తమకు క్రమేపీ దూరం జరుగుతున్నారని బీజేపీకి అర్థమయ్యే ఉంటుంది. అందుకే ఈసారి ఆ రెండు వర్గాలకూ కొత్తగా సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నట్టు తెలిపారు. పార్లమెంటులో ఏ అంశంపైన అయినా చర్చ జరిగినప్పుడు ఉపన్యాస పోటీలుగా భావించి మాట్లాడటంకాక ఆరోగ్యకరమైన చర్చలకు చోటీయడం ఎంతో అవసరం.

ఎన్‌డీఏ సహజసిద్ధమైన కూటమని, ఇందులో అధికార యావలేదని మోదీ చెప్పటం కూడా వింతగానే ఉంది. ఇప్పుడు ఎన్‌డీఏకు మద్దతుగా నిలిచిన నితీశ్, చంద్రబాబులిద్దరూ ఊగిసలాటకు పెట్టింది పేరు. నిలకడ తక్కువ, అవకాశవాద రాజకీయం ఎక్కువ. ఏ గట్టున బాగుంటుందనుకుంటే అటు దూకే బాపతు. 2014 ఎన్నికల్లో ఏపీలో బీజేపీతో కలిసి ప్రయాణించిన చంద్రబాబు 2019 ఎన్నికల్లో హఠాత్తుగా కాడి పారేసి విడిగా ఎందుకు పోటీ చేశారో, అంతకు సంవత్సరం ముందు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఎందుకు అంటకాగారో ఎవరైనా చెప్పగలరా? తరచు యూటర్న్‌లు తీసుకోవటంలో నితీశ్, చంద్రబాబులకు పోటీ పెడితే ఎవరు ప్రథమ స్థానం గెల్చుకుంటారో చెప్పటం కొంత కష్టమే. ఇలాంటివారిని పక్కనబెట్టుకుని 'ఇది సహజసిద్ధమైన కూటమి, సుపరిపాలన కోసం కలిశాం' అంటూ పెద్ద పెద్ద మాటలు వల్లిస్తే నమ్మడానికి దేశ ప్రజలు తెలివితక్కువవారు కాదు. మోదీని చంద్రబాబు పొగడ్తలతో ముంచడంమాట అలావుంచి 2014లోనే 'మీరు పదిహేనేళ్లు అధికారంలో వుంటారని బాబు జోస్యం చెప్పార'ని జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ అనటం ఆశ్చర్యం కలిగిస్తుంది. మరి 2019లో వీరిద్దరూ ఎన్‌డీఏ నుంచి ఎందుకు బయటకొచ్చినట్టు... ఇప్పుడెందుకు కలిసినట్టు? ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్య కథనాలు ప్రచారంలో పెట్టి, చివరకు కేంద్రమే ప్రతిపాదించిన భూ యాజమాన్య హక్కు చట్టంపై ప్రజానీకాన్ని పక్కదోవ పట్టించి బాబు లాభపడ్డారు. విలువలన్నిటినీ గాలికొదిలి ఏం చేసైనా అధికారంలోకి వచ్చితీరాలన్న పట్టుదలతో వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అత్యంత హీనంగా దుర్భాషలాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ తదితరులు ఏం మాట్లాడినా మౌనంగా ఉండిపోవటమో, ఆలస్యంగా స్పందించటమో చేసిన కేంద్ర ఎన్నికల సంఘం పెద్దలను అనుకరిస్తూ ఏపీలో ఏం జరిగినా, బాబు తదితరులు అవాకులూ చవాకులూ మాట్లాడినా ప్రధాన ఎన్నికల అధికారి ఉలుకూ పలుకూ లేకుండా నిమిత్తమాత్రుడిగా మిగిలిపోయారు. ఆఖరికి పోలైన వోట్లకన్నా గెలిచిన అభ్యర్థికి అధికంగా వోట్లు వచ్చిన ఉదంతాలు అక్కడక్కడ బయటపడ్డాయి. ఇలాంటి అక్రమాలతో గట్టెక్కాలనే కాళ్లావేళ్లాపడి మరీ బాబు ఎన్‌డీఏలోకి లంఘించారు.

వేదికలెక్కి విలువల గురించి గంభీరోపన్యాసాలు చేసేముందు మొన్న ఎన్నికల్లో తమ ప్రవర్తన ఎలావుందో, ఏం మాట్లాడామో చూసుకోవటం వారికే మంచిది. పిల్లి కళ్లు మూసుకుని పాలుతాగిన చందాన వేదికలెక్కి విన్యాసాలు చేస్తే జనం నవ్విపోతారని నరేంద్ర మోదీతోపాటు ఎన్‌డీఏ భాగస్వామ్యపక్ష నేతలు తెలుసుకోవాలి. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. కానీ ఉన్నన్నాళ్లూ ఏం చేశారో, ఎలా మెలిగారో ప్రజలు గమనిస్తూనే ఉంటారు.

ట్రంప్ కోర్టు పోలింగ్ బూతేనా?

విశ్లేషణ



మనోజ్ జోషి

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను న్యాయస్థానం దోషిగా తేల్చిన తర్వాత ఆ దేశ రాజకీయాలు మరింత విభజనకు గురయ్యాయి. వాస్తవానికి, ఈ న్యాయవిచారణ ట్రంప్ బలహీనతను, అస్థిర ప్రవర్తనను నొక్కిచెప్పింది. పాత అమెరికాలో, ఒక అభ్యర్థిపై నేర నిర్ధారణ జరిగితే అది ఆయన విజయావకాశాలపై తీవ్ర ప్రభావం చూపేది. కానీ ఇప్పుడు ఇది ట్రంప్ అమెరికా. విషయాలు అక్కడ భిన్నంగా జరుగుతున్నాయి. ఒకవేళ ఆయన తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికైతే తన దేశానికే కాదు, ప్రపంచానికి కూడా తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయి. ట్రంప్‌తో భారతదేశ సంబంధాలు బాగానే ఉన్నప్పటికీ, గత మూడేళ్లలో జరుగుతున్నట్టుగా ద్వైపాక్షిక సంబంధాలను నిర్మించడంలో క్రమబద్ధమైన కృషి మాత్రం ఆయన హయాంలో జరగలేదు.

అమెరికా మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌ను తప్పుడు వ్యాపార రికార్డులపై 34 అంశాల్లో న్యాయస్థానం దోషిగా నిర్ధారించిన తర్వాత అమెరికా మరింతగా విభజనకు గురయింది. స్వభావ రీత్యా, ఈ కేసు చిన్నదే. కానీ న్యాయప్రక్రియను అపహాస్యం చేయడం ద్వారా, ప్రాసిక్యూటర్‌లపై, న్యాయమూర్తిపై కూడా ఎదురుదాడికి దిగుతూ కేసును ఎదుర్కొనాలని ట్రంప్ బృందం తీసుకున్న నిర్ణయం ఈ కేసును విషపూరితం చేసింది.

ట్రంప్ ఇప్పుడు దీనిపై అప్పీల్ చేయనున్నారు. అయితే దీనిపై విచారణ జరగడానికి సంవత్సరాలు కాకపోయినా, నెలల సమయం పడుతుంది. ఒకవేళ తాను ఓడిపోయి, ఆ తర్వాత కేసు తారుమారైతే, అది అమెరికా న్యాయ వ్యవస్థ విచ్ఛిన్నమైనదనే ట్రంప్ మద్దతుదారుల అభిప్రాయాలను ధ్రువీకరిస్తుంది. మరోవైపు, ఇవన్నీ ఉన్నప్పటికీ ట్రంప్ గెలిచినట్లయితే, ఆ వ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉందో అది వెల్లడిస్తుంది. ట్రంప్ న్యాయ ప్రక్రియను కొట్టిపడేస్తూ, 'మనం ఫాసిస్ట్ రాజ్యంలో జీవిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. ట్రంప్ తనను తాను అభివర్ణించుకున్నట్లుగా 'ఎంతో అమాయకపు వ్యక్తి'పై జరుగుతున్న ఈ విచారణ ఒక బూటకమని ఆయన మద్దతుదారులు అంటున్నారు. ఆయన తనను 'రాజకీయ ఖైదీ'గా చెప్పుకొంటున్నారు. పైగా అవకాశం వచ్చినప్పుడు తన ప్రత్యర్థులందరూ కూడా నేరారోపణలను ఎదుర్కొనే దశలోకి అమెరికా ప్రవేశిస్తోందని ట్రంప్ పార్టీ(రిపబ్లికన్) హెచ్చరించింది.

ప్రత్యేకించి ఓటర్లలో ఆదరణ లేని ఇద్దరు ప్రధాన అభ్యర్థుల మధ్య జరుగుతున్న విచిత్రమైన రేసులో ఈ తీర్పు ఒక అస్థిరమైన, నాటకీయమైన అంశాన్ని ప్రవేశపెట్టింది. పాత అమెరికాలో, ఒక అభ్యర్థిపై నేర నిర్ధారణ అతని లేదా ఆమె అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపేది. కానీ ఇప్పుడు ఇది ట్రంప్ అమెరికా. ఇక్కడ విషయాలు భిన్నంగా జరుగుతున్నాయి. ఈ తీర్పు నిజానికి ఆయనకు రిపబ్లికన్ పార్టీ మద్దతును మరింతగా బలపరిచింది. తీర్పు వెలువడిన వెంటనే ట్రంప్ ప్రచారానికి వచ్చిన 52.8 మిలియన్ అమెరికన్ డాలర్ల రూపంలో ఇది వ్యక్తమయింది.

మరోవైపు డెమోక్రాట్లు తమ ప్రత్యర్థిని, ప్రస్తుతం అగ్రగామిగా ఉన్న వ్యక్తిని న్యాయస్థానం దోషిగా నిర్ధారించినందుకు సంబరాలు చేసుకుంటున్నారు. అధ్యక్షుడు జో బైడెన్ ఈ అంశంపై వ్యాఖ్యానించడంలో జాగ్రత్తగా ఉన్నారు. కానీ ఆయన న్యాయవ్యవస్థను సమర్థించారు. పైగా, తీర్పు తమకు ఇష్టం లేదు కాబట్టి దాన్ని ఎవరైనా ప్రశ్నించడం అనేది 'నిర్లక్ష్యపూరితమైనది, ప్రమాదకరమైనది, బాధ్యతారాహిత్యంతో కూడుకున్నది' అని అన్నారు.



అమెరికా మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్

ఈ కేసుకి సంబంధించిన అంశాలు చిన్నవిగానే ఉన్నప్పటికీ, ఇది బూటకపు విచారణ కాదు. సమర్పించిన సాక్ష్యాలు చేసిన నేరాలను నిర్ధారిస్తాయి. అవి ట్రంప్ జీవించే నీచమైన ప్రపంచానికి చెందిన సంగ్రహావలోకనాన్ని కూడా అందించాయి. ఆయన మద్దతుదారులు ఏం చెప్పినా సరే... జ్యూరీ ఆయన్ని ఏకగ్రీవంగానూ చాలా త్వరితంగానూ మొత్తం 34 అంశాల్లో దోషిగా నిర్ధారించింది. పైగా ఇది ట్రంప్ ఎదుర్కొనే ఆరోపణలలో ఒకటి మాత్రమే; మరో మూడు తీవ్రమైన ఆరోపణలు కూడా ఉన్నాయి. కానీ రిపబ్లికన్ల మనస్సులో, ఈ కేసులు 'న్యాయ వ్యవస్థ ఆయుధీకరణ' ఫలితం మాత్రమే.

వీటిలో రెండు కేసులు 2020 ఎన్నికల ప్రక్రియకు నష్టం గావించడంలో ట్రంప్ పాత్రకు సంబంధించినవి. ఇక మూడవ కేసు, వైట్ హౌస్ నుండి నిష్క్రమించిన తర్వాత ఉద్దేశపూర్వకంగా రహస్య పత్రాలను ట్రంప్ తన వద్ద ఉంచుకున్నట్లు చెబుతోంది. అమెరికా న్యాయ వ్యవస్థలో ఒక భాగం ఇప్పటికీ సమర్థంగా పనిచేస్తున్నప్పటికీ, అమెరికా సుప్రీంకోర్టుతో సహా ఇతర విభాగాల పక్షపాత దృష్టి కారణంగా ట్రంప్‌పై ఇతర కేసులను అధ్యక్ష ఎన్నికలకు ముందుగా విచారించలేరని న్యూయార్క్ కోర్టు తీర్పు సూచించింది. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు ముఖ్యమైన 'న్యాయస్థానం' పోలింగ్ బూత్ మాత్రమే.

ట్రంప్‌నకు ఉన్మాదపూరితమైన ఓటర్ బలం ఉంది. ఇది ఈ తీర్పు ద్వారా మరింత పెరిగింది. కానీ అది మాత్రమే ఆయనకు ఎన్నికల్లో గెలుపును ఇవ్వలేదు. తక్కువ ఉత్సాహవంతులైన, నేరారోపణలను బట్టి దూరం జరిగే వ్యక్తుల మద్దతు ఆయనకు అవసరం. వాస్తవానికి, ఈ న్యాయవిచారణ ట్రంప్ బలహీనతను, అస్థిర ప్రవర్తనను, కుంభకోణాలతోపాటు ఆయన అసభ్య ప్రవర్తనను నొక్కిచెప్పింది.

ఈ తీర్పు వెలువడిన వెంటనే నిర్వహించిన 'యూ–గవ్' పోల్‌లో 27 శాతం మంది ట్రంప్‌నకు ఓటు వేసే అవకాశం తక్కువగా ఉందనీ, 26 శాతం మంది అలా వేసే అవకాశం ఎక్కువగా ఉందనీ, 39 శాతం మంది తీర్పు తమ ఓటు విధానాన్ని ప్రభావితం చేయదనీ చెప్పారు.

ఇవి పూర్తిగా విభజనకు గురైన అమెరికన్ రాజకీయ వ్యవస్థ క్షీణత లోతును పట్టి చూపే భయంకరమైన సంకేతాలు. దేశంలోని సగం మంది మరొకరి అభిప్రాయాలను సహించటానికి ఇష్టపడకపోవటంతో, పెద్ద సంఖ్యలో అమెరికన్లు మూడవ పార్టీలకు ఓటు వేయడం లేదా ఎన్నికలకు దూరంగా ఉండడం కూడా మనం చూడవచ్చు.

ట్రంప్ పదవికి పూర్తిగా అనర్హుడన్న విషయం ఈపాటికే స్పష్టం అయింది. అయినా సరే... ఆయన తిరిగి ఎన్నికైతే, తన దేశానికే కాదు, ప్రపంచానికి, భారతదేశానికి కూడా తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయి. ఉక్రెయిన్, గాజాలో జరుగుతున్న యుద్ధాల వల్ల ప్రపంచం అతలాకుతలం అవుతోంది. పైగా తైవాన్‌లో ఒక ప్రమాదం పొంచి ఉన్నందున, అమెరికా నాయకత్వ పాత్ర చాలా ముఖ్యమైనది. చైనాతో తలపడుతున్న భారత్ భద్రతకు అమెరికా భాగస్వామ్యం ముఖ్యం.

అధ్యక్షుడు బైడెన్ హయాంలో... దక్షిణ కొరియా, జపాన్‌లతో మాత్రమే కాకుండా ఫిలిప్పీన్స్, భారతదేశంతో కూడా పొత్తులు పెట్టుకోవడం ద్వారా అమెరికా తన ఇండో–పసిఫిక్ ముఖచిత్రాన్ని భారీగా బలోపేతం చేసింది. ఈశాన్య ఆసియాలో బైడెన్ ముఖ్యంగా అమెరికా, జపాన్, దక్షిణ కొరియాతో కూడిన త్రైపాక్షిక సంబంధాన్ని ఏర్పరచుకున్నారు. ట్రంప్ హయాంలో అమెరికా, ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి.

ముఖ్యంగా, ఆయన 'ఆకస్'(ఏయూకేయూఎస్–ఆస్ట్రేలియా, యూకే, యూఎస్) సైనిక కూటమిని రూపొందించడానికి కూడా చొరవ తీసుకున్నారు. ఇది భారత్ సభ్యురాలిగా ఉన్న క్వాడ్ సంస్థకు భిన్నం. ఇది ఇప్పుడు ప్రధానంగా ఆరోగ్య భద్రత, సరఫరా గొలుసు స్థితిస్థాపకత, వాతావరణ మార్పులు, క్లిష్టమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, సైబర్ భద్రత, సముద్ర భద్రత వంటివాటిపై దృష్టి సారిస్తోంది. 2023 జూన్‌లో, బైడెన్ ఇండో–పసిఫిక్ ప్రాంతం మరొక అంచులో యూఎస్–ఇండియా రక్షణ, భద్రతా సంబంధాలను మరింత ఎత్తుకు తీసుకుపోయే ప్రయత్నంలో ప్రధాని నరేంద్ర మోదీతో కలిశారు. ట్రంప్‌తో భారతదేశ సంబంధాలు బాగానే ఉన్నాయి. కానీ గత మూడేళ్లలో జరిగినట్టుగా ద్వైపాక్షిక సంబంధాలను నిర్మించడంలో క్రమబద్ధమైన కృషి జరగలేదు.

వ్యాసకర్త న్యూఢిల్లీలోని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో డిస్టింగ్విష్డ్ ఫెలో ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నూరు శాతం కావు!



పెద్ద విజయం! జ్యూస్ కంపెనీలకు 'ఎఫ్ఎస్ఎస్ఏఐ' రెండు నియమాలు విధించింది. 100 శాతం పళ్ల రసం అనకూడదు; కిలో జ్యూస్‌కు 15 గ్రాముల కంటే ఎక్కువ చక్కెర వాడేవి 'తీపు చేసిన జ్యూస్' అని రాయాలి. చక్కెరతో నిండిన ప్యాకేజ్డ్ జ్యూసులు ఆరోగ్యకరమైనవని లక్షలాది మంది భారతీయులు తప్పుగా నమ్ముతున్నారు.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

వ్యతిరేకత ఉన్నప్పటికీ...



తమిళనాడులో మళ్లీ పోటీచేసిన 21 మంది ఎంపీల్లో 18 మంది ఓటు షేరు తగ్గిందని ఒక విశ్లేషణ. ఇది స్పష్టంగా అధికార పక్షం(డీఎంకే) మీద ఉన్న వ్యతిరేకతను చూపుతోంది. కొంతమంది ఎంపీల ఓట్లు గతంకంటే 10–15 శాతం తగ్గాయి. అయినప్పటికీ ఎందుకు గెలిచారంటే, ప్రతిపక్షాల ఓట్లు చీలడం వల్ల.

– సుమంత్ రామన్, టీవీ యాంకర్

చేయాల్సిన పోరాటం



ఎన్నికల తీర్పును జనాలు హిందుత్వను తిరస్కరించినట్టో, ప్రత్యామ్నాయ 'భారత భావన'కు విజయంగానో మరీ అతిగా అర్థం చేసుకోవడం పెద్ద తప్పు అవుతుంది. ప్రగతిశీల, సమసమాజ భవిత మీద ప్రతిపక్షాలు సరిగ్గా దృష్టి పెట్టాయి. యథాస్థితి లౌకికవాదం కన్నా కులం, వర్గ అసమానతల మీద ఇకపై పోరాటం ఉండాలి.

– అసీమ్ అలీ, పొలిటికల్ రీసెర్చర్

నచ్చకపోతే కొట్టొచ్చా?



ఇండియన్ ఉదారవాదుల ట్విట్టర్ నుంచి ఇవ్వాళ నేర్చుకున్న పాఠం ఏమిటంటే– అధికారంలో ఉన్న వ్యక్తి ఒక మనిషిని కొట్టొచ్చు; ఎందుకంటే ఆ మనిషి అభిప్రాయం వీళ్లకు నచ్చదు కాబట్టి. (కంగనా రనౌత్ విషయంలో.)

– అర్ణబ్ రే, రచయిత

గట్టి నిరూపణ



హిందువులు లౌకికవాదులు కాబట్టి భారతదేశం లౌకికం అని నేను ఎప్పుడూ చెబుతున్నాను. భారత ప్రాథమిక ఆచార విచారాలు లౌకికం. తాజా ఎన్నికలు దాన్ని నిష్కర్షగా నిరూపించాయి.

– ఎస్.వై.ఖురేషి, కేంద్ర మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్

ఇన్ బాక్స్

ఉద్యమ వాస్తవ చరిత్ర

ప్రపంచీకరణ అనంతరం వ్యక్తివాదం పెరిగి పోయి ఉద్యమాలు ఉండవు అనే ప్రచారం బలంగా నడుస్తున్న కాలంలో ప్రాంతీయ అస్తిత్వ వేదనలోంచి ఎగిసిన విముక్తి పోరాటం తెలంగాణ ఉద్యమం. పల్లెల నుండి పట్టణాల దాకా తెలంగాణ అనని మనిషి లేడు. కులాలు, మతాలకతీతంగా అందరూ ఒక్క గొంతుకగా నినదించిన నినాదం 'జై తెలంగాణ'. అందులో ముఖ్య భూమిక విద్యార్థులది. మంటలై మండింది, రైళ్ళకు ఎదురెళ్లి ముక్కలైంది, ఉరిపోసుకున్నది, పురుగుల మందు తాగింది. ఏది చేసినా తెలంగాణ అనే ఉద్యమ కాగడను ఆరిపోకుండా చమురు పోసి మండించేందుకే. పాలకులు, ప్రధాన స్రవంతి రాజకీయ నాయకులు ఉద్యమానికి ద్రోహం చేసినప్పుడు మొత్తం తెలంగాణ ఉద్యమాన్ని నడిపించింది విద్యార్థులే.



విద్యార్థులు ఉద్యమాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం వెనుక స్వాతంత్ర్య ఉద్యమం, రైతాంగ సాయుధ పోరాటం, తొలిదశ తెలంగాణ ఉద్యమం, నక్సల్బరీ పోరాటాల స్ఫూర్తి, ప్రభావాలు ఉన్నాయి. ఆ చైతన్యమే తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసింది. అట్లా ఎగిసిన విద్యార్థి ఉద్యమం రాజకీయ పార్టీల కనుసన్నల్లోకి ఎలా పోయింది? దానికి పని చేసిన శక్తులేవి? తెలంగాణ ఉద్యమం ఏకశిలా సదృశ్యం అనుకుంటున్న చోట నిలబడిన, కలబడిన, వెనక్కి తగ్గిన శక్తులను బహిర్గత పరచిన పరిశోధన ఈ పుస్తకం. ఒక్కమాటలో, కళ్ళముందే వక్రీకరణలకు గురవుతున్న తెలంగాణ ఉద్యమ వాస్తవ చరిత్ర ఇది. ఈ పరిశోధన తెలంగాణ ఉద్యమకారుడే (నలమాస కృష్ణ) పరిశోధకుడిగా చేసిన ప్రయత్నం.

ఇది అకడమిక్ పరిశోధన కాబట్టి దీనికి పరిమితులు ఉన్నా... ఇది ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా జరిగిన మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని సమగ్రంగా నమోదు చేసిందని మాత్రం చెప్పవచ్చు. అలా భవిష్యత్తు పరిశోధనకు దారులు వేసిందన్నమాట. ఉద్యమం నడుస్తుండగానే తీరికలేని కార్యాచరణలో దాని తీరూ తెన్నులపై చేసిన ఓ విశ్లేషణ ఇది. ఆ పరిమితుల్లో దీన్ని అర్థం చేసుకుంటూ అధ్యయం చేయాల్సి ఉంటుంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో జరుగనున్న ఈ పుస్తకావిష్కరణకు అందరూ ఆహ్వానితులే.

– అరుణాంక్, దేవిడ్

(నేడు హైదరాబాద్‌లో 'ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం' పుస్తకావిష్కరణ)

ప్రపంచాన్ని నిలదీస్తున్న యువత

అభిప్రాయం



డా॥ దేవరాజు మహారాజు

పాలస్తీనాకు సంఘీభావం తెలియజేస్తూ అమెరికాలోని నూట యాభై విశ్వవిద్యాలయలలో విద్యార్థులు నిరసన ప్రదర్శనలు చేశారు. ఏప్రిల్ 2024లో కొనసాగిన నిరసన కార్యక్రమాల్లో బోధన–బోధనేతర ఉద్యోగులు కూడా విద్యార్థులతో పాటు భాగస్వాములయ్యారు. ఇందులో హార్వర్డ్, బర్రత్ హాల్, కొలంబియా, ప్రిన్స్‌టన్, న్యూయార్క్, యేల్ వంటి అన్ని అమెరికన్ యూనివర్సిటీల విద్యార్థులున్నారు. అయితే నిరసనలో చురుకుగా పాల్గొన్న పదమూడు మంది విద్యార్థులకు హార్వర్డ్ యూనివర్సిటీ డిగ్రీలివ్వకుండా ఆపేసింది. 'గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాంలకు విద్యార్థులందరూ హాజరు కావచ్చు, కానీ, డిగ్రీలు రద్దయిన ఆ పదమూడు మందికి పట్టా ఇవ్వబడదు'– అని యూనివర్సిటీ ప్రకటించింది. నిరసన సెగలకు తట్టుకోలేక, కొన్ని యూనివర్సిటీలు గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లు వాయిదా వేసుకున్నాయి. కొన్ని మాత్రం నిర్వహించుకున్నాయి. నిర్వహించుకున్న వాటిలో హార్వర్డ్ యూనివర్సిటీ కూడా ఒకటి.



హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మాట్లాడుతున్న శ్రుతీ కుమార్

గాజా మీద దాడులు ఆపాల్సిందిగా, పాలస్తీనాను రక్షించాల్సిందిగా ఈ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం విద్యార్థులు కోరారు. తమ తమ క్లాసురూముల్లో నుండి ఆడిటోరియంలోని వేదిక మీదికి ఒక్కొక్కరుగా వరుస క్రమంలో క్రమశిక్షణతో నడిచి వస్తూ 'ఫ్రీ గాజా నౌ' 'ఫ్రీ పాలస్తీనా నౌ'–గాజాకు స్వేచ్ఛనివ్వండి! పాలస్తీనాకు స్వేచ్ఛనివ్వండి! అని రాసి ఉన్న గుడ్డ, పేపర్ బేనర్‌లను ప్రదర్శిస్తూ వేదిక మీదకు నడిచివెళ్లారు. డిగ్రీలు తీసుకున్నారు. డిగ్రీ తీసుకున్న విద్యార్థుల నుండి కొందరికి మాట్లాడే అవకాశం ఇస్తారు. అలా మాట్లాడే వారిని విద్యార్థులే ఎన్నుకుంటారు. ఆ అవకాశం దక్కించుకుంది భారతీయ–అమెరికన్ విద్యార్థిని శ్రుతీ కుమార్. ఆమె ప్రసంగంలోని సారాంశం ఇలా ఉంది:

"నేను తీవ్రంగా నిరాశ చెందాను. ఈ కేంపస్‌లో భావ వ్యక్తీకరణను శిక్షించడం జరిగింది. శాసనోల్లంఘన జరిగిందని శిక్షించడం జరిగింది. స్వేచ్ఛ, సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణ ఎక్కడున్నాయి? పదిహేను వందలమంది విద్యార్థులు మాట్లాడారు. పిటిషన్లు సమర్పించారు. ఐదు వందల మంది అధ్యాపకులు మాట్లాడారు. మా ఆక్రోశం, మా ఆవేదన హార్వర్డ్– నీకు వినిపిస్తోందా?

గాజాలో జరుగుతున్న సంఘటనలతో మనం మన సమాజంలో నిలువుగా బలంగా విడిపొయ్యాం! మనకు తెలియని వారిలోని మానవత్వాన్ని మనం గుర్తించలేమా? మనకు భేదాభిప్రాయాలు ఉన్నంతమాత్రాన వారి వేదననూ, నొప్పినీ అర్థం చేసుకోలేమా? గాజాలో జరుగుతున్న మారణకాండను మేమెవ్వరం సమర్థించడం లేదు.

భావ ప్రకటన, సంఘీ భావ ప్రకటన ఈ కేంపస్‌లో శిక్షలకు గురయ్యాయి. ఈ సెమిస్టర్‌లో ఈసారి నా పదమూడు మంది సహ విద్యార్థులకు డిగ్రీలు అందడం లేదు. వారు మాతో పాటు పట్టభద్రులు కాలేకపోతున్నారు. శాసనోల్లంఘన జరిగిందని– ఉద్యమిస్తున్న విద్యార్థుల పట్ల యూనివర్సిటీ తీసుకున్న నిర్ణయం మా విద్యార్థి లోకాన్ని ఎంతగానో బాధించింది. ఇంకా చెప్పాలంటే నలుపు, చామనచాయ చర్మం గల నాలాంటి విద్యార్థినీ విద్యార్థులకు ఇక్కడ వ్యక్తిగత భద్రత లేదు. మా పట్ల ఎందుకీ అసహనం? ఎందుకీ అణచివేత? హార్వర్డ్! మా మాటలు నీకు వినిపిస్తున్నాయా?"

అమెరికాలోని నెబ్రాస్కాలో పుట్టి పెరిగిన ఇరవైయేళ్ళ యువతి శ్రుతీ కుమార్, తన పదినిముషాల ప్రసంగంతో ప్రపంచాన్ని కదిలించింది. తన తోటి విద్యార్థులకు పట్టాలు రాకపోవడం పట్ల ఆవేదన తెలియజేస్తూ– గాజాపై జరుగుతున్న దాడుల గూర్చి, నల్లచర్మం ఆధారంగా సాగుతున్న జాతి వివక్ష గూర్చి ఆక్రోశిస్తూ మాట్లాడిన మాటలకు హార్వర్డ్ యూనివర్సిటీ ఆడిటోరియంలో, ఆడిటోరియం బయట ఉన్న వేల మంది, వేదిక మీద ఉన్న అధ్యాపకులతో సహా– అందరికందరూ లేచి నిలబడి కాంపస్ దద్దరిల్లిపోయేట్లు చప్పట్లు చరిచారు. 'హార్వర్డ్ నీకు వినిపిస్తోందా?' అని గద్గద స్వరంతో ఆమె ఆక్రోశించినపుడల్లా విద్యార్థులు పెద్దఎత్తున చప్పట్లు చరిచి ఆమెకు తమ సంఘీభావం తెలియజేశారు. అయితే ఆ ఆవేదన, ఆ ఆక్రందన హార్వర్డ్ యూనివర్సిటీ ప్రాంగణానికే పరిమితం కాలేదు. 'ప్రపంచమా! నీకు మా ఆక్రోశం, ఆవేదన వినిపిస్తోందా?'– అని యువతరం ప్రశ్నిస్తున్నట్టు ప్రపంచ శ్రోతలకు అనిపించింది.


సంఘసేవ పట్ల ఆసక్తి గల శ్రుతీ కుమార్, డాక్టర్ కోర్సును వదులుకుని, వైజ్ఞానిక శాస్త్ర చరిత్ర, ఆర్థిక శాస్త్రం చదువుకుని పట్టా సాధించారు. తమిళనాడు నుండి వెళ్ళి అమెరికాలో స్థిరపడ్డ దక్షిణ భారత సంప్రదాయ కుటుంబం వారిది.

మనదేశంలోనూ విద్యార్థి ఆందోళనలు జరుగుతున్నాయి. వెంటనే కులగణన జరిపించాలనీ, అందరికీ సమానంగా ఉద్యోగాల్లో అవకాశాలుండాలనీ హరియాణాలోని అశోక విశ్వవిద్యాలయ విద్యార్థులు చేపట్టిన సమ్మె, నిరసనలూ తక్కువవి కావు. ప్రపంచంలో యువతరం ప్రశ్నని బలోపేతం చేస్తూ ఉందన్న దానికి అన్ని చోట్లా జరుగుతున్న విద్యార్థి నిరసనలను సంకేతాలుగా చూడాలి!!

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత । మెల్బోర్న్ నుంచి

హానికరమైన ఉపేక్ష!

కురుక్షేత్ర సంగ్రామం మొదలైన నాటి నుండి జరిగిన సంగతులను తాను చూసి వచ్చి తన ప్రభువైన ధృతరాష్ట్రుడికి వర్ణించి చెబుతుంటాడు సంజయుడు. భీష్మ, ద్రోణాచార్యుల సర్వసేనాధిపత్యంలో పదిహేను రోజుల యుద్ధం తరువాత, రెండు రోజులు కర్ణుడి నాయకత్వంలో యుద్ధం జరిగింది. ఆ రెండు రోజుల యుద్ధం చివరన అర్జునుడి చేతిలో కర్ణుడు, భీముడి చేతిలో దుశ్శాసనుడు నిహతులయ్యారు. ఆ సంగతులను వివరించిన సంజయుడు, కౌరవుల విజయానికి సంబంధించిన ఆశలు అడుగంటిపోయేలా దుశ్శాసనుని రొమ్ము చీల్చి రక్తం తాగి భీముడు తన ప్రతిజ్ఞను నెరవేర్చుకున్నాడని చెబుతాడు. అది విన్న ధృతరాష్ట్రుడు హతాశుడై, సంజయుడు అలా చెబుతున్నాడంటే దుర్యోధనుడు కూడా మరణించి ఉంటాడని ఊహించుకుని హాహాకారాలు చేస్తూ మూర్ఛపోతాడు. విదురుడి సహాయంతో, సంజయుడు సపర్యలు చేసిన అనంతరం మూర్ఛలోంచి తేరుకున్న ధృతరాష్ట్రుడు 'నీవు మొదట చెప్పిన మాటలు నేను సరిగా వినలేదు. దుర్యోధనుడికి ఏ ప్రమాదము సంభవించ లేదు కదా!' అంటాడు. ప్రపంచమంతా ఏమైపోయినా ఫరవాలేదు, దుర్యోధనుడు ఒక్కడు బ్రతికి ఉంటే చాలు అన్నట్లుగా ఉంటుంది ధృతరాష్ట్రుడి వైఖరి. ఈ వైఖరిని గట్టిగానే నిరసిస్తాడు సంజయుడు.



జ్యోతిర్మయం

కొడుకులంత రాజ్యంబును గొనగ శక్తు
లను దురాశను వారల యవినయములు
నీ వుపేక్షింతు; మానునే? యా విరుద్ధ
కర్మమున ఫలమొందక కౌరవేంద్ర!

'రాజ్యం మొత్తాన్నీ తామే కాజేయాలన్న దురాశతో నిండిన కాంక్షతో నీ కొడుకులు చేసే కానిపనులన్నిటినీ నీవు ఉపేక్షించి, చూస్తూ ఊరుకున్నావు. ఏనాటికైనా దాని ఫలితం అనుభవించాల్సిన సమయం రాకుండా ఉంటుందా? అదే ఇప్పుడు వచ్చింది చూడు!' అని ధృతరాష్ట్రుడి మొహం మీదనే సంజయుడు అనడం ఆంధ్ర మహాభారతం, కర్ణపర్వం లోని పై తేటగీతి పద్యంలో కనబడుతుంది. ఈ మాటలు అనిపించుకుని కూడా 'అది సరేలే, ఇంతకీ దుర్యోధనుడు క్షేమంగానే ఉన్నాడు కదా?!' అంటాడు ధృతరాష్ట్రుడు. కళ్ళెదురుగా వినాశనానికి సంబంధించిన ఛాయలు కనపడుతున్నా చూడడానికి ఇచ్ఛగించని స్వార్థపూరిత ఉపేక్ష ధృతరాష్ట్రుడిది! ధృతరాష్ట్రుడి అంగవైకల్యం దృష్టి లేకపోవడం కాదు. దానిని అడ్డం పెట్టుకుని అతడు ప్రదర్శిస్తూ వచ్చిన ఉపేక్షయే! చెడు జరగకుండా ఆపగలిగే అధికారం చేతిలో ఉంచుకుని కూడా ఉపేక్షించడం ఊహించనంత వినాశనానికి దారితీస్తుందని ఇది తెలుపుతుంది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.విదియ సా.4.21 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ఆరుద్ర రా.8.33 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.5.35 నుండి 7.12 వరకు, **అమృతఘడియలు:** ప.10.32 నుండి 12.09 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.29, బుద్ధ జయంతి, మృగశిర కార్తె ప్రారంభం.

పిడుగుపాటుకు ఐదుగురు బలి

- మృతుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 20 మూగజీవాలు మృతి


ఆశన్న (ఫైల్)


కౌసల్య (ఫైల్)


నర్సమ్మ (ఫైల్)


సిద్ధిరాములు (ఫైల్)

సాక్షి, నెట్‌వర్క్: పిడుగుపాటుకు ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 20 మూగజీవాలు సైతం బలయ్యాయి. నారాయణపేట జిల్లా విఠలపురం గ్రామానికి చెందిన ఆశన్న (58) పత్తి విత్తనాలు విత్తేందుకు కుటుంబసభ్యులను, కూలీలతో పొలానికి వెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో అందరూ సమీపంలోని చెట్టు కిందకు వెళ్లారు. ఈ క్రమంలో పిడుగు పడటంతో ఆశన్నతో పాటు వ్యవసాయ కూలీ కౌసల్య (54) అక్కడికక్కడే మృతిచెందారు. ఆశన్న భార్య సైదులమ్మ, మనవరాలు శ్రావణికి స్వల్పగాయాలయ్యాయి.

ఇంటికొస్తూ.. చెట్టుకిందకు వెళ్లి..

మెదక్ జిల్లా చిట్కుల్ గ్రామానికి చెందిన బోయిని నర్సమ్మ (52), భర్త ఎల్లయ్యతో కలిసి వ్యవసాయ పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వస్తోంది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు, ఒక్కసారిగా పిడుగుపడి నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కళ్లెదుటే భార్య మృతి చెందడంతో ఎల్లయ్య భోరున విలపించాడు. ఇదే జిల్లా రాజ్‌పల్లి గ్రామానికి చెందిన సిద్ధిరాములు (55), రాధమ్మ దంపతులు గురువారం రాత్రి పొలంలో వరి విత్తనాలు తూకం పోస్తున్న క్రమంలో వర్షం పడింది. దంపతులు చెట్టు కిందకి వెళ్లగా, అదే సమయంలో పిడుగుపడింది. సిద్ధిరాములు అక్కడికక్కడే మృతిచెందాడు. అస్వస్థతకు గురైన రాధమ్మను ఆస్పత్రికి తరలించారు.

గొర్రెలను మేపేందుకు వెళ్లి..

కామారెడ్డి జిల్లా గోర్గల్ గ్రామానికి చెందిన కురుమ కృష్ణమూర్తి (22) శుక్రవారం గొర్రెలను మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లాడు. సాయంత్రం సమయంలో పిడుగుపడి మృతిచెందాడు. గొర్రెలు ఇంటికి వచ్చినా కృష్ణమూర్తి రాకపోయేసరికి బంధువులు అడవిలోకి వెళ్లి గాలించగా అతడి మృతదేహం కనిపించింది.

మూగజీవాల మృత్యుఘోష

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా శుక్రవారం పిడుగుపాటుకు గురై పెద్దసంఖ్యలో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. వికారాబాద్ జిల్లా కుస్మసముద్రం, లింగాన్‌పల్లి గ్రామాల్లో 7 పాడిగేదెలు, రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలో 4 మేకలు, 4 గొర్రెలు, సంకటోనిపల్లిలో 2, సంగెం, ఆగిర్యాల్, గౌరారంలో ఒక్కోటి చొప్పున పాడిఆవులు మృతిచెందాయి. జీవనోపాధిని కోల్పోయామని బాధిత రైతులు వాపోయారు.


చౌడాపూర్ మండలం లింగాన్‌పల్లిలో మృతిచెందిన గేదెలు

రష్యా వెళ్లలేక.. రైలు కింద పడి

- డబ్బు సర్దుబాటు కాక యువకుడి ఆత్మహత్య
- రష్యాలో బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు దరఖాస్తు


శివమణి (ఫైల్)

నల్లగొండ క్రైం: రష్యా వెళ్లి చదువుకుంటూ ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా నిలవాలన్న ఆ యువకుడి ఆశ తీరే మార్గం లేక వేగంగా వస్తున్న రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ శంకర్, జయమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు శివమణి(19) ఉన్నారు. పెద్దకూతురు వసంతకు మూడేళ్ల క్రితం పెళ్లి చేశారు. రెండో కూతురు ఝాన్సీ ఎమ్మెస్సీ చదివి ఖాళీగానే ఉంటోంది. కుమారుడు శివమణి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో బీఎస్సీ అగ్రికల్చర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. జీవితంలో త్వరగా స్థిరపడాలని భావించిన శివమణి.. రష్యాలో నర్సింగ్ చదువుతూ అక్కడే ఉద్యోగం పొందాలని భావించారు. రష్యాలో బీఎస్సీ నర్సింగ్ చేసేందుకు ప్రభుత్వ రిక్రూటింగ్ సంస్థ అయిన 'టాంకాం'ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. 6 నుంచి 8 నెలల పాటు రష్యా భాషపై హైదరాబాద్‌లో శిక్షణ తీసుకోవాల్సి ఉంది. శిక్షణకు, రష్యా వెళ్లేందుకు మొత్తం ఖర్చుకు మూడున్నర లక్షలు కావాలి. దీంతో రెండు నెలలుగా తల్లిదండ్రులు అప్పుకోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కడా అప్పు పుట్టలేదు. శివమణి గతేడాదే రష్యా వెళ్లేందుకు ప్రయత్నించగా, డబ్బులు సర్దుబాటు కాలేదు. ఈ ఏడాది కూడా డబ్బు అందకపోవడంతో అవకాశం చేజారిపోతుందని మనస్తాపం చెందాడు. దీంతో శుక్రవారం నల్లగొండ సమీపంలోని బతుకమ్మ చెరువు పక్కన రైల్వేట్రాక్ వద్దకు వెళ్లి.. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు తన సోదరి ఝాన్సీకి వీడియోకాల్ చేసి లొకేషన్ షేర్ చేశాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుంటూరు వైపు వెళుతున్న గూడ్స్‌కు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, రైల్వే పోలీసులు ఘటనా స్థలంలోకి చేరుకొనేలోపే ఈ ఉదంతం చోటుచేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ సాలకమ్మ తెలిపారు.

మేత మేస్తూ.. మృత్యువాత

విద్యుదాఘాతానికి 11 మూగజీవాలు బలి

చిన్నగూడూరు: విద్యుదాఘాతంతో పదకొండు పశువులు మృతిచెందాయి. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలో గురువారం రాత్రి కురిసిన గాలివానకు పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగి పడిపోయాయి. శుక్రవారం పశువులు పొలాల్లో మేత మేస్తూ తెగిన తీగలను తాకడంతో మండలంలోని మంగోరిగూడెంలో 7 ఎడ్లు, ఒక ఆవు, మేఘ్యాతండాలో 3 ఎడ్లు మృత్యువాతపడ్డాయి. దీంతో యజమానులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం చెల్లించాలని వారు కోరారు.


మృతిచెందిన కాడెద్దు వద్ద బోరున విలపిస్తున్న మహిళ

చట్ట ప్రకారం 'సీఎంఆర్' కేసు విచారణ

పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సీఎంఆర్ పక్కదారి పట్టిన కేసులో 41ఏ నిబంధనలను పాటించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. సీఎంఆర్ కోసం ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని నిజామాబాద్ జిల్లాలోని పలువురు మిల్లర్లు భారీగా పక్కదారి పట్టించినట్లు ఆరోపణలొచ్చాయి. ఈ వ్యవహారంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబీకుల రైస్ మిల్లులలో డిసెంబర్‌లో పౌరసరఫరాల శాఖ అధికారుల తనిఖీలు చేపట్టారు. రూ.9 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం మాయం కావడంతో కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణ పేరుతో అధికారులు తన కుటుంబసభ్యులను వేధిస్తున్నారంటూ షకీల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.వి జయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రైస్‌మిల్లుల కేసుతో షకీల్‌కు నేరుగా ఎలాంటి సంబంధం లేదన్నారు. అయినా పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, స్టేషన్‌కు రావాలంటూ సమన్లు జారీ చేస్తున్నారని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చట్టప్రకారం నిబంధనలు పాటిస్తూ విచారణ సాగించాలని పోలీసులను ఆదేశించారు.


శుక్రవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ భేటీకి వస్తూ నమస్కరిస్తున్న ప్రధాని మోదీ, నేతల ప్రతి నమస్కారాలు


ప్రధానిగా మోదీ అభ్యర్థిత్వానికి మద్దతు తెలుపుతూ రాష్ట్రపతి ముర్ముకు లేఖను అందజేస్తున్న ఎన్డీఏ పక్షాల నేతలు

రేపే మోదీ ప్రమాణం

రాత్రి 7.15 గంటలకు ముహూర్తం

- ఎన్డీఏపీపీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- అనంతరం రాష్ట్రపతిని కలిసిన మోదీ
- ప్రధానిగా నియమిస్తూ ముర్ము నిర్ణయం
- ప్రభుత్వ ఏర్పాటుకు నన్ను ఆహ్వానించారు
- రాష్ట్రపతితో భేటీ తర్వాత మీడియాతో మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: భారత ప్రధానిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనను ఆహ్వానించారు. ఆదివారం రాత్రి 7:15 గంటలకు మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ దిశగా శుక్రవారం హస్తినలో ఒకదాని వెంట ఒకటి పలు పరిణామాలు జరిగాయి. తొలుత ఉదయం 11.30కు నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) భాగస్వామ్య పక్షాలన్నీ సమావేశమై తమ పార్లమెంటరీ పార్టీ నేతగా మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. పార్లమెంటు పాత భవనం 'సంవిధాన్ సదన్' సెంట్రల్ హాల్లో జరిగిన ఈ భేటీలో బీజేపీతో పాటు టీడీపీ, జేడీ(యూ), ఎల్జేపీ తదితర ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల అధినేతలు, ఎంపీలు పాల్గొన్నారు. ఎన్డీఏపీపీ నేతగా మోదీ పేరును బీజేపీ అగ్రనేత రాజ్‌నాథ్‌సింగ్ ప్రతిపాదించగా కూటమి ఎంపీలంతా ఏకగ్రీవంగా అంగీకారం తెలిపారు. అనంతరం ఎంపీలందరినీ ఉద్దేశించి మోదీ, ఆయన నాయకత్వాన్ని ప్రస్తుతిస్తూ భాగస్వామ్య పక్షాల నేతలు ప్రసంగించారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా, లోక్‌సభలో బీజేపీ పక్ష నేతగా కూడా మోదీ ఎన్నికయ్యారు. తర్వాత ఆయన రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి ద్రౌపదీ ముర్ముతో సమావేశమయ్యారు. ఎన్డీఏ ఎంపీల నిర్ణయాన్ని ఆమెకు తెలియజేశారు. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు మోదీని ముర్ము ఆహ్వానించారు. అనంతరం రాష్ట్రపతి భవన్ వెలుపల మోదీ మీడియాతో మాట్లాడారు. ''నన్ను ఎన్డీఏ నేతగా ఎన్నుకున్నట్టు భాగస్వామ్య పక్షాలన్నీ రాష్ట్రపతికి తెలిపాయి. దాంతో ఆమె నన్ను ప్రధానిగా నియమించారు. ఆ మేరకు నాకు లేఖ అందజేశారు. ప్రమాణస్వీకారానికి అనువైన సమయం, నాతో పాటు కేంద్ర మంత్రులుగా ప్రమాణం చేసే నేతల వివరాలు కోరారు. ఆదివారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేస్తామని తెలిపాను. కాబోయే మంత్రుల జాబితాను ఆదివారానికల్లా రాష్ట్రపతి భవన్‌కు అందజేస్తా'' అని వివరించారు. 2047లో వందేళ్ల స్వాతంత్ర్యోత్సవాల నాటికి జాతి కలలను సంపూర్ణంగా సాకారం చేసే ప్రస్థానంలో 18వ లోక్‌సభ కీలక మైలురాయిగా నిలవనుందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ''ఇది నవ, యువ శక్తితో అలరారుతున్న సభ. దేశ ప్రజలు ఎన్డీఏకు మరోసారి అవకాశమిచ్చారు'' అని చెప్పారు. ఎన్డీఏ పక్షాలన్నీ మోదీకి మద్దతుగా శుక్రవారం మధ్యాహ్నమే రాష్ట్రపతికి లేఖలు అందజేశాయి.


మోదీకి చక్కెర కలిపిన పెరుగు తినిపిస్తున్న రాష్ట్రపతి ముర్ము

జాతీయ ప్రయోజనాలు, ప్రాంతీయ ఆకాంక్షల మధ్య... సమతూకంగా పాలన: బాబు, నితీశ్

జాతీయ ప్రయోజనాలు, ప్రాంతీయ ఆకాంక్షల మధ్య సమతూకం పాటిస్తూ ఎన్డీఏ ప్రభుత్వ పాలన సాగాలని భాగస్వామ్య పక్షాలు టీడీపీ, జేడీ(యూ) ఆకాంక్షించాయి. ఎన్డీఏపీపీ నేతగా మోదీ పేరును రాజ్‌నాథ్ ప్రతిపాదించగా చంద్రబాబు (టీడీపీ), నితీశ్‌కుమార్ జేడీ(యూ), ఏక్‌నాథ్ షిండే (శివసేన), చిరాగ్ పాస్వాన్ (ఎల్జేపీ–ఆర్వీ), హెచ్.డి.కుమారస్వామి జేడీ(ఎస్), అజిత్ పవార్ (ఎన్సీపీ), జితిన్‌రాం మాంఝీ తదితరులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడు సారథ్యం వహిస్తున్నారని చంద్రబాబు అన్నారు. ''ప్రపంచ సారథిగా ఎదిగేందుకు భారత్‌కు ఇదో అద్భుతమైన అవకాశం. సమాజంలోని అన్ని వర్గాల సమగ్రాభివృద్ధికి పెద్దపీట వేస్తూ పాలన సాగాలి'' అని ఆకాంక్షించారు. రాష్ట్రాల అభివృద్ధిని చిన్నచూపు చూడొద్దని నితీశ్ సూచించారు. దేశాన్ని అద్భుతంగా వృద్ధి పథంలో నడిపించడంతో పాటు బిహార్‌పైనా మోదీ ప్రత్యేకంగా దృష్టి సారిస్తారని ఆశాభావం వెలిబుచ్చారు. ''వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ విపక్షాలకు ఓటమి తప్పదు. వాళ్లు పనికిరాని కబుర్లు చెప్పి అక్కడా, ఇక్కడా గెలిచారు. వచ్చేసారి వారంతా ఓడటం ఖాయం'' అన్నారు. మోదీ ప్రధానిగా ఉన్నంతకాలం దేశం ఎవరి ముందూ తలొంచబోదని పవన్ కల్యాణ్ అన్నారు.

విరిసిన నవ్వులు...

ఎన్డీఏ భేటీ పలు ఆహ్లాదకర సన్నివేశాలకు వేదికైంది. తమ కూటమిది పటిష్టమైన ఫెవికాల్ బంధం అని షిండే అభివర్ణించగా నవ్వులు విరిశాయి. తనకు పాదాభివందనం చేసేందుకు నితీశ్ ప్రయత్నించగా మోదీ వారిస్తూ ఆలింగనం చేసుకున్నారు. చిరాగ్‌నూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను భుజం తట్టారు. పవన్ కల్యాణ్ 'పవనం కాదు, సుడిగాలి' అంటూ మోదీ తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రశంసించారు.

రాజ్యాంగ ప్రతికి నమస్సులు

ఎన్డీఏ భేటీ కోసం సెంట్రల్ హాల్లోకి ప్రవేశించగానే మోదీ ముందుగా రాజ్యాంగ ప్రతిని తన నుదిటికి తాకించుకుని వందనం చేశారు. ఆ ఫొటోను ఎక్స్‌లో పెట్టి భావోద్వేగంతో కూడిన పోస్ట్ చేశారు. ''తన జీవితంలో ప్రతి క్షణమూ రాజ్యాంగం ప్రవచించిన గొప్ప విలువల పరిరక్షణకే అంకితం. నా వంటి వెనకబడ్డ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి దేశానికి సేవ చేయగలుగుతున్నాడంటే అది కేవలం మన రాజ్యాంగం గొప్పదనమే. అది కోట్లాది ప్రజలకు ఆశ, శక్తియుక్తులు, గౌరవాదరాలు కల్పిస్తోంది'' అని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పదేళ్లుగా అడుగడుగునా నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన మోదీ నేడిలా అదే రాజ్యాంగానికి ప్రణామాలు చేయడం విడ్డూరమంటూ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ దుయ్యబట్టారు.

అద్వానీ, జోషి ఆశీస్సులతో...

రాష్ట్రపతిని కలిసే ముందు బీజేపీ కురువృద్ధులు ఎల్కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీలతో నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. శుక్రవారం ఎన్డీఏ పార్లమెంటరీ పక్ష నేతగా ఎన్నికవగానే వారి నివాసాలకు వెళ్లారు. ''అగ్ర నేతలు అద్వానీ, జోషీ ఆశీర్వాదం తీసుకున్నా. బీజేపీ బలోపేతానికి అద్వానీ చేసిన ఎనలేని కృషి పార్టీలోని ప్రతి కార్యకర్తలోనూ స్ఫూర్తి నింపింది. పార్టీ బాధ్యతల్లో పని చేసిన రోజుల్లో జోషీ నుంచి ఎంతో నేర్చుకున్నా'' అంటూ అనంతరం మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో కూడా ఆయన భేటీ అయ్యారు.

పదేళ్ల పాలన ట్రైలరే...

దేశాభివృద్ధికి మరింత శ్రమిస్తాం: మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్డీఏను స్వతంత్ర భారత చరిత్రలోనే అత్యంత బలీయమైన, విజయవంతమైన సంకీర్ణంగా నరేంద్ర మోదీ అభివర్ణించారు. ''మా సంకీర్ణం మూడుసార్లు పూర్తికాలం అధికారంలో కొనసాగింది. నాలుగోసారి కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఎన్డీఏ కేవలం అధికారం కోసం పుట్టుకొచ్చిన కొన్ని పార్టీల కలయిక కాదు. జాతి హితమే ఏకైక లక్ష్యంగా ఆవిర్భవించిన కూటమి. మేమెన్నడూ ఓడిపోలేదు. నిన్నా మేమే గెలిచాం. నేడూ మేమే గెలిచాం. భవిష్యత్తులోనూ మేమే గెలుస్తాం. విజయాన్ని ఎలా జీర్ణించుకోవాలో మాకు బాగా తెలుసు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ ఘనవిజయం సాధించినా జూన్ 4 (లోక్‌సభ ఎన్నికల ఫలితాల) తర్వాత మేం వినమ్రంగా ప్రవర్తించిన తీరే అందుకు నిదర్శనం'' అన్నారు. మరోవైపు విపక్షాలు కేవలం అధికార దాహంతోనే ఒక్కటయ్యాయంటూ ఇండియా కూటమిపై నిప్పులు చెరిగారు. కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే కలిశామని అవి స్వయంగా పేర్కొన్నాయని గుర్తు చేశారు. ''ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్నే దెబ్బ తీసేందుకు విపక్షాలు ప్రయత్నించాయి. ఎన్డీఏ ఎన్నికల విజయాన్ని కూడా ఓటమిగా చిత్రీకరించేందుకు విఫలయత్నం చేశాయి. ఫలితాలు వాటికి అనుకూలంగా రాలేదనే అక్కసుతో దేశవ్యాప్తంగా కల్లోలం రేపేందుకు కుట్ర చేశాయి'' అంటూ మండిపడ్డారు. శుక్రవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన కూటమి ఎంపీలను, అనంతరం భాగస్వామ్య పక్షాల అధినేతలను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ''ప్రభుత్వ ఏర్పాటుకు మెజారిటీ అవసరం. దేశాన్ని నడిపేందుకు అన్ని విషయాల్లోనూ ఏకాభిప్రాయం మరింత అవసరం. పదేళ్లుగా పార్లమెంటులో నాణ్యమైన చర్చలను ఎంతగానో మిస్సయ్యా. విపక్ష నేతలు ఈసారైనా జాతి ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంటులో అడుగు పెడతారని, అర్థవంతమైన చర్చలు చేస్తారని ఆశాభావంతో ఉన్నా'' అన్నారు. ''మన మధ్య పరస్పర వ్యతిరేకత ఉండొచ్చు. కానీ జాతి పట్ల వ్యతిరేకత ఉండకూడదు'' అని విపక్షాలకు సూచించారు.

ఎన్డీఏకు కొత్త నిర్వచనం

లోక్‌సభ ఎన్నికల విజయం పట్ల ఎన్డీఏ నేతలను మోదీ అభినందించారు. ఇందుకు కారకులైన లక్షలాది మంది కార్యకర్తలకు తాను అభివాదం చేసి తీరాలన్నారు. కేంద్రంలో ఏర్పడబోయే ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి అంశంలోనూ భాగస్వామ్య పక్షాలన్నింటి ఏకాభిప్రాయంతో, జాతి హితమే లక్ష్యంగా సాగుతుందని స్పష్టం చేశారు. ''ప్రజలు మాకు స్పష్టమైన మెజారిటీ కట్టబెట్టారు. తద్వారా ప్రభుత్వాన్ని నడిపే సదవకాశమిచ్చారు. దీన్ని సద్వినియోగం చేసుకుంటామని, దేశాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి పథంలో నడుపుతామని మాటిస్తున్నా'' అని చెప్పారు. ''పదేళ్ల పాలనలో వృద్ధి పథంలో దేశాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకెళ్లేందుకు ఎంతగానో కృషి చేశాం. అదంతా కేవలం ట్రయిలర్ మాత్రమే. ఈ టర్ములో దేశాభివృద్ధి కోసం మరింతగా పాటుపడతాం. మేం కార్య సాధకులమని ప్రజలకు తెలుసు'' అన్నారు. ''సుపరిపాలనే మా కూటమికి పునాది. ఎన్డీఏ అంటే సరికొత్త (న్యూ), అభివృద్ధి చెందిన (డెవలప్డ్) , ఆకాంక్షల (ఆస్పిరేషనల్) ఇండియా'' అని కొత్త నిర్వచనమిచ్చారు.

కాంగ్రెస్‌పై చెణుకులు

కాంగ్రెస్ పార్టీపై ఈ సందర్భంగా మోదీ చెణుకులు విసిరారు. ఆ పార్టీకి గత మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ కలిపి కూడా బీజేపీకి తాజా ఎన్నికల్లో వచ్చినన్ని స్థానాలు రాలేదంటూ ఎద్దేవా చేశారు. ఈసారి ఆ పార్టీ కనీసం వంద సీట్లు కూడా నెగ్గలేకపోయిందన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ అద్భుత ప్రదర్శన చేసిందంటూ కొనియాడారు. ''దక్షిణాదిన ఎన్డీఏ జెండా ఎగిరింది. కేరళలో తొలిసారి ఖాతా తెరిచాం. ఏపీలో చరిత్రాత్మక విజయం సాధించాం. తమిళనాడులో కూడా ఎన్డీఏ గణనీయమైన ఓట్ల శాతం సాధించాం. కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అతి తక్కువ సమయంలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయి. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీకి భారీగా సీట్లు కట్టబెట్టారు. ఇటు ఒడిశాలోనూ దుమ్ము రేపాం. అటు అరుణాచల్‌ప్రదేశ్‌లోనూ క్లీన్‌స్వీప్ చేశాం'' అన్నారు. మంత్రి పదవులు ఇప్పిస్తామంటూ వచ్చేవారిని, ఫేక్ న్యూస్‌ను అస్సలు నమ్మొద్దని ఎన్డీఏ ఎంపీలకు మోదీ సూచించారు.

ఈవీఎంలపై ఇప్పుడేమంటారు? విపక్షాలకు మోదీ చురక

ఇండియా కూటమి ప్రగతికి, ఆధునికతకు, టెక్నాలజీకి బద్ధ వ్యతిరేకి అని మోదీ ఆరోపించారు. విపక్షాలన్నీ గత శతాబ్దపు భావజాలంతో కొట్టుమిట్టాడుతున్నాయని, శరవేగంగా అగాథపు లోతుల్లోకి దిగజారుతున్నాయని దుయ్యబట్టారు. ఈవీఎంలపై చేసిన నిరాధార విమర్శలకు ఏం సమాధానమిస్తాయని ఎన్నికల్లో వాటి మెరుగైన ప్రదర్శనను ఉద్దేశించి ప్రశ్నించారు. ''ఈవీఎంలపై, ఎన్నికల సంఘంపై అనుమానాలు రేకెత్తించేందుకు ఎన్నికల ప్రక్రియ పొడవునా విపక్షాలు శక్తివంచన లేకుండా కృషి చేశాయి. సుప్రీంకోర్టులో కేసుల ద్వారా ఈసీ పనితీరును అడ్డుకోజూశాయి. వాటి తీరు చూసి ఫలితాలొచ్చాక ఏకంగా ఈవీఎంల శవయాత్ర చేస్తాయేమో అనుకున్నా! తీరా ఫలితాలు చూశాక విపక్షాల నోళ్లన్నీ మూతబడ్డాయి! ఈవీఎంలు ఇంకా బతికే ఉన్నాయా, చనిపోయాయా అని ఫలితాలొస్తున్న క్రమంలో ఒకరిని నేనడిగాను'' అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దేశాన్ని అంతర్జాతీయంగా కూడా అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నించినందుకు విపక్షాలను జాతి ఎన్నటికీ క్షమించబోదన్నారు.

15న లోక్‌సభ తొలి భేటీ!

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ తొలి సమావేశం ఈనెల 15వ తేదీన ప్రారంభం కావొచ్చని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. జూన్ మూడోవారంలో లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభమవుతాయని, తొలి రెండు రోజులు నూతన ఎంపీల ప్రమాణ స్వీకారం ఉంటుందని సమాచారం. ఆ తర్వాత స్పీకర్‌ను ఎన్నుకుంటారు. మూడోరోజున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభల సంయుక్త సమావేశంలో మాట్లాడతారని వెల్లడించాయి. ప్రధాని మోదీ తన కొత్త మంత్రివర్గ సహచరులను ఉభయసభలకు పరిచయం చేస్తారు. జూన్ 22న సమావేశాలు ముగుస్తాయని తెలిపాయి. ఆదివారం రాత్రి రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణస్వీకారం ముగిశాక కేబినెట్ భేటీ జరగనుంది. అందులో లోక్‌సభ సమావేశాల తేదీలపై తుది నిర్ణయం తీసుకుంటారు.

సమన్వయ కమిటీ!

నితీశ్ సారథ్యంలో సీఎంపీ: జేడీయూ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్డీఏ సర్కారు మనుగడకు కీలకంగా మారిన భాగస్వామ్య పక్షాలు బీజేపీ ముందు పలు డిమాండ్లు పెడుతున్నాయి. అందులో భాగంగా ఎన్డీఏ సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని జేడీ(యూ) డిమాండ్ చేస్తోంది. దాని కన్వీనర్‌గా పార్టీ చీఫ్, బిహార్ సీఎం నితీశ్‌కుమార్ ఉండాలని కోరుతోంది. అంతేగాక ఎన్డీఏకు కనీస ఉమ్మడి ప్రణాళిక (సీఎంపీ) ఉండాలని, దాని అమలు కమిటీ సారథ్యాన్ని కూడా నితీశ్‌కు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. దీనికి అదనంగా నాలుగు కేబినెట్ బెర్తులు, బిహార్‌కు ప్రత్యేక హోదా తదితరాలను నితీశ్ ఇప్పటికే బీజేపీ పెద్దల ముందుంచారు. టీడీపీ కూడా నాలుగైదు కేబినెట్, ఒక సహాయ మంత్రి, లోక్‌సభ స్పీకర్ పదవి డిమాండ్ చేస్తున్నట్టు వార్తలు రావడం తెలిసిందే. టీడీపీ, జేడీ(యూ) డిమాండ్లకు బీజేపీ అంగీకరించడం లేదని తెలుస్తోంది. టీడీపీకి ఒకకేబినెట్, ఒకట్రెండు సహాయ పదవులను ఆఫర్ చేసినట్టు చేసినట్టు సమాచారం. జేడీ(యూ), ఇతర మిత్రపక్షాల డిమాండ్లపై వాటితో చర్చలు సాగుతున్నట్టు తెలుస్తోంది.

'ఏడాదిలోపే మధ్యంతరం'

రాయ్‌పూర్: లోక్‌సభకు ఆరు నెలల నుంచి ఏడాదిలోపే మధ్యంతర ఎన్నికలు ఖాయమని కాంగ్రెస్ నేత భూపేశ్ బఘెల్ శుక్రవారం జోస్యం చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ''బీజేపీకి చెందిన యూపీ సీఎం ఆదిత్యనాథ్, రాజస్తాన్ సీఎం భజన్‌లాల్ పీఠాలు కదులుతున్నాయి. మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ కూడా రాజీనామా చేయడం ఖాయం. రోజుకు మూడుసార్లు దుస్తులు మార్చుకునే అలవాటున్న మోదీ ఇప్పుడు ఒకే డ్రెస్‌తో మూడు కార్యక్రమాలకు వెళుతున్నారు. ఏం తిన్నదీ పట్టించుకోవడం మానేశారు'' అంటూ బఘెల్ ఎద్దేవా చేశారు.

వేదికపై చోటు దక్కని ఆర్‌ఎల్‌డీ

న్యూఢిల్లీ: పాత పార్లమెంట్(సంవిధాన్ సదన్)లో శుక్రవారం ఎన్డీఏ భేటీ సందర్భంగా రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్‌ఎల్‌డీ) చీఫ్ జయంత్ చౌదరిని వేదికపైకి ఆహ్వానించకుండా ఎంపీల మధ్య కూర్చోబెట్టి బీజేపీ అవమానించిందంటూ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఆరోపించాయి. '' ఒక్క సీటు సాధించిన పార్టీలకూ వేదికపై బీజేపీ చోటిచ్చింది. ఇద్దరు ఎంపీలున్న ఆర్‌ఎల్‌డీని పట్టించుకోలేదు. ఆత్మాభిమానముంటే వెంటనే ఎన్డీఏను వీడండి. మిమ్మల్ని అవమానిస్తే సహించకండి' అని జయంత్‌కు ఎస్పీ ఎంపీ రాజీవ్ రాయ్ హితవు పలికారు. కుర్చీలను బట్టి గౌరవం మారదని, అదేమంత పెద్ద విషయం కాదని ఆర్‌ఎల్‌డీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ బదులిచ్చారు.

రష్యాలో నదిలో మునిగి... మన విద్యార్థుల మృతి

న్యూఢిల్లీ: రష్యాలోని వెలికీ నోవ్‌గోరోడ్ ప్రాంతంలోని విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న నలుగురు భారత వైద్య విద్యార్థులు వోల్ఖోవ్ నదిలో మునిగి దుర్మరణం పాలయ్యారు. మంగళవారం ఈ దుర్ఘటన జరిగినట్టు విదేశాంగ శాఖ శుక్రవారం వెల్లడించింది. ఒక మహిళా విద్యార్థిని కాపాడి వైద్య చికిత్స అందిస్తున్నారు. ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. విద్యార్థులంతా వెలికీ నోవ్‌గోరోడ్ స్టేట్ వర్సిటీలో చదువుతున్నారు. మృతులంతా మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాకు చెందిన వారు. మృతుల్లో జియా, జిషాన్ అక్కాతమ్ముళ్లు. నది ఒడ్డున వాకింగ్ తర్వాత వారంతా నదిలోకి దిగారు. ఈత కొడుతుండగా జిషాన్ తమ కుటుంబసభ్యులకు వీడియో కాల్ చేశాడు. ఈత వద్దని కుటుంబసభ్యులు ఫోన్లో వారిస్తుండగానే జియా మునగడం, కాపాడేందుకు ప్రయత్నిస్తూ మిగతావారు కూడా నదిలో కొట్టుకుపోవడం కాల్‌లో రికార్డయింది. మృతదేహాల తరలింపు కోసం భారత కాన్సులేట్ ప్రయత్నిస్తోంది.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు... 18 మంది దుర్మరణం

డెయిర్ అల్ బలాహ్(గాజా): సెంట్రల్ గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు కొనసాగుతున్నాయి. నుసెయిరత్‌లో ఐరాస శరణార్థి శిబిరం నడుస్తున్న స్కూలుపై గురువారం జరిపిన దాడిలో 33 మంది చనిపోయిన విషయం తెల్సిందే. ఇజ్రాయెల్ సైన్యం డెయిర్ అల్ బలాహ్, జవాయిడా పట్టణాల్లోని సెయిరత్, మఘాజి శరణార్థి శిబిరాలపై శుక్రవారం రాత్రి జరిపిన దాడుల్లో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నలుగురు చిన్నారులు, ఒక మహిళ ఉన్నట్లు అల్–హక్సా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కాగా, గురువారం నుసెయిరత్‌లోని స్కూల్‌పై జరిపిన దాడిని ఇజ్రాయెల్ సమర్థించుకుంది. స్కూల్ భవనంలోని రెండు, మూడు అంతస్తుల్లో జరిగిన లక్షిత దాడుల్లో మృతి చెందిన వారిలో 9 మంది మిలిటెంట్లు ఉన్నట్లు వివరించింది. రెండు రోజులుగా జరుపుతున్న దాడుల్లో మిలిటెంట్ల సొరంగాలను, మౌలిక వసతులను ధ్వంసం చేసినట్లు ఆర్మీ తెలిపింది.


ఐఎస్‌ఎస్‌లోకి ప్రవేశిస్తున్న సునీత


అనంతరం ఆనందంతో డాన్స్ చేస్తున్న దృశ్యం

ఐఎస్‌ఎస్‌లోకి సునీత

హూస్టన్: భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్ మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌తో కలిసి గమ్యస్థానం చేరుకున్నారు. బోయింగ్ కంపెనీ అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో బుధవారం అంతరిక్ష ప్రయాణం ప్రారంభించిన ఇద్దరు సాహసికులు గురువారం మధ్యాహ్నం 1.34 గంటలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి(ఐఎస్‌ఎస్) విజయవంతంగా అడుగుపెట్టారు. అవాంతరాలను అధిగమించి స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ ఐఎస్‌ఎస్‌తో అనుసంధానమైంది. ఐఎస్‌ఎస్‌లో ఇప్పటికే ఏడుగురు వ్యోమగాములుండగా, సునీత, బుచ్ విల్‌మోర్‌తో తొమ్మిదికి చేరారు. కొత్తగా తమ వద్దకు చేరిన సునీతా, విల్‌మోర్‌కు ఏడుగురు ఆస్ట్రోనాట్స్ ఘన స్వాగతం పలికారు. ఆలింగనం చేసుకున్నారు. సునీత ఆనందంతో నృత్యం చేశారు. వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు. ''ఐఎస్‌ఎస్ వ్యోమగాములంతా నా కుటుంబ సభ్యులే. వారిని కలుసుకున్నందుకు వేడుక చేసుకున్నా. ఇదో లిటిల్ డ్యాన్స్ పార్టీ'' అన్నారు. సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ వారం తర్వాత స్టార్‌లైనర్‌లో భూమిపైకి తిరిగి రానున్నారు.

నేడు కాంగ్రెస్ కీలక భేటీలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) కీలక సమావేశం శనివారం ఢిల్లీలోని అశోక హోటల్‌లో జరుగనుంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటు భవిష్యత్తు కార్యాచరణపై పార్టీ అగ్రనేతలు చర్చించనున్నారు. పార్టీని బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై సంప్రదింపులు జరుపుతారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతోపాటు వివిధ రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతలు ఈ భేటీలో పాల్గొంటారు. సమావేశం తర్వాత విందు ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. అలాగే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం శనివారం సాయంత్రం 5.30 గంటలకు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో నిర్వహించనున్నారు. కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలతోపాటు రాజ్యసభ సభ్యులు సైతం ఈ భేటీలో పాల్గొంటారని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తెలిపారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ పక్ష నేతగా రాహుల్ గాంధీని ఎన్నుకోవాలని పలువురు నాయకులు కోరుతున్నారు. పార్లమెంటరీ పార్టీ భేటీలో ఈ అంశంపై చర్చించే అవకాశం ఉంది.

రాహుల్ రెండు వారాల్లోగా తేల్చుకోవాలి

న్యూఢిల్లీ: రాయ్‌బరేలీ, వయనాడ్‌లలో నెగ్గిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ సీటును వదులుకోవాలో తేల్చుకోవడానికి మరో 11 రోజులే మిగిలి ఉన్నాయి. చట్టం, రాజ్యాంగం నిబంధనల ప్రకారం ఏదైనా ఒక అభ్యర్థి రెండు చోట్ల నుంచి గెలుపొందితే.. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచి రెండు వారాల్లోగా ఏదో ఒక సీటును వదులుకోవాల్సి ఉంటుందని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్, రాజ్యాంగ నిపుణులు పి.డి.టి. ఆచారి శుక్రవారం తెలిపారు. 17వ లోక్‌సభ రద్దయినా.. కొత్త ప్రొటెం స్పీకర్ వచ్చేవరకు స్పీకర్‌గా ఓం బిర్లా కొనసాగుతారని, ఆయనకు రాహుల్ తన రాజీనామా లేఖను పంపాల్సి ఉంటుందని వివరించారు. రెండు వారాల్లోగా నెగ్గిన రెండు సీట్లలో ఒకదాన్ని వదులుకోకపోతే.. రెండు సీట్లూ కోల్పోయే ప్రమాదం ఉంటుందని ఆచారి తెలిపారు. రెండుసార్లు గెలిపించిన వయనాడ్ (కేరళ), తమ కుటుంబానికి కంచుకోట అయినా రాయ్‌బరేలి (ఉత్తరప్రదేశ్)లలో రాహుల్ దేన్ని వదులుకుంటారో వేచిచూడాలి.

స్పీకర్ పోస్టు తీసుకోండి: ఆదిత్య ఠాక్రే

ముంబై: అధికార ఎన్డీయేలో కీలక భాగస్వాములుగా మారినందున లోక్‌సభ స్పీకర్ పదవి కోసం పట్టుబట్టాలని తెలుగుదేశం పార్టీ, జేడీ(యూ)కు శివసేన(ఉద్ధవ్) నేత ఆదిత్య ఠాక్రే సూచించారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కేంద్రంలో అధికారం చేపట్టిన వెంటనే మిత్రపక్షాలను విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. పార్టీని కాపాడుకోవాలంటే లోక్‌సభ స్పీకర్ పోస్టు తీసుకోవాలని టీడీపీ, జేడీ(యూ)కు స్పష్టంచేశారు. బీజేపీ కుతంత్రాలకు తాము కూడా బాధితులేమని వెల్లడించారు. శివసేన, ఎన్సీపీలో జరిగిన చీలికలను ఆదిత్య ఠాక్రే గుర్తుచేశారు.

నెహ్రూతో పోలికేంటి?: చిదంబరం

చెన్నై: వరుసగా మూడోసారి ప్రధాని పదవిని చేపట్టనుండటాన్ని గతంలో మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ నెలకొల్పిన రికార్డుతో ప్రధాని మోదీ పోల్చుకోవడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం తప్పుపట్టారు. 2014 ఎన్నికల్లో మోదీ సారథ్యంలో బీజేపీ 282 సీట్లను, 2019లో 303 సీట్లను, తాజాగా సగానికి 32 సీట్లు తక్కువగా 240 సీట్లు మాత్రమే సాధించిందని ఆయన పేర్కొన్నారు. అదే నెహ్రూ హయాంలో కాంగ్రెస్ పార్టీ వరుస ఎన్నికల్లో 361, 374, 364 సీట్లు సాధించిందని గుర్తు చేశారు. నెహ్రూతో మోదీ తనను తాను పోల్చుకోవడాన్ని కాంగ్రెస్ పార్టీయే కాదు ప్రజలు కూడా అంగీకరించరని చిదంబరం కుండబద్దలు కొట్టారు.

కౌర్‌కు మద్దతుగా రేపు రైతుల ర్యాలీ

చండీగఢ్: ఎయిర్‌పోర్టుపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌ను చెంపదెబ్బ కొట్టిన సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్‌కు పలు రైతు సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఆమెకు అండగా ఉంటామని, చండీగఢ్ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకున్న ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, నిజానిజాలు బయటకు రావాలని సంయుక్త కిసాన్ మోర్చా నేత జగజీత్ సింగ్ దలీవాల్, కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ప్రధాన కార్యదర్శి శర్వాన్‌సింగ్ అన్నారు. త్వరలో పంజాబ్ డీజీపీని కలుస్తామని చెప్పారు. మహిళా కానిస్టేబుల్‌కు అన్యాయం జరగడానికి వీల్లేదన్నారు. వారు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రైతులతోపాటు పంజాబ్ ప్రజల మనోభావాలను కంగనా రనౌత్ గాయపర్చారని శర్వాన్ సింగ్ విమర్శించారు. కుల్విందర్ కౌర్‌కు న్యాయం చేకూర్చాలని డిమాండ‌చేస్తూ ఈ నెల 9న పంజాబ్‌లోని మొహాలీలో 'ఇన్సాఫ్ ర్యాలీ' నిర్వహించనున్నట్లు రైతులు సంఘాలు శుక్రవారం ప్రకటించాయి.

కేజ్రీవాల్‌కు రెగ్యులర్ బెయిలివ్వొద్దు: ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటున్న సీఎం కేజ్రీవాల్‌కు రెగ్యులర్ బెయిల్ ఇవ్వొద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శుక్రవారం ఢిల్లీ కోర్టును కోరింది. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా తమ వద్ద పక్కాగా చాలా ఆధారాలున్నాయని స్పెషల్ కోర్టు జడ్జి కావేరీ బవేజాకి తెలిపింది. తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడిన కేజ్రీవాల్‌ను బెయిల్‌పై విడుదల చేస్తే కేసు దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించింది. దీంతో, తదుపరి వాదనలను 14వ తేదీకి వాయిదా వేస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. కేజ్రీవాల్ ప్రస్తుతం తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉండటం తెల్సిందే.

రాహులే విపక్ష నేత కావాలి: శశిథరూర్

న్యూఢిల్లీ: లోక్‌సభలో విపక్ష నేత హోదాలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సరిగ్గా సరిపోతారని తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. నాలుగోసారి ఎంపీగా గెలిచిన సందర్భంగా శుక్రవారం పీటీఐ ఆయనను ఇంటర్వ్యూ చేసింది. ''ఇన్నాళ్లూ ఎవరి సలహాలు తీసుకోని మోదీ, అమిత్ షాలకు ఈసారి ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపడం సవాల్‌తో కూడిన పనే. ప్రత్యేక హోదాలు, అగ్నివీర్ పథకం సమీక్షలు అంటూ ఏపీ, బిహార్‌లోని ఎన్డీఏ పార్టీలు బీజేపీ ప్రభుత్వానికి చిక్కుల ముడి వేస్తున్నాయి. రాహుల్, ఖర్గేలు దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేశారు. రాహుల్.. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్. లోక్‌సభలో విపక్ష నేతగా ఆయనే ఉండాలి. ఆ హోదాకు ఆయన సరిగ్గా సరిపోతారు''. అని వ్యాఖ్యానించారు.

'నీట్'పై కేంద్రం బదులివ్వాల్సిందే: ప్రియాంక

సాక్షి, న్యూఢిల్లీ: నీట్ పరీక్ష పేపర్ లీకైనప్పటి నుంచి తాజాగా ఫలితాలు వెలువడే వరకు భారీ కుంభకోణం జరిగి ఉంటుందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ అనుమానం వ్యక్తం చేశారు. నీట్ యూజీ ఫలితాలు వెలువడినప్పటి నుంచి 'ఎక్స్'వేదికగా 'నీట్ పేపర్‌ని రద్దు చేయండి'అనే హ్యాష్‌ట్యాగ్‌తో ట్రెండ్ అవుతోంది. దీనిపై శుక్రవారం ప్రియాంకా గాంధీ 'ఎక్స్'లో స్పందించారు. 'మొదట నీట్ పేపర్ లీకయిందని, ఇప్పుడు ఫలితాల్లోనూ స్కామ్ జరిగిందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఒకే పరీక్ష కేంద్రంలో ఆరుగురు విద్యార్థులు వంద శాతం మార్కులు తెచ్చుకోవడంతో అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. ఫలితాల అనంతరం దేశవ్యాప్తంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న వార్తలు రావడం బాధాకరం, దిగ్భ్రాంతికరం. లక్షలాది మంది విద్యార్థుల ప్రశ్నలకు ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు? ఈ ఫిర్యాదులపై విచారణ జరిపి సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత లేదా?'అంటూ ప్రియాంక కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

బెంగళూరు: కర్ణాటక బీజేపీ శాఖ ఫిర్యాదు మేరకు నమోదైన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీకి ఊరట లభించింది. బెంగళూరు ప్రత్యేక కోర్టు ఆయనకు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో రెండుసార్లు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు అడిగినందుకు న్యాయస్థానాన్ని క్షమాపణ కోరారు. దీంతో ఆయనకు రూ.75 లక్షల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. కర్ణాటకలో 2019 నుంచి 2023 దాకా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తూ 2023 మే 5న పత్రికల్లో కేపీసీసీ తరఫున ప్రకటనలిచ్చారు. అవినీతి రేటు కార్డు, 40 శాతం కమిషన్ ప్రభుత్వం శీర్షికలతో అవి ప్రచురితమయ్యాయి. వాటిని రాహుల్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కర్ణాటక బీజేపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

7

సాక్షి హైదరాబాద్

శనివారం | 8 | జూన్ | 2024

చేపల మార్కెట్లు కిటకిట



ముషీరాబాద్: మృగశిర కార్తె సందర్భంగా చేపల మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. నగరంలోనే చేపల అమ్మకాలకు ప్రసిద్ధి గాంచిన ముషీరాబాద్ మార్కెట్‌లో విక్రయాలు జోరుగా కొనసాగాయి. బొచ్చె, రవ్వ చేపలను మామూలు రోజుల కంటే రూ.10- 20 అధికంగా విక్రయించారు. కిలో చేపలు రూ.120-130కి పలికాయి. సాధారణ రోజుల్లో కిలో రూ.400-450 ఉండే కొరమీను మృగశిర సందర్భంగా రూ.500- 550కు విక్రయించారు.





ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం కోసం వచ్చిన జనం

చేప ప్రసాదానికి వేళాయే

నేడు, రేపు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పంపిణీ

- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు
- వేలాదిగా చేరుకున్న ఆస్తమా బాధితులు



గన్‌ఫౌండ్రీ/చార్మినార్/దూద్‌బౌలి: మృగశిర కార్తెను పురస్కరించుకుని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బత్తిని కుటుంబం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో చేప ప్రసాదం పంపిణీ చేసేందుకు అంతా సిద్ధం చేసినట్లు బత్తిని హరినాథ్, బత్తిని అమర్నాథ్ గౌడ్ తెలిపారు. కాగా.. శుక్రవారం ఉదయం చేప ప్రసాదం తయారీ కోసం దూద్‌బౌలిలోని తమ స్వగృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ క్రమంలో శుక్రవారం మత్స్యశాఖ, జీహెచ్‌ఎంసీ, పోలీస్ తదితర శాఖల అధికారులు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. 2 లక్షల చేప పిల్లలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మొత్తం 32 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. రూ.40 చొప్పున చేప పిల్లల టోకెన్ ధర నిర్ణయించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చే ఆస్తమా రోగులు, వారి సహాయకులకు స్వచ్ఛంద సంస్థలు భోజన వసతులు ఏర్పాటు చేశాయి. ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. చేప ప్రసాదం పంపిణీ శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమై ఆదివారం ఉదయం 6 గంటల వరకు నిర్విరామంగా కొనసాగుతుంది. ఇందుకోసం 300 మంది బత్తిని కుటుంబ సభ్యులు, వలంటీర్లు విడతల వారీగా విధుల్లో ఉంటారు. చేప ప్రసాదం కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కాగా.. ఇప్పటికే ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు ఆస్తమా బాధితులు తరలివచ్చారు.

ట్రాఫిక్ ఆంక్షలు..

చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గృహకల్ప, గగన్ విహార్‌ల వద్ద తమ వాహనాలను పార్క్ చేసి గేట్‌నెం. 2 ద్వారా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోకి చేరుకోవాలని సూచించారు. వీఐపీలకు గేట్‌నెం.1 నుంచి ప్రవేశం కల్పించారు.

ముగ్గురిలో మొగ్గు ఎటో!

కేంద్ర మంత్రి పదవి ఎవరిని వరించేనో!!

- ఆశల పల్లకిలో గ్రేటర్ ఎంపీలు
- ఊహాగానాల్లో బీజేపీ శ్రేణులు



సాక్షి, సిటీబ్యూరో: త్వరలో కొలువుదీరనున్న కేంద్ర మంత్రివర్గంలో గ్రేటర్ ఎంపీల్లో ఎవరికి చోటు దక్కుతుందోనని అటు బీజేపీ నేతల్లో, ఇటు ప్రజల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో బీజేపీ నుంచి ముగ్గురు ఎంపీలు ఎన్నికయ్యారు. వీరిలో ఒకరికి కేంద్రమంత్రి పదవి గ్యారంటీ అనే అభిప్రాయాలున్నాయి. గెలిచిన నేతల అభిమానులు మాత్రం ఇద్దరికి మంత్రి పదవులిచ్చినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదంటున్నారు.

పదవి ఖాయమే.. కానీ..

నగరానికి చెందిన బండారు దత్తాత్రేయకు వాజపేయి, మోదీ హయాంల్లోనూ మంత్రి పదవులు లభించాయి. కేంద్ర సహాయమంత్రి, కేబినెట్ మంత్రి పదవుల్ని ఆయన నిర్వర్తించారు. అలాగే ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు సికింద్రాబాద్ నుంచి రెండో పర్యాయం ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డికి సైతం గత మోదీ ప్రభుత్వ హయాంలో తొలుత సహాయ, తర్వాత కేబినెట్ మంత్రి పదవులు వరించాయి. దత్తాత్రేయ కీలకమైన పట్టణాభివృద్ధిశాఖ, కార్మికశాఖల మంత్రిగానూ పనిచేశారు. కిషన్‌రెడ్డి తొలుత హోంశాఖ సహాయ మంత్రిగా, అనంతరం పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో ఈసారీ రాజధాని పరిధిలోని వారికి మంత్రి పదవి ఖాయంగా లభించనుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అయితే వీరిలో ఎవరిని ఆ పదవి వరించనుందన్నది ఉత్కంఠ కలిగిస్తోంది.

ఓసీకైతే కిషన్‌రెడ్డి.. బీసీకైతే ఈటల..

కిషన్‌రెడ్డికే మరోసారి మంత్రిగా అవకాశం కల్పిస్తారని భావిస్తున్న వారితోపాటు మల్కాజిగిరి నుంచి గెలిచిన ఈటల రాజేందర్‌కు అవకాశం లభించవచ్చని భావిస్తున్న వారూ ఉన్నారు. టీఆర్‌ఎస్ ఉద్యమ సమయం నుంచీ రాజకీయాల్లో ఆయన క్రియాశీలపాత్ర వహించడం, అన్నివర్గాల వారిని కలుపుకొని పోయే తత్వం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి నుంచి గెలిచినందున అధిష్టానం ఆయనకు తగిన ప్రాధాన్యమిస్తుందని చెబుతున్నారు. వివిధ సమీకరణాలు, రాష్ట్రంలో గెలిచిన ఇతర ప్రాంతాల వారినీ పరిగణనలోకి తీసుకుంటే.. నగరం నుంచి ఓసీకి ఇవ్వాలనుకుంటే కిషన్‌రెడ్డికి, బీసీకి ఇవ్వాలనుకుంటే రాజేందర్‌కు మంత్రి పదవి లభించగలదని భావిసున్నవారు ఉన్నారు.

క్యూలో 'కొండా' సైతం..

కాగా.. చేవెళ్ల నుంచి గెలిచిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి సైతం మంత్రి పదవి లభించే అవకాశాలున్నాయని ఆయన అభిమానులు చెబుతున్నారు. ఈటల రాజేందర్‌కు మంత్రిగా లేదా పార్టీ రాష్ట్ర శాఖ పగ్గాలు అప్పగించే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. గెలిచిన ఎంపీలు సైతం ఎవరికి వారుగా తమకు మంత్రి పదవి లభించగలదనే ఆశాభావంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇంతకీ మంత్రి పదవి ఎవరిని వరించనుందన్నది తేలాలంటే ప్రకటించేంతవరకు ఆగాల్సిందే.



'కార్పొరేట్‌'పై కన్నెర్ర

రాష్ట్రంలోని కార్పొరేట్ కళాశాలల ఆగడాలపై విద్యార్థి లోకం కదం తొక్కింది. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయాన్ని ముట్టడించారు. ఒకే క్యాంపస్‌లో హాస్టళ్లను, కాలేజీలను నడుపుతూ లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇంటర్ బోర్డు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నగధగలు

మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైదరాబాద్ జ్యువెలరీ పెరల్, జెమ్ ఫెయిర్ (హెచ్‌జేఎఫ్)ను శుక్రవారం హైదరాబాద్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరిమళ హనానూతన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మోడల్స్ వజ్రాభరణాలు ధరించి ఇలా తళుక్కుమన్నారు. – మాదాపూర్



వలలో ఇలా..

డేటింగ్ యాప్స్.. హనీట్రాప్స్!

యువతులతో పబ్స్ యజమానుల భారీ స్కామ్

- వీటి ద్వారా వ్యాపారులు, బడాబాబులకు ఎర
- పథకం ప్రకారం పబ్బులకు రప్పిస్తూ కథలు
- మద్యం తాగకున్నా తాగినట్లు సీన్ క్రియేట్
- ఈ పేరుతో భారీగా బిల్లులు వడ్డిస్తున్న వైనం
- హైటెక్ సిటీలోని మోష్ పబ్ ఉదంతంలో వెలుగులోకి



సాక్షి, సిటీబ్యూరో: డేటింగ్ యాప్స్ కేంద్రంగా పబ్స్ యజమానులు, కొందరు యువతులు చేస్తున్న భారీ స్కామ్ వెలుగులోకి వచ్చింది. ఈ యాప్స్ ఆధారంగా వ్యాపారులు, బడా బాబులకు ఎర వేయడం, వాళ్లను పబ్స్‌కు రప్పించడం ఇందులో మొదటి ఎత్తు. సదరు యువతులకు మద్యం పేరుతో సాఫ్ట్ డ్రింక్స్ సరఫరా చేసే పబ్స్ నిర్వాహకులు భారీ బిల్లుల్ని మాత్రం వెంట వచ్చిన వారికి ఇస్తాయి. ఇలా వచ్చిన సొమ్ములో కొంత వాటా ఆ యువతులకు ఇస్తున్నాయి. కొన్నాళ్లుగా గుట్టుగా సాగుతున్న ఈ దందాలో అనేక మంది బాధితులుగా మారినా ఎవరూ బయటపడలేదు. సోమవారం హైటెక్ సిటీ సమీపంలోని మోష్ పబ్‌లో మోసపోయిన వ్యాపారి సోషల్ మీడియా ద్వారా తన గోడు వెళ్లబోసుకోవడంతో వెలుగులోకి వచ్చింది. ఓ యువతి వలలో పడి రూ.40,505 బిల్లు చెల్లించిన ఆ బాధితుడి వ్యథ ఇది..

టిండర్ యాప్ ద్వారా పరిచయం..

నగరానికి చెందిన వ్యాపారికి డేటింగ్ యాప్ టిండర్ ద్వారా రితికగా పేరు చెప్పుకున్న యువతి పరిచయమైంది. కాసేపు చాటింగ్ చేసిన ఈమె కలుద్దామంటూ ఆఫర్ ఇచ్చింది. వ్యాపారి సైతం ఆసక్తి చూపించడంతో హైటెక్ సిటీ మెట్రో స్టేషన్‌ను మీటింగ్ పాయింట్‌గా చెప్పింది. సోమవారం సాయంత్రం అక్కడకు వచ్చిన వ్యాపారిని కలిసిన రితిక కొద్దిసేపటికి సమీపంలోని ఓ భవనం నాలుగో అంతస్తులో ఉన్న పబ్‌కు వెళ్దామని చెప్పింది. అక్కడకు చేరుకున్న తర్వాత కొద్దిసేపు తీయగా మాట్లాడిన రితిక మద్యం తాగుదామంటూ అడిగింది. వ్యాపారి అంగీకరించడంతో వెయిటర్‌ను కలిసి ఆ పబ్‌లో ఉన్న వాటిలో ఖరీదైన మద్యం ఆర్డర్ ఇచ్చింది. డేటింగ్ యాప్ ద్వారా వల వేయాలని, పడిన వారిని పబ్‌కు తీసుకురావాలని పబ్ యజమానులు–యువతి మధ్య ఒప్పందం ఉంది. ఈ నేపథ్యంలోనే 'పబ్స్ అండ్ గారల్స్' కలిసి వినూత్న స్కామ్‌కు తెరలేపారు.

మద్యం పేరుతో కూల్‌డ్రింక్స్ సరఫరా..

వ్యాపారితో కలిసి సదరు యువతి రాకను గమనించే పబ్ నిర్వాహకులు వెయిటర్‌ను అప్రమత్తం చేస్తారు. దీంతో అతడు ఏ మద్యం ఆర్డర్ తీసుకున్నా.. గ్లాసుల్లో సరఫరా చేసేది మాత్రం కూల్‌డ్రింకే. రితిక సైతం ఆ రోజు ఒక్కో పెగ్గు రూ.1,799 ఖరీదు చేసే పది పెగ్గుల మద్యం ఆర్డర్ చేసింది. ఈ పేరుతో పబ్ నిర్వాహకులు సరఫరా చేసిన కూల్‌డ్రింక్ తాగుతూపోయింది. దీంతో రూ.20 ఖరీదు చేసే కూల్‌డ్రింక్‌కు యువతి సహకారంతో మద్యం రంగుపూసిన నిర్వాహకులు రూ.1,799 చొప్పున వసూలు చేశారు. ఈ 'మద్యం'తో పాటు ఇతర డ్రింక్స్, తినుబండారాలు కలిపి రూ.40,505 (పన్నులతో కలిపి) బిల్లు చేసింది. చివరకు వెయిటర్ బిల్లు తీసుకువచ్చిన తర్వాత అది వ్యాపారి చేతిలో పెట్టిన యువతి వాష్‌రూమ్‌కు వెళ్లి వస్తానంటూ ఉడాయించింది. దాదాపు పది పెగ్గులు తాగిన ఆ యువతిలో ఎలాంటి తేడా లేకపోవడం, తూలకుండా నేరుగా నడిచి వెళ్లడంతో పాటు ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో వ్యాపారికి అనుమానం వచ్చింది. ఆ పబ్‌కు సంబంధించిన గూగుల్ రివ్యూస్ పరిశీలించి షాక్ అయ్యాడు.

అక్కడ వేదనలు నిత్యకృత్యం

సదరు పబ్‌లో ఇలాంటి మోసాలు నిత్యకృత్యమంటూ అనేక మంది వెలిబుచ్చిన వేదనలు ఆ రివ్యూస్‌లో ఆ వ్యాపారికి కనిపించాయి. ఓ వ్యక్తి రూ.16 వేలు, మరో వ్యక్తి రూ.24 వేలు, ఇంకొకరు రూ.20 వేలు చొప్పున చెల్లించారని తెలిసింది. వీరిలో ఒకరైతే బాత్‌రూమ్‌కు వెళ్లిన ఆ యువతి కోసం దాదాపు ఏడెనిమిది గంటలు పబ్‌లోనే వేచి ఉన్నారట. దీనికోసం ఆయన చేసిన ఖర్చు మందు బిల్లుకు అదనం. రితిక, కృతిక పేర్లతో కొందరు యువతులు ఇదే పబ్ నిర్వాహకులతో కలిసి ఈ దందా చేస్తున్నారని, అలా వచ్చిన మొత్తంలో యువతులు కొంత కమీషన్ తీసుకుంటున్నారని వ్యాపారి గుర్తించారు. ఈ విషయంపై పబ్ నిర్వాహకులను ప్రశ్నించగా.. వారి నుంచి బెదిరింపులు ఎదురయ్యాయి. అంతలోనే రంగ ప్రవేశం చేసిన బౌన్సర్లు బలవంతంగా బిల్లు కట్టించి పంపారు. దీంతో ఆ వ్యాపారి తన గోడును సోషల్ మీడియా ద్వారా వెళ్లబోసుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

మోష్ పబ్‌పై కేసు నమోదు

హైటెక్ సిటీలోని మోష్ పబ్ యాజమాన్యంపై శుక్రవారం సుమోటో కేసు నమోదు చేసినట్లు మాదాపూర్ ఎస్సై ఎన్‌వీ రమణ తెలిపారు. కొన్ని ఆన్‌లైన్ డేటింగ్ యాప్స్ ద్వారా అమ్మాయిలతో ఎరవేసి, అలా వచ్చిన కస్టమర్లకు విలువైన మద్యం తాగించి, వారి నుంచి ఎక్కువ మొత్తంలో బిల్లులు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన అంశాల ఆధారంగా నమోదైన ఈ కేసు దర్యాప్తులో ఉందని, వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఆయా యువతులకు, పబ్‌కు మధ్య సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

బాధితుల భయమే వీరికి వరం

ఇలా యువతుల వల్లో పడిన బాధితుల్లో అనేక మంది వివాహితులు, ఉన్నత కుటుంబాలకు చెందిన వాళ్లు ఉంటున్నారు. దీంతో తాము మోసపోయామని తెలిసినా.. యువతి కోసం వెళ్లామని బయటపడితే పరువుపోతుందని భయపడుతున్నారు. దీంతో కొందరు మాత్రం పబ్‌కు సంబంధించిన గూగుల్ రివ్యూస్‌లో విషయం పొందుపరుస్తున్నా.. అనేక మంది మిన్నకుండిపోతున్నారు. ఇదే అటు పబ్ నిర్వాహకులు, యువతులకు వరంగా మారుతోంది. ఈ తరహా దందాలో ఆ ఒక్క పబ్‌లోనే కాదని, నగరంలోని అనేక పబ్బుల్లో జరుగుతోందనే అనుమానాలు ఉన్నాయి. వాటిలోకి ఈ 'జంటలు' ప్రవేశిస్తున్న సమయంలో కేవలం యువకుల వివరాలు మాత్రమే అడిగి, నమోదు చేసుకుంటున్నారు. ఈ హనీట్రాప్ దందాపై తమకు ఎలాంటి సమాచారం, ఫిర్యాదులు లేవని పోలీసులు చెబుతున్నారు. ఇలా చేయడం కచ్చితంగా నేరమే అని, దీనికి యువతులతో పాటు పబ్స్ నిర్వాహకులు బాధ్యులని స్పష్టం చేస్తున్నారు. బాధితులుగా మారిన ఎవరైనా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

డ్రోన్ సర్వేకు సై

ఇళ్లతో పాటు యుటిలిటీస్‌కు

- ప్రతి ఇంటికీ యూనిక్ నెంబర్
- ప్రభుత్వానికి ఆదాయం పెంపు
- ప్రజలకు మెరుగైన సేవలు
- ఏజెన్సీని ఖరారు చేసిన బల్దియా
- త్వరలో పనులు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని భవనాలు, యుటిలిటీస్‌కు సంబంధించి ఓవైపు డ్రోన్ ఆధారిత జీఐఎస్ సర్వే, మరోవైపు డోర్ టు డోర్ సర్వే నిర్వహించనున్నారు. రెండింటినీ అనుసంధానం చేస్తూ జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని భవనాలు, యుటిలిటీస్‌ను మ్యాపింగ్ చేస్తారు. తద్వారా మెరుగైన పట్టణ ప్రణాళిక, వనరుల నిర్వహణ, ప్రజలకు మేలైన సేవలందుతాయి. తాజాగా ఈ పనుల కోసం టెండరు ద్వారా ఏజెన్సీని ఎంపిక చేశారు. అది త్వరలో పని ప్రారంభించనుంది.

ప్రతి ఇంటికీ..

సర్వేలో భాగంగా ప్రతి ఇంటికి యూనిక్ ఐడెంటిఫికేషన్ నెంబర్ జారీ చేస్తారు. తద్వారా ఏవైనా విపత్తులు, ప్రమాదాలు వంటివి జరిగినప్పుడు అత్యవసర సమయాల్లో వెంటనే సంబంధిత యంత్రాంగం అక్కడకు చేరుకునేందుకే కాక ఇంటింటి నుంచి చెత్త సేకరణను పర్యవేక్షించేందుకూ వీలవుతుంది. ప్రతి ఇంటికీ కేటాయించే యూనిక్ నెంబర్‌ను వాటర్‌బోర్డు, విద్యుత్ సంస్థలు సైతం వినియోగించుకుంటాయి. డోర్ టు డోర్ సర్వేలో భాగంగా భవనం పేరు, భవనంలో ఉన్న ఫ్లాట్లు, ఆస్తి పన్ను నెంబర్, వాటర్ కనెక్షన్, విద్యుత్ కనెక్షన్ నెంబర్, భవన వినియోగం తదితరమైనవి సేకరిస్తారు. వీటిని యూనిక్ ఐడెంటిఫికేషన్ నెంబర్‌కు లింక్ చేస్తారు. దాదాపు నెల తర్వాత సర్వే ప్రారంభం కానుందని, ప్రజలు సహకరించాల్సిందిగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ కోరారు.

వెబ్‌పోర్టల్ సైతం..

ప్రజలే స్వచ్ఛందంగా జీఐఎస్ మ్యాప్‌లో తమ ఇంటిని లింక్ చేసేందుకు పబ్లిక్ వెబ్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు. సర్వేలో సేకరించే వివరాలు గోప్యంగా ఉంటాయి. దీన్ని కేవలం పట్టణ నిర్వహణను మెరుగుపరిచేందుకు, ప్రజలకు మెరుగైన సదుపాయాలందజేసేందుకేనని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పనులకు ఎంపికైన నియో జియో ఏజెన్సీ ఈ సర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేయడంతోపాటు రెండేళ్ల వరకు నిర్వహణ బాధ్యతలు కూడా చూస్తుంది.

పెరగనున్న ఆదాయం..


అంతే కాకుండా ప్రతి భవనం డేటాబేస్‌లోకి రావడంతోపాటు దాని విస్తీర్ణం, వినియోగం తదితరమైనవి కచ్చితంగా మ్యాపింగ్ చేస్తారు. ప్రస్తుతం చాలా భవనాల వాస్తవ విస్తీర్ణాలు, ఆస్తిపన్ను చెల్లిస్తున్న విస్తీర్ణాల్లో తేడాలున్నాయి. నివాస భవనాల ఆస్తిపన్ను చెల్లిస్తూ వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారూ ఉన్నారు. సర్వే వల్ల ఇవన్నీ తెలుస్తాయి. తద్వారా జీహెచ్‌ఎంసీకి, ఆస్తిపన్ను, వాటర్ బోర్డుకు నల్లాబిల్లుల ద్వారా వచ్చే ఆదాయం కూడా పెరగవచ్చని భావిస్తున్నారు. ప్రజలు సైతం వివిధ బిల్లుల్ని విడివిడిగా చెల్లించనవసరం లేకుండా అన్ని బిల్లులనూ ఒకేసారి చెల్లించే సదుపాయం అందుబాటులోకి తేనున్నట్లు తెలుస్తోంది.

యుటిలిటీస్ సమాచారం సైతం

జీహెచ్‌ఎంసీ పరిధిలోని 650 చదరపు కిలోమీటర్ల పరిధిలోని దాదాపు 20 లక్షల ఆస్తులతోపాటు పార్కులు, నాలాలు, నీటి సరఫరా లైన్లు, మురుగునీటి లైన్లు, ఆటస్థలాలు, రోడ్లు, వీధిదీపాలు, హాస్పిటళ్లు, ఫైర్ సర్వీస్ స్టేషన్లు, విద్యా సంస్థలు, పెట్రోలు బంకులు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, చెరువులు, ఖాళీ స్థలాలు, రైల్వే లైన్లు తదితర భౌగోళిక వివరాలన్నీ మ్యాపింగ్ చేస్తారు. ఈ వివరాలతో వివిధ ప్రభుత్వ విభాగాలు తమ శాఖలకు సంబంధించిన పనులు చేయడం సులభం కానుంది. అంతే కాదు జీహెచ్‌ఎంసీలోని వార్డులు, సర్కిళ్లు, స్లమ్స్ వివరాలు వంటివి కూడా సరిహద్దులతో సహా రికార్డవుతాయి. తద్వారా ఆయా ప్రభుత్వ పథకాల అమలుకు మార్గం సుగమం కానుంది.

త్వరలో కంటోన్మెంట్ ఎన్నికలు!

ఓటరు జాబితా సవరణ చేపట్టిన బోర్డు అధికారులు



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల నిర్వహణ మరోసారి చర్చనీయాంశంగా మారింది. కంటోన్మెంట్ ఓటర్ జాబితా సవరణకు అధికారులు మరోసారి అవకాశం కల్పించడంతో ఈ వాదనకు బలం చేకూరుతోంది. కంటోన్మెంట్‌లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుని, ఆ దిశగా ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇదిలా ఉండగానే.. గతేడాది ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. దాదాపు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందనే దశలో కేంద్రం ఎన్నికల నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంది. పూర్తిస్థాయి బోర్డు స్థానంలో వేరీడ్ బోర్డుల పదవీ కాలాన్ని పొడిగిస్తూ పాలన సాగిస్తోంది. ఈ నేపథ్యంలో తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని లేదా విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే మూడున్నరేళ్లుగా ప్రజాప్రతినిధులు లేకపోవడం, మరికొంత కాలం ఇదే పరిస్థితి కొనసాగించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించడమే మేలు అని రక్షణ శాఖ ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఓటరు జాబితా సవరణ చేపట్టి, జూలై ఒకటో తేదీ వరకు నూతన జాబితాను ప్రకటించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్‌తో సంబంధం లేకుండా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల కోసం ప్రత్యేక ఓటరు జాబితాను వినియోగిస్తారు. ఈ ఏడాది మార్చి1 నాటికి 18 ఏళ్లు నిండి, ఆరునెలలకు పైగా కంటోన్మెంట్‌లో నివాసముంటున్న వయోజనులంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 12 వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

జీహెచ్‌ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఆమ్రపాలి

రోనాల్డ్‌రాస్ విదేశీ పర్యటనతో..



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ వ్యక్తిగత పర్యటన నిమిత్తం యూరప్ వెళ్లేందుకు సెలవు పొందడంతో ఆయన స్థానంలో పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో హెచ్‌ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ ఆమ్రపాలిని నియమించారు. ఈ నెల 8,9 తేదీలు, తిరిగి 23వ తేదీ సెలవు దినాలను వినియోగించుకునేందుకు అనుమతితో పాటు 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రోనాల్డ్ రాస్‌కు ప్రభుత్వం సెలవు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో 8వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఆమ్రపాలికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వు జారీ చేశారు.

తారామతి బారాదరి రిసార్ట్‌ను తనిఖీ చేసిన మంత్రి జూపల్లి

నిర్వహణ బాగాలేదని అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం

గోల్కొండ: గోల్కొండ సమీపంలోని తారామతి బారాదరిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న హరిత రిసార్ట్‌ను ఆయన పరిశీలించారు. అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రిసార్ట్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉందని, దీని నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారని, దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరుతో పాటు ఆదాయం కూడా గణనీయంగా తగ్గిపోయిందని ఆయన అన్నారు. అధికారులు సరైన నిర్ణయాలు తీసుకోకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొని ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన రిసార్ట్‌లోని కిచెన్, గదులు, ఓపెన్ ఏరియా ఆడిటోరియంతో పాటు ఇండోర్ అంఫీ థియేటర్‌ను కూడా పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు నుంచి వివిధ కారణాల వల్ల రిసార్ట్‌ను తాను పరిశీలించలేదని, అయితే ప్రత్యేకంగా ఈ రోజు తాను ఇక్కడికి వచ్చానని ఆయన అన్నారు. ప్రైవేటుకు దీటుగా హరిత రిసార్ట్‌ను అభివృద్ధి చేస్తామని, స్థానిక ప్రజలకు సైతం అందుబాటులో ఉండే విధంగా మరిన్ని సౌకర్యాలు కల్పించి అందుబాటులో ఉంచుతామని ఆయన అన్నారు. అత్యంత ఖరీదైన ఈ రిసార్ట్‌ను అన్ని ఆదాయ వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సరైన ప్రణాళిక రూపొందిస్తామని ఆయన అన్నారు. ప్రపంచ పర్యాటకులకు ఆకర్షించే విధంగా తారామతి బారాదరిని, హరిత రిసార్ట్‌ను మరిన్ని హంగులతో సిద్ధం చేస్తామన్నారు. భవిష్యత్తులో ఇక్కడ గోల్కొండ ఫెస్టివల్‌ను భారీ ఎత్తున నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ నాయుడు, జనరల్ మేనేజర్(ప్రాజెక్ట్స్) ఉపేందర్‌రెడ్డి తదితరులున్నారు.


రిసార్ట్ నిర్వహణపై అధికారులను ప్రశ్నిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నెక్సస్ మాల్‌లో లెగో ప్లేగ్రౌండ్..

- చిన్నారులకు విజ్ఞానం, వినోదం అందిస్తున్న లెగో..
- జూన్ 7 నుంచి 16వ తేదీ వరకు నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా నెక్సస్ హైదరాబాద్ మాల్ వేదికగా ఏర్పాటు చేసిన లెగో ప్లేగ్రౌండ్ విశేషంగా ఆకట్టుకుంటుంది. పిల్లలలో ఉత్సుకతను పెంపొందించేలా వినూత్నంగా ఏర్పాటు చేసిన ఈ ప్లేగ్రౌండ్‌లో వ్యోమగామి, సూపర్ హీరో, సైంటిస్ట్, హ్యారీ పోటర్ వంటి విభిన్న సెట్టింగులు ఏర్పాటు చేశారు. జూన్ 7 నుంచి 16 వరకు కొనసాగే ఈ సెట్‌లో అంతరిక్ష అవగాహనను పెంచే స్పేస్ సిటీ చిన్నారులకు విజ్ఞానాన్ని అందిస్తుంది. వీటితో పాటు 5 నుంచి 14 ఏళ్ల పిల్లలకు సరదా పోటీలు, క్విజ్‌లతో వినోదాన్ని అందించే ఆటలు ఏర్పాటు చేశారు. ఇక్కడ రెడ్ టెలిఫోన్ బాక్స్, నిన్జాగో సిటీ గార్డెన్, డిస్నీ కాజిల్, గ్రింగోట్స్ విజార్డింగ్ బ్యాంక్, ఎవెంజర్స్ టవర్, ఈఫిల్ టవర్, టైటానిక్ తదితర లెగో సెట్‌లను హ్యామ్లీ స్టోర్‌లలో పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు.



ఆస్తిపన్ను చెల్లింపులు ఇక డిజిటల్‌గానే..

సాక్షి,సిటీబ్యూరో: ఇటీవలే డిజిటల్ చెల్లింపులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చిన జీహెచ్ఎంసీ నగదు చెల్లింపులను నిలిపివేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు బిల్ కలెక్టర్ల ద్వారా, సిటిజెన్ సర్వీస్ సెంటర్ల ద్వారా మీసేవా కేంద్రాల ద్వారా నగదును కూడా స్వీకరిస్తున్నారు. ఈనెల పదో తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా కానీ, బిల్ కలెక్టర్ల వద్ద ఉండే డిజిటల్ చెల్లింపుల మెషిన్ల ద్వారా కానీ, చెక్‌ల ద్వారా కానీ మాత్రమే ఆస్తిపన్ను చెల్లింపులు స్వీకరించనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ హోమియో బోధనాస్పత్రిలో.. ఊడి పడిన స్లాబ్ పెచ్చులు

పీజీ వైద్య విద్యార్థిని, నర్సుకు గాయాలు

రామంతాపూర్: రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి బోధన ఆసుపత్రిలో స్లాబ్ పెచ్చులు ఊడి పైనపడటంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఆసుపత్రిలోని ఇన్‌పేషెంట్ వార్డు భవనంలో శుక్రవారం అకస్మాత్తుగా స్లాబ్ పెచ్చులు ఊడి అక్కడే విధులు నిర్వహిస్తున్న పీజీ విద్యార్థిని డాక్టర్ స్నేహిత, నర్సు సునీతలపై పడటంతో గాయాలపాలయ్యారు. డాక్టర్ స్నేహితకు తలపైన బలమైన గాయం అయింది. వెంటనే తోటి వైద్య విద్యార్థులు ఆమెను స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా ఆస్పత్రిలో శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేయించాలని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోలేదని, అందుకే తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని సిబ్బంది, వైద్య విద్యార్థులు ఆరోపించారు.


హోమియో ఆసుపత్రిలో స్లాబ్ పెచ్చులు ఊడి పడిన దృశ్యం

పరిశీలించిన ఆయుష్ కమిషనర్



రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిని శుక్రవారం సాయంత్రం ఆయుష్ కమిషనర్ ఎం.ప్రశాంతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పురుషుల వార్డులో పెచ్చులూడిన స్లాబ్‌ను పరిశీలించిన ఆమె..వర్షాల కారణంగా స్లాబ్ మెత్తబడి పెచ్చులూడినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రి భవనాన్ని స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ నిపుణులతో పరిశీలన జరిపించి వారిసలహాలు, సూచనల మేరకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి భవనం మరమ్మతుల కోసం రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినప్పటికీ తూతూమంత్రంగా పనులు చేపట్టడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తామని ఆమె వెల్లడించారు. అదే విధంగా పురుషుల వార్డులో ఉన్న రోగులను వేరే వార్డులోకి మార్చాలని, సంఘటనలో గాయపడిన వైద్య విద్యార్థినికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆమె తెలిపారు. కమిషనర్ వెంట హోమియో కళాశాల ప్రిన్సిపాల్, ఆయుష్ అదనపు డైరెక్టర్ లింగరాజు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీదేవి, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

సాక్షి, సిటీబ్యూరో: టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 76 కేంద్రాల్లో జరుగనుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఈ పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధిస్తూ కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు అమలులో ఉండే దీని ప్రకారం పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో నలుగురికి మించి గుమిగూడకూడదని ఆయన పేర్కొన్నారు. అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వ్యాపారి ఇంట్లో బంగారు నగల చోరీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-8లో నివాసం ఉంటున్న ప్రముఖ వ్యాపారి గోపాల్‌దాస్ అగర్వాల్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. నమ్మకంగా పనిచేస్తున్నట్లు నటించిన పని మనుషులే ఈ దొంగతనానికి పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తూ గోపాల్‌దాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నెల క్రితం గోపాల్‌దాస్ ఆభరణాలు చేయించేందుకు కొన్ని బంగారు బిస్కెట్లతో పాటు అప్పటికే రూపుదిద్దుకున్న నెక్లెస్, రింగులు, గాజులు అన్నింటినీ అల్మారాలో భద్రపరిచాడు. శుక్రవారం ఉదయం ఈ ఆభరణాల కోసం అల్మారా తెరిచి చూడగా అందులో ఉండాల్సిన 70 తులాల ఆభరణాలు కనిపించలేదు. ఇంట్లో నలుగురు పని మనుషులు ఉన్నారని, వారి కదలికలు అనుమానాస్పదంగా ఉన్నాయని, ఈ దొంగతనం వారే చేసి ఉంటారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లూస్ టీమ్, బంజారాహిల్స్ క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించారు. వేలిముద్రలను గుర్తించారు. ఈ వేలిముద్రలు ఇతర ఆనవాళ్లతో అనుమానితులను విచారిస్తున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

అంబర్‌పేట: ఇంటర్ ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం ..అంబర్‌పేట పటేల్‌నగర్‌లో నివసించే డి.ప్రకాశ్ బాబు కుమారుడు సాయి చంద్ర (18) ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయ్యాడు. అప్పటి నుంచి మానసికంగా కలత చెందాడు. శుక్రవారం ఉదయం తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లోనే ఉన్న కుటుంబ సభ్యులు సాయి చంద్ర గదిలో నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అతని గది తలుపు తట్టారు. తెరుచుకోకపోవడంతో బలవంతంగా తెరిచారు. అప్పటికే సాయి చంద్ర ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు నిర్ఘాంతపోయారు. అతన్ని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

76 మంది పోకిరీల అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: మహిళలను వేధిస్తున్న 76 మంది ఆకతాయిలను రాచకొండ షీ టీమ్ పోలీసులు పట్టుకున్నారు. వీరందరికీ వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. పట్టుబడిన వారిలో 56 మంది మేజర్లు, 20 మంది మైనర్లున్నారు. గత నెల 1 నుంచి 15 మధ్య షీ టీమ్స్‌కు 101 ఫిర్యాదులు అందాయని, విచారణ చేపట్టి పోకిరీలను పట్టుకున్నామని రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి.ఉషా విశ్వనాథ్ తెలిపారు. మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి మహిళా బోగీలో ప్రయాణిస్తున్న ఏడు మంది పురుషులను పట్టుకున్నామని, సంబంధిత స్టేషన్ అధికారులకు జరిమానా విధించామని చెప్పారు.

వరుణ్ సందేశ్‌కు అక్కినేని యువ ఎక్స్‌లెన్స్ అవార్డు

బంజారాహిల్స్: ప్రముఖ సాహితీ సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో శనివారం జూబ్లీహిల్స్ ఫిలింనగర్ ఛాంబర్‌లో అక్కినేని శత జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకృతి ఏర్పాటుచేసిన 'అక్కినేని యువ ఎక్సలెన్స్ అవార్డు'ను ప్రముఖ యువహీరో వరుణ్ సందేశ్‌కు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ నటుడు మురళీమోహన్ మాట్లాడుతూ చలనచిత్ర పరిశ్రమను మద్రాస్ నుంచి హైదరాబాద్ తీసుకురావడంలో కీలకపాత్ర వహించిన మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు అని కొనియాడారు. తెలంగాణ కాంగ్రెస్ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ..అక్కినేని తన నటనతో ఎందరికో ఆరాధ్యుడు అయ్యారన్నారు. ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ అక్కినేని ఒక యువ హీరోగా సినీ రంగ ప్రవేశం చేసిన రోజున వరుణ్ సందేశ్ లాంటి ఒక యువ హీరోకు అక్కినేని యువ పురస్కారం ఇవ్వడం ఎంతో ఔచిత్యంగా ఉందన్నారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, ప్రముఖ రచయిత్రి డాక్టర్ కేవీ కృష్ణకుమారి, జూబ్లీ హిల్స్ వాసవీ క్లబ్ స్థాపక అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు, సినీ దర్శకుడు రాజేష్ పాల్గొన్నారు.


యువహీరో వరుణ్ సందేశ్‌కు 'అక్కినేని యువ ఎక్స్‌లెన్స్ అవార్డు' అందజేస్తున్న మురళీమోహన్

రోబోటిక్ సర్జరీతో మూత్రాశయ రంధ్రానికి చికిత్స

లక్డీకాపూల్: మూత్రాశయానికి పడిన అతిపెద్ద రంధ్రాన్ని రోబోటిక్ టెక్నాలజీ సాయంతో మూసేసి..ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) వైద్యులు ఊరట కలిగించారు. వివరాల్లోకి వెళితే..అనంతపురం జిల్లాకు చెందిన మహిళ(56) 35 ఏళ్లుగా మూత్రాశయ సమస్యతో బాధపడుతోంది. మూత్రాశయానికి ఆరు సెంటీమీటర్ల రంధ్రం ఏర్పడిన కారణంగా ఆమెకు మూత్రం నిలిచేది కాదు. ఇటీవల ఆమె భర్తకు మూత్రపిండాల్లో రాళ్లు తీయించడానికి ఆస్పత్రికి వచ్చారు. అప్పుడు ఆస్పత్రిలో ఉన్న అత్యాధునిక సదుపాయాలను చూసి, తన సమస్య కూడా చెప్పి, దానికి ఏదైనా పరిష్కారం ఉందా అని ఆమె అడిగారు. అప్పుడు తగిన వైద్య పరీక్షలు చేసి అనంతర చికిత్స అందించారు. 35 ఏళ్లుగా అంత పెద్ద రంధ్రంతో బాధపడుతున్న రోగికి చికిత్స చేసేందుకు ఇలాంటి రోబోటిక్ శస్త్రచికిత్స ఒక్కటే మార్గమని యూరాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ మహ్మద్ గౌస్ తెలిపారు. డాక్టర్ సారికా పాండ్యాతో కలిసి ఈ శస్త్ర చికిత్స చేశామన్నారు.

నీట్ యూజీ-2024 టాప్‌లో ఆకాష్ విద్యార్థులు

ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ నుంచి 15 మంది అత్యుత్తమ ప్రదర్శన...



సాక్షి, సిటీబ్యూరో: నీట్ యూజీ-2024 పరీక్షలో నగరంలోని చెందిన ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్)కు చెందిన 15 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శనిచ్చారని సంస్థ అకడమిక్ చీఫ్ ధీరజ్ కుమార్ మిశ్రా తెలిపారు. ఈ విద్యార్థులలో అధికశాతం మంది 679, అంతకంటే ఎక్కువ స్కోర్ సాధించారని, ఈ విజయానికి విద్యార్థుల కృషి, అంకితభావంతో పాటు ఏఈఎస్ఎల్ అందించిన నాణ్యమైన కోచింగ్ కారణమని వారు పేర్కొన్నారు. ఈ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించిందని, ఇందులో భాగంగా 716 స్కోర్‌తో అనురన్ ఘోష్ ఆల్ ఇండియా ర్యాంక్‌లో 77వ స్థానాన్ని పొందారని అన్నారు. అంతేకాకుండా సాయి ప్రణవ్ లకినపల్లి ఆల్ ఇండియా ర్యాంక్ 306, రిజ్వాన్ షేక్ 549 ర్యాంక్, జయంత్ 755 ర్యాంకులను సాధించారని అన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్‌పై పాము

- లిబర్టీ వద్ద కలకలం
- గంటపాటు ట్రాఫిక్ జామ్

హిమాయత్‌నగర్: లిబర్టీ చౌరస్తాలో ఓ త్రాచు పాము కలకలం సృష్టించింది. శుక్రవారం సాయంత్రం లిబర్టీ చౌరస్తా సిగ్నల్ వద్ద ఉన్న వేప చెట్టుపై మొదట పాము ప్రత్యక్షమైంది. అక్కడి నుండి కేబుల్ వైర్ల సహాయంతో ట్రాఫిక్ సిగ్నల్‌పైకి చేరింది. నిత్యం ట్రాఫిక్ తో రద్దీగా ఉండే సిగ్నల్ వద్ద ఒక్కసారిగా పాము కనిపించడంతో వాహనదారులు ఖంగుతిన్నారు. ఆ పాము ఎక్కడ మీద పడుతుందో అని ఎక్కడికక్కడ తమ వాహనాలను నిలిపివేశారు. దీంతో సుమారు గంట పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. కొద్దిసేపటికి సిగ్నల్ పోల్ సహాయంతో కిందకు చేరిన పాము..పక్కనే ఖాళీగా ఉన్న బిల్డింగ్ సెల్లార్ లోకి వెళ్లింది. దీంతో వాహనదారులు, పోలీస్ సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. కాగా కొందరు ఈ దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించారు.


ట్రాఫిక్ సిగ్నల్‌పై త్రాచు పాము


గుమిగూడిన వాహనదారులు

వీసాలు ఇప్పిస్తామంటూ మోసాలు

హిమాయత్‌నగర్: విదేశాలకు వెళ్లేందుకు వీసాలు ఇప్పిస్తామంటూ పలువురు బాధితులను భార్యాభర్తలిద్దరు మోసం చేసిన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నారాయణగూడ ఎస్ఐ షఫీ తెలిపిన వివరాల ప్రకారం..శేరిలింగంపల్లికి చెందిన సి.హెచ్.సురేష్, అతని భార్య హరితలు వీసా కోసం చూస్తుండగా ఫేస్‌బుక్‌లో ఓ కెరీర్ సొల్యూషన్స్ సంస్థ ప్రకటన వచ్చింది. వారిని సంప్రదించగా హిమాయత్‌నగర్‌లోని కార్యాలయానికి రావాలని సూచించారు. అక్కడికి వెళ్లిన తరువాత సంస్థ ఎండీ ప్రశాంత్ శర్మ, ఆయన భార్య, సంస్థ చైర్మన్ శిల్పా దేశ్‌పాండేలు తాము వీసా ఇప్పిస్తామని, అందుకుగాను వివిధ చార్జీలు, ఇతర ఫీజులతో కలిపి రూ.7 లక్షలు అవుతుందని తెలిపారు. వారు కోరినట్లు రూ.7 లక్షలు చెల్లించారు. కానీ వారిచ్చిన గడువు ముగిసినా వీసా ఇంకా పెండింగ్‌లో ఉందని నమ్మించారు. పలుమార్లు సంప్రదించినా అదే సమాధానం రావడంతో వారు తమ డబ్బు తిరిగి ఇవ్వాలని కోరారు. స్పందించక పోవడంతో సురేష్ గత నెల 22న నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. భార్యాభర్తలు కెరీర్ సొల్యూషన్స్ సంస్థను నిర్వహిస్తూ పలువురికి వీసాలు ఇప్పిస్తామని నమ్మించి సుమారు రూ.78 లక్షలు వసూలు చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు ప్రశాంత్ శర్మను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని భార్య శిల్పా దేశ్‌పాండే పరారీలో ఉన్నట్లు ఎస్.ఐ షరీఫ్ తెలిపారు.

కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు పోరాడుతూనే ఉంటా



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దానం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: తెలంగాణకు కేంద్రం నుంచి రావలసిన నిధులు రాబట్టడానికి హైదరాబాద్ వేదికగా తాము పోరాడుతూనే ఉంటామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 115 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం ఆయన బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–11లోని లేక్వ్యూ బంజారాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని, తాము ఓడిపోయినా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ ఎన్నికల ద్వారా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలం బాగా పెరిగిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయకారి ఒప్పందం వల్లనే తాను ఓడిపోవాల్సి వచ్చిందని, బీఆర్ఎస్ మనుగడ పూర్తిగా ప్రశ్నార్థకం అయ్యిందన్నారు. తనకు కాంగ్రెస్ సంప్రదాయ ఓట్లతో పాటు రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని ఆశించిన అభిమానులు పెద్ద సంఖ్యలో ఓట్లు వేశారని, సీఎం రేవంత్ పాలన పట్ల మంచి ఆదరణ కనబరిచారని పేర్కొన్నారు. పార్టీని ఇంకా బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలు, నేతలు శక్తివంచన లేకుండా తాను గెలవడానికి అహర్నిశలు కృషి చేశారని, వారి ప్రోత్సాహంతోనే తాను ప్రతి ఎన్నికలోనూ ధైర్యంగా ముందుకెళ్తున్నానన్నారు. షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి, బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ భారతి, కాంగ్రెస్ నేతలు అరుణ్‌కుమార్, మహేందర్‌బాబు, మహేష్‌యాదవ్, రాములుచవాన్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల ముందు పేరుకుపోతున్న వ్యర్థాలు



బంజారాహిల్స్ రోడ్ నెం7 జహీరానగర్ జీహెచ్ఎంసీ పార్కు ముందు పేరుకుపోయిన వ్యర్థాలు



అపోలో ఆస్పత్రి ఎదుట జర్నలిస్టు కాలనీ పార్కు ముందు వ్యర్థాలు

బంజారాహిల్స్: ఒక వైపు పార్కులను అధికారులు సుందరంగా, పచ్చదనంతో తీర్చిదిద్దుతుంటే ఆ పరిసర ప్రాంతాల్లో మాత్రం సరైన పారిశుద్ధ్య నిర్వహణ లేక పార్కులకు వచ్చే తీవ్ర అసౌకర్యానికి గురుతున్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్‌లలోని పలు జీహెచ్ఎంసీ పార్కుల ముందు ఓపెన్ గార్బేజీల సమస్య వేధిస్తున్నది. ఈ పార్కుల వద్ద చెత్త వేస్తే ఎవరూ ఏమీ అనరులే అనే ధైర్యంతో కొంత మంది, అదే విధంగా స్థానిక పని చేసే స్వీపర్లు సేకరించిన చెత్తను పార్కుల వద్దే పోస్తుండటంతో స్థానికులు, పార్కులకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పార్కుల వద్ద పేరుకుపోతున్న చెత్తకుప్పలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గుంతలమయమైన ఎన్‌బీటీనగర్ రోడ్డు



ఎన్‌బీటీనగర్ పోచమ్మ దేవాలయం వద్ద గుంతలు తేలిన రోడ్డు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ కమాన్ నుంచి పోచమ్మ గుడి వరకు ఏడాది క్రితం సీసీ రోడ్డు వేశారు. పోచమ్మ గుడి నుంచి బస్తీ దవాఖానా వరకు వేయాల్సిన సీసీ రోడ్డు పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. జలమండలి డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టిందని, అందుకే తాము రోడ్డు పనులు పూర్తి చేయలేకపోతున్నామని జీహెచ్ఎంసీ ఇంజినీర్లు ఏడాదిగా నెట్టుకొస్తున్నారు. జలమండలి అధికారులు ఇక్కడ ఏ పైపులు వేశారో తెలియదు గానీ, ఇంకా డ్రైనేజీ, వరద రోడ్డును ముంచెత్తుతూ గుంతలమయమైంది. వర్షం వచ్చినప్పుడు వరదతో పాటు మామూలు రోజుల్లో మురుగు రోడ్లపై పారుతూ గుంతల్లో నిండిపోతూ స్థానికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నది. పోచమ్మ గుడి నుంచి గవర్నమెంట్ స్కూల్ వరకు సీసీ రోడ్డు పనులు పూర్తి చేసి ఉంటే ఈ గుంతల సమస్య పూర్తిగా సమసిపోయి ఉండేదని స్థానికులు మొత్తుకుంటున్నారు. బస్తీ ప్రధాన రోడ్డు నుంచి అంతర్గత రహదారులకు వెళ్లే ప్రాంతాల్లో రోడ్డు ఎగుడుదిగుడుగా ఉండి డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు, పైపుల నుంచి మురుగు లీకవుతూ స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అటు అసంపూర్తి డ్రైనేజీ పనులు, ఇటు అర్ధంతరంగా ఆగిపోయిన సీసీ రోడ్డు పనుల కారణంగా ఎన్‌బీటీనగర్ వాసులు నరకాన్ని చవిచూస్తున్నారు. గత ఎనిమిది నెలలుగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో తాము పనులు చేయలేకపోతున్నామని జీహెచ్ఎంసీ ఇంజనీర్లు సాకులు చెబుతూ వచ్చారు. వీరిపై నియంత్రణ కరువవడంతో రోడ్లన్నీ గుంతలు తేలి గలీజుగా మారిపోయాయి. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎన్‌బీటీనగర్ బస్తీలో పోచమ్మగుడి నుంచి ముందుకు వెళ్లాలంటే స్థానికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి ఇక్కడి రోడ్డు పనులపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాంగ్రెస్ పాలనలో ఉద్యమకారులకు గుర్తింపు



ఉద్యమకారులను సత్కరిస్తున్న కోదండరాం

ప్రొఫెసర్ కోదండరాం

రహమత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తెలంగాణ ఉద్యమ కారులను సముచిత గౌరవం లభిస్తున్నదని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్న టీఎస్ మాల మహానాడు నాయకులు శుక్రవారం కోదండరాంను ఆయన కార్యాయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యమ కారులకు గత ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఉద్యమ కారులకు తగిన గుర్తింపు అందించాలని తాను సీఎం రేవంత్‌రెడ్డికి కలిసి కోరనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అనంతరం మాల మహానాడు నాయకులకు కోదండరాం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జి.నాగరాజు. మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు మధుసూదన్, జై భీమ్ యాదగిరి, తలారి తిరుపతి, చింత మహేష్, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి చేయాలి

ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అంబటి కృష్ణమూర్తి

హిమాయత్‌నగర్: సంఘటిత, అసంఘటిత కార్మికులు సమస్యలతో సతమతం అవుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి యువ ఐఎన్టీయూసీ నేతలు కృషి చేయాలని ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అంబటి కృష్ణమూర్తి కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో జరిగిన కార్యక్రమంలో ఐఎన్టీయూసీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేగల సతీష్ బాబును అంబటి కృష్ణమూర్తి నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఆయను అందజేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ... కార్మికులకు సరసమైన జీవన వేతనంతో స్థిరమైన ఆర్థికవృద్ధి, వృత్తిపరమైన ఆరోగ్య భద్రత, సురక్షితమైన ఉపాధి,సామాజిక రక్షణ వంటి సమస్యలపై ఐఎన్టీయూసీ ఎన్నో విజయవంతమైన పోరాటాలు చేసి కార్మికుల హక్కుల రక్షణకు పాటుపడుతుందని తెలిపారు. ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి బి.నాగరాజు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గూడా ఐలయ్య గౌడ్, నేతలు జేమ్స్, గురు ప్రసాద్ రావు, వికాస్ సింగ్, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న సతీష్‌బాబు



శ్రమదానంతో పరిశుభ్రంగా బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్

ప్రతి శనివారం.. ఠాణాల్లో శ్రమదానం!

- వెస్ట్‌జోన్ పరిధిలో అమలవుతున్న ప్రణాళిక
- హోంగార్డు నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి వరకు చేతులకు పనిచెబుతున్న అధికారులు
- పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు
- పరిశుభ్రంగా తయారవుతున్న పోలీస్ స్టేషన్లు



ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో దుమ్ము దులుపుతున్న పోలీసు సిబ్బంది

బంజారాహిల్స్: పోలీస్ స్టేషన్లలో దుమ్ము, చెత్తాచెదారం, మూటగట్టిన ఫైళ్లు, బూజుపట్టిన గోడలు కనిపించకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి శనివారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాసబ్‌ట్యాంక్, ఫిలింనగర్, మధురానగర్, బోరబండ, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి శనివారం ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు తారతమ్యాలు మరిచిపోయి కర్రలను చేతిలోకి తీసుకుని గోడలకు బూజులు దులుపుతూ ఫ్యాన్లపై దుమ్ము దులిపేస్తున్నారు.

- ప్రతి శనివారం ఠంఛన్‌గా ఈ ప్రణాళికను విజయవంతంగా అమలుచేస్తున్నారు. ప్రతి ఠాణాలోనూ శనివారం శ్రమదానం నిర్వహించాలని నిబంధనలు ఉన్నా గతంలో ఎవరూ పట్టించుకోలేదు.
- ఇటీవలికాలంలో నగర పోలీసు కమిషనర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు దీనిపై దృష్టిపెట్టి ప్రతి పోలీసునూ బాధ్యులను చేస్తూ శ్రమదానం అమలయ్యే దిశలో కృషి చేస్తున్నారు. దీంతో శనివారం ఉదయం స్టేషన్‌లోకి వచ్చే పోలీసులు ముందుగా తమ టేబుళ్లను శుభ్రం చేసుకుంటూ కంప్యూటర్ సిస్టంలపై ఏర్పడ్డ దుమ్మును దులిపేస్తున్నారు.
- ఫైళ్లు పేరుకుపోకుండా చక్కగా మూటగట్టి ప్రణాళికాబద్ధంగా పెట్టుకుంటున్నారు. అంతే కాకుండా హోంగార్డులు, కానిస్టేబుళ్లు ఫ్యాన్లపై దుమ్ము కూడా దులుపుతున్నారు. ప్రాంగణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు. మొక్కలకు నీళ్లు పెడుతూ పాడైపోయిన మొక్కలను తొలగిస్తూ కొత్త మొక్కలను నాటుతూ పచ్చదనంపై దృష్టిపెట్టారు.
- దాదాపు వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సిబ్బంది శ్రమదానంలో పాల్గొంటున్నారు. అంతేకాకుండా ఠాణాల ప్రాంగణాల్లో పేరుకుపోతున్న చెత్తా చెదారం, వ్యర్థాలను కూడా తొలగించడమే కాకుండా ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటుతూ లాన్ కూడా తీర్చిదిద్దుతున్నారు.
- ఎండాకాలంలో ప్రతి ఠాణాలోనూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు, బాధితులకు చల్లటి మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. మరోవైపు పోలీస్‌స్టేషన్ల ముందు, ప్రాంగణాల్లో సీజ్ చేసిన వాహనాలు పెద్ద ఎత్తున కుప్పగా ఉండటంతో గత రెండు నెలల నుంచి వాటిని సంబంధీకులకు అప్పగించే ప్రక్రియను నిబంధనల మేరకు పూర్తి చేశారు.
- దీంతో వాహనదారులకు తమ వాహనాలు అందడమే కాకుండా పోలీస్ స్టేషన్లు పూర్తిగా వాహనాల డంపింగ్ నుంచి విముక్తి కలిగాయి.

చింతల అనసూయమ్మకు దత్తాత్రేయ నివాళి



బంజారాహిల్స్: ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాతృమూర్తి చింతల అనసూయమ్మ(98) ఇటీవల కన్నుమూశారు. ఆమె శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని శుక్రవారం జలవిహార్‌లో నిర్వహించారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు అనసూయమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి చింతల రామచంద్రారెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాదిగలకు ఏఏజీ పోస్టును కేటాయించాలి

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా హైకోర్టులోని అడిషనల్ అడ్వకేట్ జనరల్ పోస్టును మాదిగలకు కేటాయించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్ రాజు మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశం అనంతరం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మాదిగలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. రెండు రోజుల క్రితం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి మాదిగలకు ఉన్నత పదవుల హామీలపై చర్చించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల ఉన్నత పదవుల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎమ్ఎస్ఎఫ్ అధ్యక్షులు బి.ఉపేందర్, యువసేన సిటీ అధ్యక్షుడు జయరామరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ తేజ, రాష్ట్ర కన్వీనర్ రంజిత్, సునీల్, సుమంత్ కుమార్ లింగాల పాల్గొన్నారు.

తమ్ముడు అదృశ్యంపై అన్న ఫిర్యాదు



సుబ్రమణ్యం

వెంగళరావునగర్: ఇంటి నుంచి వెళ్లిన తమ్ముడు తిరిగి రాలేదని ఓ వ్యక్తి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం... డి.వెంకటేశ్వరరావు అతని చిన్న సోదరుడు సుబ్రమణ్యంలు మధురానగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 6వ తేదీ టిఫిన్ తిని వస్తానని చెప్పి ఇంటి నుంచి సుబ్రమణ్యం బయటకు వెళ్లాడు. అయితే రాత్రి వరకు తిరిగి రాలేదు. అతని కోసం ఎన్ని ప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం కనిపించకపోవడంతో వెంకటేశ్వరరావు శుక్రవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాకాల ప్రమాదాలపై జీహెచ్ఎంసీ అప్రమత్తం

హిమాయత్‌నగర్: హైదరాబాద్ మహానగరంలో వర్షాకాలంలో జరిగే ప్రమాదాలపై జీహెచ్ఎంసీ అప్రమత్తమయింది. నగరంలో తరుచూ వస్తున్న భారీ వర్షాలు, వరదలు నీటి ముంపు వలన ప్రాణాపాయ పరిస్థితులు, ఆస్తినష్టం జరుగుతున్నందున ముందు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి, ప్రమాదం జరిగినప్పుడు ఏమి చేయాలి అనే విషయాలపై ఒక రోజు ట్రైనింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం జూన్ 10 తేదీన జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఫత్తుల్లగూడ, నాగోల్ ట్రైనింగ్ సెంటర్ వర్షాకాలపు ప్రమాదాల గురించి అవగాహన, సమాచారం, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ విభాగం వారు ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ ట్రైనింగ్ లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తారు. సోమవారం తరువాత కూడా ఆసక్తి ఉన్న వారు సంప్రదిస్తే ఈ ట్రైనింగ్ ఏర్పాటు చేస్తారు. ఆర్‌డబ్ల్యుఎంలలో అపార్ట్‌మెంట్‌లలో పని చేసే సిబ్బంది, బస్తీల్లో నివసించే ప్రజలు, ఎన్‌జీవో సభ్యులు, ట్రేడ్ యూనియన్ సభ్యులు, ఇతరులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవటం అవసరమన్నారు. వివరాలకు ఎస్ఎఫ్ఓ శ్యాంసుందర్ రెడ్డిని ఫోన్: 79817 75687లో సంప్రదించాలని తెలియజేశారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్లు కేటాయించాలి

కాచిగూడ: మున్నూరుకాపు కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్ల నిధులను మంజూరు చేయాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొండ దేవయ్య నేతృత్వంలో శుక్రవారం మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి అభినందించారు. మున్నూరుకాపులకు ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పదవుల్లో తగిన ప్రోత్సాహం కల్పించాలని కోరారు.

కట్టుకున్నోడే మోసం చేశాడని మహిళ ఫిర్యాదు

వెంగళరావునగర్: అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్న భర్తే తనను మోసం చేసి ఆపై బెదిరింపులకు గురి చేస్తున్నాడంటూ ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు... తూర్పు గోదావరి ప్రాంతానికి చెందిన బి.అప్పారెడ్డి, కె.కనక మహాలక్ష్మిలు ప్రేమించుకుని గత ఏడాది పెళ్లి చేసుకుని మధురానగర్‌లో నివాసం ఉంటున్నారు. పెళ్లయిన నాటి నుంచి అప్పారెడ్డి తనకు రూ. 30 లక్షల వరకు అప్పులు ఉన్నాయని భార్యతో చెబుతూ వచ్చాడు. ఇటీవల అప్పుల వారు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఎంతోకొంత తనకు డబ్బులు ఇవ్వమని భార్యను కోరగా ఆమె బంధువుల వద్ద అప్పు చేసి, నగలు తాకట్టు పెట్టి, క్రెడిట్ కార్డులు ఉపయోగించి దాదాపు రూ. 15 లక్షలు వరకు తెచ్చి ఇచ్చింది. వాటిని తీసుకున్న అనంతరం తనకు చైనాలో మంచి ఉద్యోగం వచ్చిందని, అక్కడ ఉద్యోగం చేస్తే ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని నమ్మించి ఈ ఏడాది మార్చిలో చైనా వెళ్లాడు. రెండు రోజుల తర్వాత మృదుల అనే మహిళ కనక మహాలక్ష్మికి ఫోన్ చేసి అప్పారెడ్డి తన భర్త అని తమకు ఐదేళ్ల బాబు ఉన్నాడని చెప్పింది. దాంతో ఆమె అప్పారెడ్డికి ఫోన్ చేయగా మృదుల అబద్ధం చెబుతుందని, ఆమె నెంబర్ బ్లాక్ చేయాలని చెప్పాడు. ఏప్రిల్ నెలలో సీత అనే మహిళ కనకమహాలక్ష్మికి ఫోన్ చేసి అప్పారెడ్డి మంచివాడు కాదని, అతని వల్ల ప్రమాదం ఉందని, వెంటనే అతనిని వదిలి పెట్టాలని బెదిరించింది. దాంతో అప్పారెడ్డి, మృదుల, సీతలు కలిసి తనను మోసం చేస్తున్నారని గ్రహించి శుక్రవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐసీసీ మైనార్టీ చైర్మన్‌తో బుర్హానుద్దీన్ భేటీ



బంజారాహిల్స్: పార్లమెంటు ఎన్నికల్లో కర్ణాటక రాష్ట్రం మైనార్టీ కాంగ్రెస్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి బాధ్యతలతో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఫిలింనగర్‌కు చెందిన సీనియర్ మైనార్టీ కాంగ్రెస్ నేత సయ్యద్ బుర్హానుద్దీన్ ఢిల్లీలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన ఏఐసీసీ మైనార్టీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్ గర్హితో సమావేశం అయ్యారు. తాను ప్రచారం నిర్వహించిన పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ ఫలితాలు, ఓట్ల సరళిపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మైనార్టీ కాంగ్రెస్ నేతకు దేశంలోనే మొట్టమొదటిసారిగా కర్ణాటకలో ప్రచార బాధ్యతలు అప్పగించినందుకు ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని బాధ్యతలతో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ముమ్మరంగా 'బడిబాట'



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సమకూరుస్తున్న సౌకర్యాలను వివరిస్తూ ఉచిత పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలపై ప్రచారం కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో నమోదును పెంచడమే లక్ష్యంగా కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం శుక్రవారం కూడా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల వచ్చిన పదో తరగతి పరీక్షా ఫలితాలను వివరిస్తూ ఉచిత మధ్యాహ్నం భోజనం, పుస్తకాలు, ఏకరూప దుస్తులపై తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తున్నారు. ఖైరతాబాద్ విద్యాశాఖ జోన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిధిలోని ఉపాధ్యాయులు రెండో రోజు బడిబాట నిర్వహించారు.

ఘనంగా కార్పొరేటర్ బాబా పుట్టిన రోజు



కేక్ కట్ చేస్తున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రతి బస్తీలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ సంబరాలు జరుపుకొన్నారు. పలు ప్రాంతాల్లో యువకులు రక్తదానం చేశారు. తన నివాసం వద్ద జరిగిన వేడుకల్లో బాబా ఫసియుద్దీన్ భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఆయన సతీమణి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా సైట్–3లో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్‌గౌడ్, ఇమ్రాన్, సరళ, కృష్ణ వేణి, రంగనాయక్ తదితరులతో పాటు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, నాయకులు నవీన్ యాదవ్, భవానీశంకర్, ఉపేందర్‌రెడ్డి తదితరులు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రక్ బోల్తా: తప్పిన ప్రమాదం



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఎస్ఎస్‌బీనగర్ ప్రధాన రహదారిపై శుక్రవారం ఉదయం థమ్సప్ బాటిళ్లతో వెళ్తున్న ట్రక్ పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో థమ్సప్ బాటిళ్లు రోడ్డు పాలు కాగా వాహనం దెబ్బతింది. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డు పక్కన అరుగుల ఏర్పాటు చేసుకుని దారిని ఇరుకుగా మార్చుతున్నారని బస్తీవాసులు కార్పొరేటర్ తెలపడం స్పందించిన ఆయన వెంటనే అరుగులను తొలగించాలని జీహెచ్ఎంసీ సర్కిల్–19 టౌన్ ప్లానింగ్ ఏపీసీ కోరారు.

ట్రేడింగ్ పేరుతో వ్యాపారికి రూ.15 లక్షల టోకరా

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యాపారిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల సమాచారం మేరకు... నగరానికి చెందిన ఓ వ్యాపారవేత్త వాట్సాప్ నంబర్‌కు బ్లాక్‌స్టోన్, ఎయిట్ రాడ్స్ గ్రూప్ నుంచి మెసేజ్ వచ్చింది. బాధితుడిని ఓ వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేసి ట్రేడింగ్ సూచనలు ఇస్తామని, మంచి లాభాలు వచ్చే స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టాలని గ్రూప్ల సందేశాలు పంపిస్తూ నమ్మించారు. గ్రూప్‌లో లింక్ పంపించి సైబర్ నేరగాళ్లు సృష్టించిన నకిలీ ట్రేడింగ్ అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేయమని బలవంతం చేశారు. అనంతనం వారు యాప్‌లో స్టాక్ మార్కెట్ బిజినెస్ కోసం అతని ఖాతాలో రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టాలని బాధితుడిపై ఒత్తిడి తెచ్చారు. వారు చెప్పిన విధంగా ట్రేడింగ్ చేస్తే 5 నుంచి 25 శాతం వరకు లాభాలు వస్తాయని నమ్మించారు. అనంతరం వారు ఐపీవోలలో పెట్టుబడులు పెట్టించారు. లోన్ తీసుకొని మరింత పెట్టుబడులు పెడితేనే ఐపీవో షేర్లు కేటాయిస్తామని, రుణం తీసుకొని పెట్టుబడులు పెట్టాలని, లేదంటే ట్రేడింగ్ అకౌంట్‌ను రద్దు చేయాలని, బాధితుడి నిధులను స్తంభింపజేస్తామని బెదిరించారు. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు.

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతంకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గుజ్జ కృష్ణ నేతృత్వంలో బీసీ సంఘం ప్రతినిధులు నంద గోపాల్, వేముల రామకృష్ణలతో తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బీసీల డిమాండ్లపై చర్చించారు. అనంతరం అనకు బీసీల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న శశాంక్ గోయెల్

ప్రభుత్వ పాలనలో ఏఎస్ఓలది కీలకపాత్ర

డీజీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయల్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాలనలో నిర్ణయాలు తీసుకోవడంతోపాటు దానికి సంబంధించిన నోట్‌ను సిద్ధం చేయడంలో అసిస్టెంట్ సెక్షన్ అధికారుల (ఏఎస్ఓ)ల పాత్ర చాలా కీలకమని డీజీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయల్ పేర్కొన్నారు. ఫైల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా నోట్, డ్రాఫ్టింగ్‌లను తయారు చేయడం, కార్యాలయ విధివిధానాల రూపకల్పన, ఈ–ఆఫీస్, టీమ్‌లను తయారు చేయడం వంటి అంశాల్లో అసిస్టెంట్ సెక్షన్ అధికారులకు హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ 9 వారాల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఇక్కడ శిక్షణ పొంది కోర్సును విజయవంతంగా ముగించిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను శశాంక్ గోయెల్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ ఏఎస్ఓ మోనికా తివారీ, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఏఎస్ఓ అమన్ గోస్వామి, కోర్సు డైరెక్టర్, సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ కందుకూరి ఉషారాణి, అడిషనల్ కోర్సు డైరెక్టర్ జి.ఝాన్సీ రాణి, జూనియర్ ఫ్యాకల్టీ చంద్రజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్.. 'రెడ్డి' వర్గానికే ముఖ్యమంత్రా?: మోత్కుపల్లి



పంజగుట్ట (హైదరాబాద్): రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని మొట్టమొదట చెప్పింది తానేనని, కానీ ఆయన సీఎం అయ్యాక మొదట బజారున పడేసింది తనను, తన జాతినేనని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో, ఆయన సొంత నియోజకవర్గం మల్కాజ్‌గిరిలో పార్టీని గెలిపించుకోలేక పోయరని, ఆయన ఏ రకంగా ముఖ్యమంత్రి పదవికి అర్హుడని ప్రశ్నించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగలు ఉంటే ఎంపీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో ఒక్క సీటు కూడా మాదిగలకు ఇవ్వలేదని, జనాభాలో సగానికి ఎక్కువగా ఉన్న బీసీలకు రెండు ఓడిపోయే స్థానాలు ఇచ్చారని మండిపడ్డారు.

హ్యాకింగ్.. 'పోలీస్' షేకింగ్!

హ్యాకింగ్‌కు గురైన తెలంగాణ పోలీస్ టీఎస్ కాప్ యాప్ • కీలక సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి?

- ఇంతకుముందే హ్యాక్ అయిన హాక్ ఐ మొబైల్ యాప్
- అందులోని సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు అమ్మకానికి పెట్టినట్టు చర్చ
- వరుస సైబర్ దాడులతో అప్రమత్తమైన పోలీస్ శాఖ



సాక్షి, హైదరాబాద్: వారం రోజుల వ్యవధిలో తెలంగాణ పోలీసు శాఖకు చెందిన రెండు కీలక యాప్‌లు హ్యాకింగ్‌కు గురవడం కలకలం సృష్టిస్తోంది. సైబర్ నేరగాళ్లు తెలంగాణ పోలీస్‌కు చెందిన హాక్ ఐ యాప్‌తోపాటు పోలీస్ అంతర్గత విధుల్లో అత్యంత కీలకమైన టీఎస్‌కాప్ యాప్‌ను సైతం హ్యాక్ చేశారు. వీటి నుంచి హ్యాకర్లు పోలీస్ శాఖకు సంబంధించిన కీలక డేటాను, ఫొటోలను చేజిక్కించుకుని.. డార్క్ వెబ్‌లో అమ్మకానికి పెట్టినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సైబర్ నేరగాళ్లకు సంబంధించిన కేసులను పరిష్కరించే పోలీసులు తమ సొంత యాప్‌లు హ్యాక్ గురైన విషయాన్ని గుర్తించడంలో మాత్రం ఆలస్యం జరిగింది. హాక్ ఐ యాప్ హ్యాకింగ్ గురైన తర్వాత వారం రోజులకు టీఎస్‌కాప్ యాప్ హ్యాక్ అయిందని.. రెండింటి హ్యాకింగ్ ఒకే హ్యాకర్ కారణమై ఉంటారని అనుమానిస్తున్నారు. హాక్ ఐ యాప్ హ్యాకింగ్‌కు గురవడంపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఇప్పటికే ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పోలీస్‌శాఖకు సంబంధించిన కీలక యాప్‌ల హ్యాకింగ్ నిజమేనని.. రెండింటిని హ్యాక్ చేసింది ఒకరేనా, వేర్వేరు వ్యక్తులా అన్నది తేల్చాల్సి ఉందని టీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

కీలక వ్యవహారాలన్నీ అందులోనే..

తెలంగాణ పోలీసుల రోజువారీ విధుల్లో టీఎస్‌కాప్ యాప్‌ది ప్రధాన భూమిక. 2018లో ప్రారంభించిన ఈ యాప్‌లో పాత నేరస్తుల సమాచారం, క్షేత్రస్థాయిలో నిందితులను గుర్తించేందుకు అవసరమైన ఫేషియల్ రికగ్నిషన్ యాప్, సీసీటీఎన్ఎస్ (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ అండ్ సిస్టమ్స్), రవాణాశాఖ సమాచారం వంటి మొత్తం 54 సర్వీసులు పోలీసులకు క్షేత్రస్థాయి విధుల కోసం అందుబాటులో ఉంటాయి. లక్షలాది మంది నేరస్తుల ఫొటోలు, వేలిముద్రలు, ఇతర వివరాలు, గత కొన్నేళ్లలో నమోదైన నేరాల వివరాలు, రోడ్డు ప్రమాదాలు, ఆయా కేసులలో నిందితులు, బాధితుల ఫోన్ నంబర్లు, దర్యాప్తులో అవసరం మేరకు ఆధార్‌కార్డు, ఇతర ధ్రువపత్రాల వివరాలు, వాహనాల నంబర్లు, సీసీ టీవీ కెమెరాల జియో ట్యాగింగ్ వివరాలు, క్రైం సీన్ ఫొటోలు, వీడియోలు, సాక్షుల స్టేట్‌మెంట్ రికార్డులు, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వివరాలు ఇలా చాలా సమాచారాన్ని టీఎస్‌కాప్ యాప్ వేదికగా నిర్వహిస్తున్నారు. ఇంత కీలమైన యాప్ హ్యాక అవడంపై పోలీస్‌శాఖలోనూ ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఆన్‌లైన్‌లో డేటా అమ్మకం?

టీఎస్‌కాప్ యాప్‌లోని యూజర్ డేటాను సైబర్ నేరగాళ్ల ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై డేటా భద్రత పరిశోధకుడు శ్రీనివాస్ కోడాలి.. తన డిజిటల్‌దత్తా పేరిట ఉన్న ట్విట్టర్ అకౌంట్‌లో 'టీఎస్‌కాప్ సహా మొత్తం తెలంగాణ కాప్‌ల నెట్‌వర్క్‌ను ఎవరో హ్యాక్ చేశారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన కంపెనీ.. యాప్‌లో పాస్‌వర్డ్‌లను ప్లెయిన్ టెక్స్ట్‌గా పొందుపర్చడం, యాప్ సీసీటీఎన్ఎస్‌కు కనెక్ట్ అయి ఉండటం వంటివి సులభంగా హ్యాక్ అవడానికి కారణాలై ఉండొచ్చు''అని పేర్కొన్నారు. హ్యాకర్ కొనుగోలుదారులను ప్రలోభపెట్టడానికి ఆన్‌లైన్ ఫోరమ్‌లలో నమూనా డేటాను పోస్ట్ చేశాడని., నేరస్తుల రికార్డులు, తుపాకీ లైసెన్సులు, ఇతర డేటాను కూడా పొందుపర్చాడని తెలిపారు. హ్యాకింగ్ క్రైం ఫోరం అయిన బ్రీచ్ ఫోరమ్స్‌లో పేర్కొన్న ప్రకారం.. టీఎస్‌కాప్, హాక్ ఐ నుంచి లీకైన డేటాలో 2 లక్షల మంది యూజర్ల పేర్లు, ఈ–మెయిల్ ఐడీలు, ఫోన్ నంబర్లు, అడ్రస్‌లు 1,30,000 రికార్డులు, 20 వేల ప్రయాణ వివరాల రికార్డులను డార్క్ వెబ్‌లో అమ్మకానికి పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది.

కీలక విభాగాలు, పోలీస్ అధికారుల వివరాలు కూడా..?

హాక్ ఐ, టీఎస్‌కాప్ యాప్‌లు హ్యాకింగ్‌కు గురవడంతో.. సైబర్ నేరగాళ్ల చేతికి ఏసీబీ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్, సీసీఆర్‌బీ, సీసీఎస్, సీఐడీ, కంట్రోల్ రూమ్‌లు, సీపీ ఆఫీస్‌లు, డీసీఆర్‌బీలు, గ్రేహౌండ్స్, జీఆర్పీ, ఇంటెలిజెన్స్, ఐటీ కమ్యూనికేషన్స్, లా అండ్ ఆర్డర్, ఎస్పీ ఆఫీసులు, ఎస్ఓటీ, స్పెషల్ బ్రాంచ్‌లు, స్పెషల్ యూనిట్లు, టాస్క్‌ఫోర్స్, ట్రాఫిక్, టీజీఎస్పీ ఇలా చాలా విభాగాల సమాచారం చిక్కి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. డేటా భద్రత పరిశోధకుడు శ్రీనివాస్ కోడాలి కూడా.. ''అధికారుల పేర్లు, పోలీసు స్టేషన్ అనుబంధాలు, హోదాలు, ఫొటోలతో సహా సమాచారం డార్క్‌వెబ్‌లో అమ్మకానికి పెట్టారు, వందల మంది పోలీసు అధికారుల వివరాలు అందులో ఉన్నాయి''అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అత్యుత్తమ టెక్నాలజీ ఉన్న టీఎస్‌కాప్ యాప్‌కు గతంలో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నుంచి 'సాధికార పోలీసు విత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' విభాగంలో అవార్డు దక్కింది. అలాంటి టీఎస్‌కాప్ యాప్ హ్యాక్ అవడంపై విమర్శలు వస్తున్నాయి. కొందరు సులువుగా ఉండే పాస్‌వర్డ్‌లు పెట్టుకోవడంతో హ్యాకింగ్ సులువైనట్టు ప్రచారం జరుగుతోంది. ఈ డేటా బ్రీచ్‌పై ఇప్పటికే తెలంగాణ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం

శాఖలవారీగా కౌంటర్లు.. దరఖాస్తుల స్వీకరణ

లక్డీకాపూల్ (హైదరాబాద్): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ పునఃప్రారంభమైంది. కోడ్ అడ్డంకి తొలగిపోవడంతో మూడు నెలల సుదీర్ఘ విరామం తర్వాత ప్రజావాణికి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. తమ సమస్యలను అధికారులకు వివరించి పరిష్కారం కోరారు. ఈ క్రమంలో అర్జీదారులతో మమేకమైన ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నోడల్‌అధికారి, రాష్ట్ర మున్సిపల్ సంచాలకులు దివ్య దరఖాస్తుదారుల సమస్యలను సానుకూలంగా విన్నారు. అర్జీదారుల సమస్యలపై చిన్నారెడ్డి స్పందించి ఎండార్స్ చేయడమే కాకుండా అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసిన సమస్యను వివరించి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శాఖల వారీగా దరఖాస్తులు పరిశీలిస్తే...రెవెన్యూకు 120 అర్జీలు అందగా, విద్యాశాఖకు 43, మున్సిపల్ శాఖ సమస్యలపై 43 , హోంశాఖవి 29, పౌరసరఫరాల శాఖకు 18, ఇతర శాఖలకు సంబంధించి 120 దరఖాస్తులు అందాయి.

ట్రాఫిక్ జామ్ లేకుండా ప్రణాళిక

అధికారులకు సీఎస్ ఆదేశం.. 'గ్రేటర్' ఇబ్బందులపై సమీక్ష



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ జామ్‌ల నివారణకు వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ప్రధానంగా భారీ వర్షాలు కురిసినప్పుడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతం చేయాలని సూచించారు. గ్రేటర్ పరిధిలో భారీ వర్షాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడటం, రోడ్లపై నీటి నిల్వలు ఏర్పడకుండా చేయడంపై డీజీపీ రవిగుప్తా, ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో శుక్రవారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రేటర్ పరిధిలో ట్రాఫిక్ జామ్‌ల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలను అధికారులకు, పౌర సమాజాల వాట్సాప్ గ్రూపులకు పంపి అప్రమత్తం చేయాలన్నారు.

వాటర్ లాగింగ్‌పై సూచనలకు కమిటీ

హైదరాబాద్‌లో 134 ప్రదేశాలను తీవ్ర సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినట్లు సీఎస్ తెలిపారు. ఈ ప్రాంతాలలో నీరు నిలిచిపోకుండా (వాటర్ లాగింగ్) చేపట్టాల్సిన చర్యలను సూచించాలని కోరారు. జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీస్, ఎస్‌పీడీసీఎల్ తదితర శాఖల అధికారులతో ఒక కమిటీగా ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ వాటర్ లాగింగ్ పాయింట్లను తనిఖీ చేసి తగిన సూచనలు చేయాలని ఆదేశించారు.

శ్రీశ్రీ కుమారుడు వెంకటరమణ మృతి



నగరంపాలెం: మహాకవి శ్రీశ్రీ కుమారుడు శ్రీరంగం వెంకటరమణ (59) అనారోగ్యంతో అమెరికాలో మృతి చెందినట్లు ఆయన బావమరిది గుంటూరులోని డాక్టర్ రమణ యశస్వి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీరంగం వెంకటరమణ భార్య మాధవి గణపవరం గ్రామస్తురాలు. డాక్టర్ రమణ యశస్వికి చిన్న చెల్లెలు. 25 ఏళ్ల కిందట వారు అమెరికా వెళ్లి ఫైజర్ కంపెనీ పరిశోధన విభాగంలో ఉద్యోగంలో చేరారని ఆయన తెలిపారు. వారికి కుమారుడు శ్రీనివాసరావు, కుమార్తె కవిత ఉన్నారు. వెంకటరమణ మరణంతో సాహితీ లోకం దిగ్భ్రాంతికి గురైందని రమణ యశస్వి పేర్కొన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచంద్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లు

నాన్‌టీచింగ్ వర్కర్లకు వేతనాన్ని పెంచాలి

- పాఠశాల విద్యాశాఖ ముందు వర్కర్ల ధర్నా

ఖైరతాబాద్ (హైదరాబాద్): నాన్ టీచింగ్ వర్కర్ల వేతనాలను కనీసం రూ. 27 వేలకు పెంచాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. పదేళ్లుగా బీఆర్ఎస్ పాలనలో కేజీబీవీ నాన్ టీచింగ్ మహిళా కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాన్ని రూ.27 వేలుగా నిర్ణయించి, పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ కేజీబీవీ, యూఆర్ఎస్ నాన్‌టీచింగ్ వర్కర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు, కేజీబీవీ నాన్ టీచింగ్ మహిళా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం ఉన్నాయని, పనిభారంతో వారు నలిగిపోతున్నారన్నారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నాలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ, కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఫీయా తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

- లోక్‌సభ ఎన్నికల ఫలితాల విశ్లేషణ, పార్టీ కార్యక్రమాలపై కేసీఆర్ దృష్టి
- కేడర్‌లో ఆత్మస్థైర్యం పెంచేలా కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక
- వరంగల్ లేదా హైదరాబాద్‌లో రెండురోజులు ఆవిర్భావ వేడుకలు
- వచ్చే వారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ఫలితాల వెల్లడి నేపథ్యంలో భారత్ రాష్ట్ర సమితి తదుపరి కార్యాచరణపై దృష్టి సారించింది. ఓపక్క ఎన్నికల ఫలితాలను విశ్లేషించుకుంటూనే మరోవైపు పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కసరత్తు చేస్తోంది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఇప్పటికే పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై దిశా నిర్దేశం చేయడంతో పాటు పార్టీ కేడర్‌లో ఆత్మస్థైర్యం పెంచేలా వరుస కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా త్వరలో రెండురోజుల పాటు పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరపాలని నిర్ణయించారు. హైదరాబాద్ లేనిపక్షంలో వరంగల్‌లో ఉత్సవాలు నిర్వహించాలని కేసీఆర్ భావిస్తున్నారు. అయితే వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో నిర్వహణ తేదీలపై పార్టీ నేతలతో కేసీఆర్ చర్చిస్తున్నట్లు తెలిసింది.

విస్తృత భేటీలో పలు అంశాలపై స్పష్టత!

పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు రాష్ట్ర కార్యవర్గం, ఇతర ముఖ్య నేతలతో వచ్చే వారం విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలనే ఆలోచనలో కేసీఆర్ ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, సంస్థాగత శిక్షణ, గ్రామ స్థాయి నుంచి పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై ఈ భేటీలో స్పష్టత ఇవ్వాలని భావిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. పార్టీ జిల్లా, రాష్ట్ర స్థాయి కార్యవర్గాలను పునర్వ్యవస్థీకరించాలని కేసీఆర్ యోచిస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన షెడ్యూలును విస్తృత స్థాయి సమావేశంలో ప్రకటించే అవకాశముంది.

లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ

లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన ఫలితాలను ఇప్పటికే విశ్లేషిస్తున్న బీఆర్ఎస్.. నియోజకవర్గాలు, బూత్‌ల వారీగా పరిశీలించాలని నిర్ణయించింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో భారీగా ఓటింగ్ శాతాన్ని కోల్పోవడాన్ని మరింత లోతుగా విశ్లేషించాలని నిర్ణయించింది.

అహం దెబ్బతిని..

- వీడిన కడ్తాల్ జంట హత్యల మిస్టరీ
- ఏడుగురి అరెస్ట్... వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ



వివరాలు వెల్లడిస్తున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: జంట హత్యల కేసు మిస్టరీ వీడింది. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఆ వివరాలను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వెల్లడించారు. కడ్తాల్ మండలం గోవిందాయపల్లికి చెందిన గుండమోని శివ (28) మియాపూర్‌లో చికెన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన శేషగిరి శివ (28) నగరంలోని గాయత్రీనగర్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి జలకం రవికి వీరితో స్నేహం ఉంది. ముగ్గురూ బీజేవైఎంలో చురుగ్గా పనిచేశారు. శివ, శేషగిరి శివకు కొంతకాలం క్రితం రవితో మనస్పర్థలు రాగా, వారు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో రవికి వీరికి దూరం పెరిగింది. దీనికితోడు ఈ నెల 4న కడ్తాల్‌లోని బట్టర్‌ఫ్లై వెంచర్‌లో రవి తన పుట్టినరోజు వేడుకలు చేసుకున్నాడు. ఆ 300 ఫొటోలు గోవిందాయిపల్లికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. దీనికి ఇద్దరు శివలు అభ్యంతరం చెబుతూ ఫొటోలు డిలీట్ చేసి, రవిని వాట్సాప్ గ్రూప్‌లో నుంచి తొలగించారు. దీంతో తనను అవమానించి, ప్రతిష్టకు భంగం కలిగించిన వారిని అంతం చేయాలని రవి నిర్ణయించుకున్నాడు. తన స్నేహితులైన పల్లె నాగరాజుగౌడ్, తలకొండ రాజు, జీలుకుంట్ల విజయ్, తిరుపతి జగదీశ్‌గౌడ్, నిట్ల ప్రవీణ్, వల్లేపు దాసు శేఖర్‌తో కలిసి హత్యకు ప్లాన్ చేశాడు. వారిద్దరు ఈ నెల 5న ఓ వైన్స్ దుకాణంలో మద్యం తాగుతున్నారని తెలుసుకున్న రవి.. తన ఇన్నోవాలో ఆరుగురు స్నేహితులతో కలిసి అక్కడకు వెళ్లాడు. బలవంతంగా వారిని కారులో ఎక్కించుకొని బట్టర్‌ఫ్లై వెంచర్‌లో తాను అద్దెకుంటున్న గది వద్దకు తీసుకొచ్చి హతమార్చారు. ఆ తర్వాత గదికి తాళం వేసి అక్కడి నుంచి పరారయ్యారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో మీర్‌పేట్ వద్ద ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.

కొత్త సీఎస్‌గా నీరబ్‌కుమార్ ప్రసాద్ బాధ్యతలు

ప్రస్తుత సీఎస్ జవహర్‌రెడ్డిని బదిలీ చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ప్రస్తుత సీఎస్ డా.కేఎస్ జవహర్‌రెడ్డిని బదిలీ చేస్తూ నీరబ్‌కుమార్‌ప్రసాద్‌ను సీఎస్‌గా నియమిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలిచ్చింది. రాష్ట్ర సచివాలయంలో సీఎస్ చాంబర్ టీటీడీ వేద పండితులు, విజయవాడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానాల వేద పండితుల దివ్య ఆశీస్సుల మధ్య నీరబ్ కుమార్ ప్రసాద్ సీఎస్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ సహచర కార్యదర్శులు, శాఖాధిపతులు, ఇతర అధికారులు, సిబ్బంది సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా పనిచేసి వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో సమర్థంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందంజలో నిలిపేందుకు సాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీఏడీ కార్యదర్శి సురేశ్ కుమార్, స్పెషల్ సీఎస్‌లు గోపాల కృష్ణ ద్వివేది, రజత్ భార్గవ, విజయానంద్, పీసీసీఎఫ్ వై.మధుసూదన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శులు కె.సునీత, ప్రవీణ్ ప్రకాశ్, ప్రద్యుమ్న, ఐటీ కార్యదర్శి కె.శశిధర్, సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్ తదితరులున్నారు.

ఓటమిపై విశ్లేషించుకుంటాం

ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిపై లోతైన విశ్లేషణ చేసుకుంటామని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..జగన్ పాలనలో ఐదేళ్లపాటు దేశంలో ఎక్కడా లేని విధంగా అద్భుతమైన సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. లోపం ఎక్కడ జరిగిందో సమీక్షించుకుంటామని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులేమిటో తెలుసుకుంటామని తెలిపారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేస్తున్నట్లు చెప్పారని, ఈవీఎంలలో ఏమైనా లోపాలున్నాయేమోనని అనుమానం వ్యక్తం చేశారు. జగన్‌ను ఏపీ ప్రజలు వద్దనుకోలేదని, ఆయన అహంకారంతో ఓడిపోయారనేది అవాస్తవమని చెప్పారు.

చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు

- టీడీపీ యథేచ్ఛ దాడులతో ఆటవిక పరిస్థితులు
- అధికార యంత్రాంగం మొత్తం నిర్వీర్యం అయిపోయింది
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉన్మాదంతో దాడులు
- పోటీ చేసిన అభ్యర్థులకు రక్షణే లేకుండా పోయింది
- గవర్నర్ జోక్యం చేసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్
- బాధితులకు వైఎస్సార్‌సీపీ తోడుగా నిలుస్తుందని భరోసా

రాష్ట్రంలో కుప్పకూలిన రాజ్యాంగ వ్యవస్థలు



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలిపోయాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు వచ్చిందని మండిపడ్డారు. టీడీపీ యథేచ్ఛ దాడులతో ఆటవిక పరిస్థితులు తలెత్తాయని, యంత్రాంగం మొత్తం నిర్వీర్యం అయిపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉన్మాదంతో దాడులు చేస్తున్నారని, పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులకు రక్షణే లేకుండా పోయిందని చెప్పారు. ఉన్నత చదువులకు కేంద్రాలైన యూనివర్సిటీల్లో ఆచార్యులపై దౌర్జన్యాలకు దిగి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లలో పాలనా సంస్కరణలు, పేదలను ఆదుకునే కార్యక్రమాలతో దేశంలో రాష్ట్రానికి వచ్చిన పేరు ప్రఖ్యాతులన్నింటినీ దెబ్బతీసి, కేవలం మూడు రోజుల్లోనే హింసాయుత రాష్ట్రంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి, పౌర స్వేచ్ఛకు తీవ్ర భంగం వాటిల్లుతోందని, గవర్నర్ జోక్యం చేసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. హింసాయుత ఘటనల్లో బాధితులైన పార్టీ కార్యకర్తలకు, తన అన్నదమ్ములకు, అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్‌సీపీ తోడుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు.

కేబినెట్ పదవి.. 2 సహాయ శాఖలు!

- టీడీపీకి అంతకంటే ఇచ్చేందుకు సానుకూలంగా లేని బీజేపీ
- మరోసారి పౌర విమానయానమే తీసుకోవాలని సూచన
- కీలక శాఖలు, స్పీకర్ పదవికి నో.. డిప్యూటీ స్పీకరైతే సరే
- జేపీ నడ్డాతో చంద్రబాబు మంతనాలు

సాక్షి, న్యూఢిల్లీ: కొత్తగా కొలువుదీరనున్న ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జేడీయూలు అడుగుతున్నన్ని కేబినెట్ బెర్త్‌లు, కీలక శాఖలు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 16 లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న టీడీపీ కోరుతున్నట్లుగా ఐదు కేబినెట్ పదవులతో పాటు స్పీకర్ పదవి ఇవ్వడం సాధ్యం కాదనే విషయాన్ని బీజేపీ పెద్దలు చంద్రబాబుకు తేల్చి చెప్పినట్లు సమాచారం. టీడీపీకి ఒక కేబినెట్ మంత్రిత్వ శాఖతో పాటు రెండు సహాయక మంత్రి పదవులను ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు ఢిల్లీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శాఖల కేటాయింపుపై చంద్రబాబు శుక్రవారం రెండో దఫా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు ఇతర పెద్దలతో చర్చించినా సానుకూల ఫలితం దక్కలేదని తెలుస్తోంది.

కీలక శాఖలు ఇవ్వలేం..!

కేంద్రంలో ముచ్చటగా మూడోసారి కొలువుదీరనున్న మోదీ ప్రభుత్వంలో కీలకమైన హోం, ఆర్థిక, రక్షణ, రైల్వే, న్యాయ, ఐటీ, రోడ్లు, రహదారుల శాఖలను భాగస్వామ్య పక్షాలకు ఇవ్వకూడదని ఇప్పటికే బీజేపీ పెద్దలు నిరాకరించారు. దీంతో కేంద్ర జలశక్తి శాఖతో పాటు పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, ఐటీ కమ్యూనికేషన్లు, నౌకాయాన శాఖలను టీడీపీ కోరినట్లు తెలిసింది. దీనికి అదనంగా స్పీకర్ పదవి కూడా తమకే ఇవ్వాలని అడిగినట్లు జాతీయ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే బీజేపీ పెద్దలు ఇందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. 2014లో మాదిరిగానే పౌర విమానయాన శాఖతో పాటు సహాయ శాఖల్లో కీలక శాఖలు ఇచ్చేందుకు ఓకే చెప్పినట్లు సమాచారం. ఆ కీలక సహాయ శాఖలు ఆర్థిక లేదా జల శక్తి శాఖ కావచ్చనే ఊహాగానాలు సాగుతున్నాయి. స్పీకర్ పదవి కాకుండా డిప్యూటీ స్పీకర్ పదవిని ఇచ్చేందుకు బీజేపీ పెద్దలు సానుకూలంగా ఉన్నట్లు చెబుతున్నారు. 2019లో ఎన్‌డీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు డిప్యూటీ స్పీకర్ పదవిని అసలు కేటాయించలేదు. కేవలం స్పీకర్‌తోనే లోక్‌సభ వ్యవహారాలను నిర్వహించగా ప్రొటెం స్పీకర్‌లతో సభను నడిపించారు. 2014లో మాత్రం అన్నాడీఎంకేకు చెందిన తంబిదొరై, జార్ఖండ్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత కరియా ముండా డిప్యూటీ స్పీకర్లుగా వ్యవహరించారు.

మోదీతోపాటే ప్రమాణం..!

మంత్రి పదవులు, శాఖలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చంద్రబాబు విడిగా చర్చించారు. ప్రాధాన్యతలను ఆయన దృష్టికి తెచ్చారు. నరేంద్ర మోదీతో పాటు ప్రమాణ స్వీకారం చేసే మంత్రుల్లో తమ పార్టీ వారు కచ్చితంగా ఉండేలా చూడాలని కోరినట్లు తెలిసింది.

ప్రజాస్వామ్యమా? ఆటవిక రాజ్యమా?

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న టీడీపీ దాడులు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వారి ఆస్తులే లక్ష్యంగా విధ్వంసం



టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సొసైటీ అధ్యక్షుడు పిచ్చిరెడ్డి

- పోలీసుల సమక్షంలోనే బెదిరింపులు, దాడులు, ఆస్తుల ధ్వంసం
- నిస్తేజంగా పోలీసు యంత్రాంగం ; పరోక్షంగా రెచ్చగొడుతున్న చంద్రబాబు
- వైసీపీ కవ్వింపులపై టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలంటూ ట్వీట్
- తాను ప్రమాణ స్వీకారం చేసేదాకా ఇవి కొనసాగించాలని పరోక్ష సంకేతాలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పూర్వం యుద్ధం ముగిశాక విజయం సాధించిన రాజులు ఓడిపోయిన రాజు రాజ్యంపై పడి విధ్వంసం సృష్టించేవారు. జనావాసాలపై దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవారు. అందినకాడికి దోచుకునేవారు. ప్రజలంతా ఒకచోటుకు చేరి.. మోకరిల్లి శరణుకోరాక కానీ శాంతించే వారు కాదు. ఇప్పుడు రాష్ట్రంలో పరిస్థితి చూస్తుంటే అలాంటి దుస్థితే కనిపిస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణం నుంచి టీడీపీ శ్రేణులు యథేచ్ఛగా విధ్వంసకాండ కొనసాగిస్తున్నాయి. ఎక్కడికక్కడ దాడులకు తెగబడి భయోత్పాతం సృష్టిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ అయినా విజయం సాధించాక తొలుత దృష్టి సారించాల్సింది శాంతి భద్రతల పరిరక్షణపైనే. అందుకు విరుద్ధంగా రాష్ట్రంలో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యం కొనసాగిస్తుండగా... తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మాత్రం వారిని నిలువరించే ప్రయత్నం చేయకుండా... తిరిగి వైసీపీ కవ్వింపుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వైసీపీ కవ్వించినా సంయమనం పాటించాలంటూ ట్వీట్ చేయటం విధ్వంసాలకు మరింత ఊతమిచ్చేదిగా కనిపిస్తోంది. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది... వచ్చామన్న కిక్కుతో ఊరూరా కవ్వింపులకు, దాడులకు తెగబడుతున్నది తెలుగుదేశమే. మూడు రోజులుగా వరుస దాడులు చేస్తున్నా పోలీసులకు పైనుంచి ఆదేశాలుండటంతో ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు తప్ప నిలువరించే ప్రయత్నం చేయటం లేదు. తాను ప్రమాణ స్వీకారం చేసే వరకు ఏమైనా చేయండని, రెచ్చిపోండని చంద్రబాబు పరోక్షంగా సంకేతాలిచ్చారని, అందుకే పోలీసులు పట్టనట్లు ఊరుకుంటున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ఎందుకంటే తాను ప్రమాణ స్వీకారం చేయకముందయితే తన హయాంలో జరగలేదని చెప్పొచ్చనేది బాబు యోచనగా చెబుతున్నారు.

గన్నవరం వద్ద చంద్రబాబు ప్రమాణస్వీకారం

- 12 ఉదయం 11.37 గంటలకు ముహూర్తం
- ప్రధాని మోదీ, పలువురు సీఎంలు వచ్చే అవకాశం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఈ నెల 12న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకు ఆ రోజు ఉదయం 11.37 గంటలకు ముహూర్తం ఖరారు చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ప్రమాణస్వీకార సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీతోపాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయేలోని కీలక నేతలు హాజరవుతారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న ప్రాంతాన్ని ఎంపిక చేశారు.

వర్మపై జనసేన కార్యకర్తల దాడి



జనసేన కార్యకర్తల దాడితో పగిలిన వర్మ కారు అద్దాలు

పిఠాపురం: పిఠాపురం టీడీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మపై జనసేన కార్యకర్తలు దాడికి దిగారు. ఈ ఘటనలో వర్మతో సహా పలువురికి గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో స్థానిక సర్పంచ్‌తో మంతనాలు జరిపేందుకు వర్మ వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఆ గ్రామ జనసేన నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు వచ్చి వర్మను అడ్డుకున్నారు. 'మాకు తెలియకుండా మా గ్రామంలో ఇతర పార్టీల వాళ్లను ఎందుకు కలుస్తున్నారు' అంటూ వర్మను నిలదీశారు. మీకు చెప్పాల్సిన పని లేదంటూ వర్మ వారికి బదులివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన జనసేన నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా ఆయనపై దాడికి దిగారు. రాళ్లు, కొబ్బరి కాయలతో వర్మ కారుపై దాడి చేయడంతో ఆయన కారు అద్దాలు పగిలిపోయాయి. వారి నుంచి తప్పించుకుని ఆయన కారులో వేగంగా వెళ్లిపోయారు. ఎన్నికల్లో పని చేసిన వారికి కృతజ్ఞతలు తెలపడానికి వెళితే జనసేన శ్రేణులు తనపై దాడి చేశాయని టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. అల్లరి మూకలను జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు. జనసేన నేతలు తనను చంపడానికి ప్రయత్నించారని ధ్వజమెత్తారు. 9 నెలలుగా ఉదయ్ తనను వేధిస్తున్నాడని.. జనసేనకు పనిచేయడం తన ఖర్మ అని వ్యాఖ్యానించారు. తనపై హత్యాయత్నం వెనుక ఉదయ్ హస్తం ఉందని ఆరోపించారు.


నగర వార్తలు

'మత్స్యకార సొసైటీ చైర్మన్ ఎన్నిక ఎందుకు నిర్వహించడం లేదు'

సాక్షి, హైదరాబాద్: మత్స్యకార సొసైటీ రాష్ట్ర చైర్మన్ ఎన్నికను ఎందుకు నిర్వహించడం లేదో చెప్పాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది. 'ఉమ్మడి 10 జిల్లాల వారీగా ఉన్న సొసైటీలను 33 జిల్లాల వారీగా మత్స్యకారుల సహకార సొసైటీలను ఏర్పాటు చేశారు. ఈ సొసైటీలు రాష్ట్ర చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. దీనికి ఎన్నికలు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేస్తూ వస్తోంది. ఇది సరికాదు. వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలి'అని కోరుతూ 8 జిల్లాల సొసైటీల అధ్యక్షులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మత్స్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ, వ్యవసాయ, సహకార శాఖల ముఖ్య కార్యదర్శులు, మత్స్య శాఖ కమిషనర్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జనరల్ మేనేజర్‌కు నోటీసులు జారీ చేశారు.

సాక్షి రియల్టీ

అనుమతి ఒకలా.. నిర్మాణం మరోలా!



''ఇది బంజారాహిల్స్ నంబరు–7లో నిర్మితమవుతున్న జీ+5 అంతస్తుల భవనం. నిబంధనల ప్రకారం 20 ఫీట్ల రోడ్డు ఉన్న ఈ ప్రాంతంలో 2–3 ఫ్లోర్లకు మించి నిర్మాణ అనుమతులు రావు. కానీ, సదరు నిర్మాణ సంస్థ అధికారులను మచ్చిక చేసుకొని ఏకంగా ఐదంతస్తుల భవనాన్ని నిర్మిస్తుంది. అనుమతులను తుంగలో తొక్కి అక్రమంగా భవన నిర్మాణాన్ని చేపడుతుంది.''

- రోడ్డు వెడల్పుతో సంబంధం లేకుండా హైరైజ్ భవనాలు
- నగరంలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ
- అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి

సాక్షి, హైదరాబాద్: ఇదొక్కటే కాదు ఇలా అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా చేపడుతున్న అక్రమ భవన నిర్మాణాలు నగరంలో కోకొల్లలు. ఆయా అక్రమ భవన నిర్మాణాల గురించి జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెరా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం కొసమెరుపు.

నగరం నలువైపులా..

గ్రేటర్ పరిధిలో సుమారు లక్షకు పైగా అక్రమ ఫ్లాట్లు, వేలాది స్థలాలు ఉంటాయని అంచనా. బంజారాహిల్స్, నిజాంపేట, బాచుపల్లి, కూకట్‌పల్లి, కొంపల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, శంషాబాద్ వంటి నగరం నలువైపులా రెండంతస్తులకు అనుమతులు తీసుకొని అక్రమంగా ఐదారు ఫ్లోర్లు కడుతున్నారు. రిజిస్ట్రేషన్ అధికారులకు ఎంతోకొంత ముట్టజెప్పి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. అనుమతులు లేకుండా, సెట్‌బ్యాక్‌లు వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు లిఖిత పూర్వంగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. మొక్కుబడితంతుగా నోటీసులు జారీ చేసి వదిలేస్తున్నారు.

దారికొస్తే దబ్బులు లేకపోతే ఒత్తిళ్లు..

నివాస, వ్యాపార సముదాయం ఏదైనా సరే నిర్మించాలంటే మున్సిపల్ శాఖ అనుమతులు తప్పనిసరి. అయితే చాలా మంది యజమానులు నివాస భవనానికి అనుమతులు తీసుకొని, ఎంచక్కా వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నారు. అధికారుల తనిఖీలు బయటపడితే ఎంతోకొంత ముట్టజెప్పి చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో అనుమతులు రుసుములు, ఆస్తి పన్ను రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన రూ.కోట్లలో ఆదాయానికి గండిపడుతుంది. నిబంధనలు కాదని భవనాలు నిర్మించే యజమానుల వద్దకు సంబంధిత అధికారులొస్తే వారికి ఎంతోకొంత ముట్టజెబుతున్నారు. మాట వినకుంటే నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. దీంతో కొందరు అధికారులు చేసేదేమీ లేక మిన్నుకుండిపోతున్నారు.

రిజిస్ట్రేషన్లు చేయొద్దు..

అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టే నిర్మాణ సంస్థలు, భూ యజమానులతో పాటు ఆయా ఫ్లాట్లను రిజిస్ట్రేషన్ చేసే అధికారులను సైతం చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటేనే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందని రియల్టీ నిపుణులు సూచిస్తున్నారు. అక్రమ లే–అవుట్లు, అనుమతుల్లేని అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్లను రిజిస్ట్రేషన్ చేయొద్దని గతంలో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఆదేశించింది. అయితే కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో.. డాక్యుమెంట్‌పై అనుమతి లేని నిర్మాణమని పేర్కొని, వారందరికీ రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్లను అందజేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

జీఓ నెం.10 రద్దు చేయాలి



వెంగళరావునగర్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు తీరని నష్టాన్ని కలిగించే జీవో 10 ను తక్షణమే రద్దు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక మహిళా శిశుసంక్షేమశాఖ కార్యాలయం (స్టేట్‌హోం) వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వం 2023 సెప్టెంబరులో జీవో.10 విడుదల చేసిందన్నారు. ఈ జీఓ ప్రకారం 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50 వేలు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లిస్తామని తెలియజేసిందని, రాష్ట్రవ్యాప్తంగా వారి వివరాలను సేకరించాలని ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. అంగన్‌వాడీలకు నష్టం కలిగించే ఇలాంటి ఉత్తర్వులను నూతన ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనే తాము పలు మార్లు ఆందోళనలు చేపట్టగా టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష, 60 ఏళ్లు నిండిన వారికి వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. తక్షణమే నూతన ఉత్తర్వులను అమలు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు సునీత, పి.మంగ, పెద్ద సంఖ్యలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మహిళా శిశుసంక్షేమశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

బాలాజీ ఆలయ మూసివేత వార్తలు అవాస్తవం

- చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చే భక్తులు గూగుల్‌ను నమ్మరాదని అర్చకుడు రంగరాజన్ అన్నారు. శనివారం, ఆదివారం చిలుకూరు బాలాజీ దేవాలయం క్లోజ్ (మూసివేత) అంటూ గూగుల్‌లో వచ్చిన వార్తలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చిలుకూరు దేవాలయం శనివారం, ఆదివారం మూసివేస్తారని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భక్తులెవరూ గూగుల్ ప్రచారాన్ని నమ్మొద్దన్నారు.

ఘనంగా ఎస్ఎన్‌వీపీఎంవీ రజతోత్సవాలు



అతిథులను సన్మానిస్తున్న సదస్సు నిర్వాహకులు

ముగిసిన ఇండోయూఎస్ సమిట్–2024

ఉస్మానియా యూనివర్సిటీ: నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సరోజినీ నాయుడు వనిత ఫార్మసీ మహా విద్యాలయ (ఎస్ఎన్‌వీపీఎంవీ) రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఓయూ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో మూడు రోజులు నిర్వహించిన ఇండో–యూఎస్ సమిట్–2024 ఇన్నోవేషన్ ఇన్ ఫార్మా ఎడ్యుకేషన్, ఆర్ అండ్ డీ, రెగ్యులేటరీ, మార్కెటింగ్ అండ్ ఫార్మసీ ప్రాక్టిస్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ ప్రొ.ఎస్‌కే మహ్మమూద్ హాజరయ్యారు. అనంతరం అమెరికాలోని సుధాకర్ పాల్ ఫార్మా సంస్థతో ఎస్‌వీపీఎంవీ ఎంఓయూ కుదుర్చుకున్నాయి. సదస్సులో అమెరికాకు చెందిన ప్రముఖ వర్సిటీలతో పాటు దేశంలోని 46 ఫార్మసీ కాలేజీలకు చెందిన 1174 విద్యార్థులు, ప్రతినిధులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 11 మంది స్పీకర్లు, 10 మంది చైర్మన్లు, 11 మంది కో–చైర్మన్లు పాల్గొని, 28 పరిశోధన పత్రాలను (ఒరల్స్), 231 పోస్టర్లను సమర్పించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ చైర్మన్ డా.ఏయూ శ్రీకాంత్, జేసీ సంధ్య దీపాల, డా.మన్సూర్ ఎ ఖాన్, డా.రాజేందర్, ప్రిన్సిపాల్ ప్రొ.మమత, డైరెక్టర్ ప్రొ.శ్రీనివాస్, కార్యదర్శి వి.సాయినాథ్ దయాకర్‌శాస్త్రీ, కోశాధికారి జయరాజ్, జీబీ మెంబర్ వి.ప్రద్యుమ్న తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీ ఎదుట విద్యార్థుల ఆందోళన

మేడ్చల్‌రూరల్:గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో శుక్రవారం మరోమారు విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. యూనివర్సిటీ హాస్టల్‌లో తమకు నాణ్యమైన ఆహారం ఇవ్వడం లేదని, హాస్టల్ గదిలో కనీస వసతులు లేవంటూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులతో కలిసి యూనివర్సిటీ బాలుర హాస్టల్ ముందు ధర్నా నిర్వహించారు. నాణ్యమైన ఆహారం అందించాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హాస్టల్ ఫీజు పేరుతో రూ. లక్ష వసూలు చేసే యాజమాన్యం తమకు నీటి వసతి, ఫ్యాన్లు, తదితర సౌకర్యాలు కల్పించడం లేదని, ఆహారం బాగా లేదని పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో యూనివర్సిటీ వైస్ చైర్మన్ చామకూర మహేందర్‌రెడ్డి విద్యార్థుల సమస్యలపై సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత చర్చిద్దామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. సాయంత్రం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో మరోసారి ఆందోళనకు దిగారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న విద్యార్థులు

మీడియా, వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఆంధ్రమహిళ సభ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్‌లో వివిధ వృత్తి కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. బీఏ కర్ణాటక సంగీతం(ఫుల్ టైం), ఎంఏ కర్ణాటక సంగీతం (పార్టుటైం), కర్ణాటక వోకల్, భక్తి సంగీతం, వీణ, వయోలిన్, కీబోర్డు, ఫ్లూట్, సౌందర్య లహరి, ఆర్‌జే, వాయిస్ ఓవర్, యాక్టింగ్, యాంకరింగ్, న్యూస్ రీడింగ్, రిపోర్టింగ్, ఎడిటింగ్, డబ్బింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, కార్టునిస్ట్, టిక్రర్ ఆర్ట్, రెసిన్ ఆర్ట్, లిప్పన్ ఆర్ట్, క్యాండిల్ మేకింగ్, తంజావూర్ పెయింటింగ్, డాల్స్ మేకింగ్, క్రోచెట్, స్టోరీ టెల్లింగ్ విత్ ఫ్ల కార్డ్స్, బ్యూటిషియన్, హెయిర్ స్టైల్స్, కౌన్సిలింగ్‌ఫర్ చిల్డ్రన్ అవేర్‌నెస్, తదితర కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని కాలేజీ చైర్‌పర్సన్ రమాప్రభ, ప్రిన్సిపాల్ కె.విజయ తెలిపారు. వివరాలకు 9441768811, 93939 49415 నంబర్లను సంప్రదించాలన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఉద్రిక్తత..



కుషాయిగూడ: స్థానికులైన తమకు కాకుండా ఇతరులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎలా కేటాయించారంటూ వడ్డెర బస్తీ వాసులు మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, చైతన్యనగర్‌లోని డబుల్‌బెడ్ రూం ఇళ్లకు తాళాలు వేయడమేగాక వారిని ప్రశ్నించిన లబ్ధిదారులపై దాడులకు పాల్పడ్డారు. దీంతో శుక్రవారం డబుల్ ఇళ్ల వద్ద ఉద్రిక్త వాతవరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. వడ్డెరబస్తీకి చెందిన శంకర్‌తో పాటుగా మరి కొందరు శుక్రవారం డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి అక్రమంగా ప్రవేశించి ఇళ్లకు తాళాలు వేశారు. ఇదేమిటని ప్రశ్నించిన గణేష్ అనే వ్యక్తిపై మూకుమ్మడిగా దాడికి పాల్పడటంతో అతడికి గాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకు వివరాలు తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన శంకర్‌తో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేశారు. అనంతరం లబ్ధిదారులు కుషాయిగూడ ఏసీపీ మహేష్, ఇన్స్పెక్టర్ రాజునాయక్‌లను కలిసి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం అధికారికంగా కేటాయించిన తమ ఇళ్లపైకి వచ్చి దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళనవ్యక్తం చేశారు.

శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడం కోసం ఎవరి పద్ధతులు వారికి ఉంటాయి. కొందరు రకరకాల ఎక్సర్‌సైజులు చేస్తే, పొట్టను మాడ్చుకుంటారు కొందరు. వాకింగ్, జాగింగ్ వంటి వాటితో ప్రారంభించి, చిన్న చిన్న బరువులు మోయడం... ఆ తర్వాత వాటన్నింటినీ అనుసరించలేక నీరస పడి పోతుంటారు ఇంకొందరు. అయితే అలా కాకుండా తేలిగ్గా చేయగలిగే సింపుల్ ఎక్సర్‌సైజ్ ఒకటుంది. అదేమంటే మెట్లెక్కడం... నిజమే! మెట్లెక్కడం అలవాటు చేసుకుంటే ఆరోగ్యానికి మెట్లెక్కినట్లే! అయితే దానికీ ఓ పద్ధతుంటుంది మరి.

ఆరోగ్యానికి మెట్లు...



నడవటం, పరుగెత్తటం, సైకిల్ తొక్కటం, ఈదటం లాంటి మిగతా వ్యాయామాలే కాదు, రోజూ మెట్లెక్కటం, దిగటం వల్ల కూడా శరీరం ఆరోగ్యవంతంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

సాధారణంగా నేలమీద నడుస్తున్నప్పటి కంటే మెట్లెక్కుతూ పైకి వెళ్లటం, కిందకు దిగటం మూలంగా కండరాలు బలపడతాయి. తొడలు, కాలి పిక్కలు పటిష్ఠంగా తయారవుతాయి. కండరాలు బలంగా ఉంటే నిటారుగా, మంచి ఫిటెనెస్‌తో ఉన్నట్లుగా కనిపిస్తారు.

శరీరాకృతి పట్ల శ్రద్ధ ఉండి రోజూ ఎక్సర్‌సైజులు చేసేవాళ్ళు, వాటితోపాటు మెట్లెక్కటాన్ని కూడా అలవాటు చేసుకుంటే రోజు రోజుకూ శరీరాకృతిలో వచ్చే మార్పులను చూసి మనకే ఆశ్చర్యం వేస్తుంది.

ఇలా అలవాటు చేసుకోవాలి!

కింద నుంచి 8 మెట్ల దాకాఎన్నుకుని ఆ 8 మెట్లనూ పైకి ఎక్కటం, కిందికి దిగటం, మళ్ళీ ఎక్కటం, దిగటం అలా అలిసిపోయేదాకా చేయాలి. లేదా ఒక అంతస్తు పైదాకా ఎక్కుతూ దిగుతూ ఉండాలి. మెట్లను పైకి ఎక్కుతున్నప్పుడు చేతుల్ని రిలాక్స్‌గా పక్కలకు వదిలేయాలి. మోచేతుల్ని మాత్రం కొద్దిగా వంచాలి. బాగా ప్రాక్టీస్ అయాక మోచేతుల్ని ఇంకా వంచవచ్చు. ఇలా చేయటం వల్ల మోకాళ్ళను ఎత్తి ఎత్తి వేయటానికి అనువుగా ఉంటుంది. అయితే ఎన్ని మెట్లెక్కినా, మరునాటికి కాళ్ళపిక్కల్లో పోట్లు, నొప్పులు వంటివి ఉండకూడదు. అలా ఉన్నాయంటే మీరు శక్తికి మించి మెట్లెక్కుతూ దిగుతున్నారన్న మాట.

- మెట్లు ఎక్కుతూ దిగుతూ వున్నప్పుడు పాదాలు జారకుండా ఉండటానికి సౌకర్యంగా ఉండే షూస్ వాడాలి.
- మిగతా ఎక్సర్ సైజులతో పాటు రెండు మూడు అంతస్తుల మెట్లను ఇలా ఎక్కుతూ దిగితే మీ శరీరం వెచ్చదనానికి చేరుకుంటుంది తర్వాత శరీరం మామూలు స్థితికి వచ్చి కూల్ డౌన్ కావటానికి అనువుగా రిలాక్స్ అవుతూ కొద్దిసేపు నడవాలి. ఇందుకు సుమారు మూడు నుంచి 10 నిముషాల సమయం పడుతుంది.
- మిగతా ఏ ఎక్సర్ సైజులూ చేయనివారు ఈ మెట్లెక్కే ఎక్సర్ సైజును వారానికి కనీసం రెండుసార్లన్నా చేయాలి. తడవకు 20 నిముషాలకు తగ్గకుండా. ఆ తర్వాత పైన చెప్పిన నడక ఎక్సర్‌సైజును తిరిగి చేయాలి.
- దీనిని ఒక సాధనగా చేసుకోవాలంటే మొదటి రెండువారాలలో 2 అంతస్తుల దాకా మెల్లగా ఎక్కుతూ దిగాలి. మూడో వారం వచ్చేసరికి 3 అంతస్తులు... ఇలా అయిదు అంతస్తుల దాకా అలుపు లేకుండా ఎక్కి, దిగగలిగేలా సాధన చేయాలి.

మీ ఇల్లు ఎంత శుభ్రం?



మనం ఎంత శుభ్రంగా ఉన్నా, మన ఇల్లు శుభ్రంగా లేకపోతే ప్రయోజనం ఉండదు. రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. ఇల్లు శుభ్రంగా ఉంటేనే ఇంట్లోని వాళ్లు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండగలరు. నిజానికి ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేమిటో చూద్దాం...

ఇంటిని శుభ్రంగా ఉంచడం కోసం ముందుగా గుమ్మం దగ్గర ఉండే డోర్‌మ్యాట్‌ని శుభ్రం చేసుకోవడంతో ప్రారంభించాలి. ఎందుకంటే మనం ఇంట్లోకి, బయటకి తిరిగేటప్పుడు కాళ్లకు ఉండే మట్టి అంటేది డోర్ మ్యాట్‌కే కాబట్టి డోర్ మ్యాట్‌ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. వారానికోసారి డోర్‌మ్యాట్‌ని మారుస్తుండాలి.

అందుబాటులో ఉంచుకోవడం: ■ శుభ్రతకి కావాల్సిన వస్తువులన్నింటినీ మన చేతికి అందేలా ఉంచుకోవడం వల్ల సమయం కలిసొస్తుంది. పని కూడా సులువు అవుతుంది. ■ కిటికీలు తెరిస్తే వెలుతురుతో పాటు దుమ్ము కూడా వచ్చేస్తుంది. అందుకే కిటికీల రెక్కలను కొద్దిసేపు తెరిచి ఉంచిన తర్వాత మళ్లీ మూసేయాలి. ఇక కిటికీ అద్దాలకీ దుమ్ము, ధూళి, సూక్ష్మజీవులు కూడా ఎక్కువగా అంటి పెట్టుకుని ఉంటాయి. అందువల్ల కిటికీలను ప్రతిరోజూ శుభ్రం చేస్తుంటే సీజనల్ అలర్జీల నుంచి దూరంగా ఉండొచ్చు.

బూజు దులపటం: ■ ఇంటినంతా చక్కగా కడిగి శుభ్రంగా ఉంచడంతో పాటు గోడ మూలల్లో ఉన్న బూజును కూడా దులపాలి. ఇంట్లో చెత్తని తొలగించడంలో ఏమాత్రం అజాగ్రత్త ఉండకూడదు. ముఖ్యంగా బాత్రూమ్‌లో, వంటగదుల్లోనూ సూక్ష్మజీవులు పెరగడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. అందుకే ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి. ఇంటి ముందు చెట్లు ఉంటే పరిశుభ్రమైన గాలి వస్తుంది. తేమ శాతం తగ్గుతుంది. ఇలాంటి చిన్న చిన్న జాగ్రత్తలతో ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధుల నుండి కొంతవరకు రక్షణ పొందవచ్చు ■ ఇక ఇంటిని శుభ్రం చేయడమంటే చాలా పెద్ద సమస్య. వస్తువులను శుభ్రంగా కడిగే ముందు ఎక్కువగా దుమ్ము పేరుకునే వస్తువులను ముందుగా శుభ్రం చేసుకుంటే సగం పని అయిపోతుంది. దీనికి కింది సూచనలు పాటిస్తే సరిపోతుంది.

సీలింగ్ ఫ్యాన్స్: ■ సీలింగ్ ఫ్యాన్‌లను తుడవకుండా ఉంటే వాటిపై దుమ్ము ఎక్కువగా చేరుతుంది. దానివల్ల ఇంట్లో ఉండే ఫర్నిచర్‌పై దుమ్ము పడుతుంది. కాబట్టి ఫ్యాన్‌ను మొదట శుభ్రం చేయాలి.

కంప్యూటర్: ■ కంప్యూటర్, లాప్‌టాప్ కీబోర్డు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోకపోతే తొందరగా పాడైపోయే అవకాశం ఉంది.

టీవీ: ■ టీవీ స్క్రీన్‌ను ఒక శుభ్రమైన మెత్తటి బట్టతో తుడవాలి. అలాగే టీవీకి ముందు వైపు కన్నా వెనుక భాగంలో ఎక్కువగా దుమ్ము ఉంటుంది. దాన్ని దులపడటం చాలా అవసరం.

అద్దాలు: ■ ఇంట్లో ఉండే అద్దాలను, గాజు పాత్రలను శుభ్రంగా కడిగి తుడిచి పెట్టండి. ఇలా చేయటం వల్ల పాత్రలు కొత్తవిగా కనిపిస్తాయి

పక్కబట్టలు మడతపెట్టడం: ■ రోజంతా పని చేసిన తర్వాత వచ్చి సేదదీరేది బెడ్ మీదనే. మీ పడకగది మురిగ్గా ఉండటం చూస్తే నిద్ర కూడా సరిగా పట్టదు. కాబట్టి నిద్ర లేవగానే దుప్పటిని దులిపి మడతబెట్టాలి. బెడ్‌షీట్‌ను నీట్‌గా సర్దాలి.

దుస్తుల శుభ్రం: ■ ఒకేసారి మొత్తం బట్టలు ఉతకాలంటే అలసట రావడం సహజమే, పైగా అందుకు ఎక్కువ సమయం కూడా పడుతుంది. ధరించే దుస్తులలో రకాన్ని బట్టి వేటికవి విడదీసి ఉతికితే సులభంగా ఉంటుంది.

చెత్తను వదిలించుకోవడం: ఇంటిలో అనవసరమైన వస్తువులు తీసి బయట పడేసి తర్వాత అన్నిటినీ సర్దటం మంచిది. ఈ అలవాటును అందరూ తప్పక పాటించాలి. వాడే వస్తువులు అన్నీ అందుబాటులో ఉండేలా సర్దుకోవాలి. టేబుల్స్ లేదా బల్లలపై తక్కువ వస్తువులుంటే వాటిని శుభ్రపర్చటం సులువవుతుంది.

ఇంటి వాకిలి దగ్గర ఉంచే షూ ర్యాక్ కూడా శుభ్రపర్చటం చాలా ముఖ్యం. అలాగే మీకేదన్నా దాని స్థానంలో లేదు అన్పిస్తే, మళ్ళీ చేద్దాం లే అని వదిలేయకండి. అప్పటికప్పుడు చేయటం మంచిది.

నిద్రించే ముందే: మీరు ప్రతి రాత్రి పడుకునే ముందు అన్నిటినీ శుభ్రం చేసే అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా పిల్లలకు వాళ్ల వస్తువులను సర్దేసి, వారి గదులను శుభ్రం చేసుకుని పడుకునేలా తర్ఫీదు ఇవ్వండి. వంట గదిని కూడా శుభ్రం చేసి పడుకోటం నేర్చుకోండి.

పరిసరాల పరిశుభ్రత

మీ ఇంటిని శుభ్రంగా, నీటుగా ఉంచుకోడానికి, పరిశుభ్రత అలవాట్లు చాలా ముఖ్యం. ఇది అందరి బాధ్యత. ఇంటి శుభ్రత కోసం మీరొక్కరే కాదు, కుటుంబసభ్యులు కూడా కృషి చేయాలి. అలా మీరే తర్ఫీదు ఇవ్వడం అవసరం. చిన్న పిల్లలు కదా, వాళ్లేమి చేయగలరులే అని వదిలేస్తే, తర్వాత మీరే బాధపడాల్సి ఉంటుంది కాబట్టి చిన్నప్పటినుంచి పిల్లలకు కూడా ఎక్కడ తీసిన వస్తు సామగ్రిని అక్కడ పెట్టడం అలవాటు చేయడం అవసరం.

హెల్త్ టిప్స్



రాత్రి పడుకునేముందు గ్లాసు నీళ్లలో టీస్పూను మెంతులు వేసి నానపెట్టాలి. ఉదయం పరగడుపున ఈ నీళ్లను తాగడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. కీళ్లనొప్పులనుంచి ఉపశమనం కలగడంతోపాటు, శరీర బరువు అదుపులో ఉంటుంది. రోజూ మెంతుల నీళ్లు తాగడం వల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి.


రాత్రి పూట నిద్రకు ముందు ఒక గ్లాస్ చల్లని పాలను తాగాలి. పాలను బాగా మరిగించి అనంతరం వాటిని చల్లార్చి కాసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. దీంతో పాలు చల్లగా మారుతాయి. అనంతరం వాటిని నిద్రకు ముందు తాగాలి. ఇలా మూడు రోజుల పాటు వరుసగా చేస్తే ఎసిడిటీ తగ్గిపోతుంది.

రోజూ మధ్యాహ్నం, రాత్రి భోజనం అనంతరం కాసిని సోంపు గింజలను నోట్లో వేసుకుని బాగా నమిలి మింగాలి. ఇలా చేస్తుంటే జీర్ణ సమస్యలు అన్నీ తగ్గిపోతాయి. ముఖ్యంగా కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది.

● బ్యాడ్ బ్రీత్

తేలిగ్గా తీసుకోవద్దు..!

ఎవరైనా సరే, నోటిని సరిగా శుభ్రం చేయకపోతే దుర్వాసన రావడం సహజం.. అయితే చిగుళ్ల వాపు లేదా దంత సంబంధమైన వ్యాధులు ఏమీ లేకుండా... సక్రమంగా బ్రష్ చేసిన తర్వాత కూడా నోటి నుంచి వాసన వస్తుంటే, దానిని అంత తేలికగా తీసిపారేయడానికి వీలులేదని, కొన్ని రకాల ఇతర వ్యాధులకు సంకేతంగా భావించి దాని గురించి శ్రద్ధ వహించమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



నోటి దుర్వాసన అనేది ఆహారపు అలవాట్లు, నోటి పరిశుభ్రతపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల, దంతవైద్యులు రోజుకు రెండు సార్లు బ్రష్ చేయాలని, భోజనం తర్వాత నోటిలో నీళ్లు పోసుకుని పుక్కిలించి నోటిని శుభ్రం చేయమని చెబుతుంటారు. ఇవి పాటించిన తర్వాత కూడా మీ నోటి నుంచి దుర్వాసన వస్తుంటే, అది శరీరంలో ఇప్పుడిప్పుడే తొంగి చూస్తున్న కొన్ని వ్యాధులకు సంకేతం కావచ్చు.

◆ **కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు**

సైనసైటిస్, బ్రాంకైటిస్, న్యుమోనియా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల వల్ల కూడా నోటి దుర్వాసన వచ్చే అవకాశం ఉంది. దీనితోపాటు, ఈ ఇన్ఫెక్షన్లు సంభవించినప్పుడు, శ్వాసకోశంలో బ్యాక్టీరియా పెరుగుతుంది. దీని కారణంగా వాసన కలిగించే మూలకాలు ఏర్పడి ఇవి గాలి వదిలినప్పుడు దుర్వాసన వచ్చేలా చేస్తాయి

◆ **జీర్ణ సమస్యలు**

కడుపులో ఉండే ఆమ్లాలు అన్నవాహికలోకి ప్రవహించినప్పుడు యాసిడ్ రిఫ్లక్స్ సంభవిస్తుంది. దీనివల్ల నోటిలో పుల్లని తేన్పులతోపాటు వాసన కూడా వస్తుంటుంది.

◆ **కిడ్నీవ్యాధులు**

మూత్రపిండాలనేవి శరీరంలోని మలినాలను వడపోసి శరీరాన్ని శుభ్రంగా ఉంచుతాయి. మూత్రపిండాల పనితీరు మందగించినప్పుడు అవి వాటి పని సక్రమంగా చేయలేక శరీరంలో వ్యర్థాలు పేరుకుని పోతాయి. ఈ విధంగా రక్తంలో చేరిన వ్యర్థాల వల్ల వారు ఊపిరి పీల్చి వదిలేటప్పుడు ఒక విధమైన దుర్వాసన వెలువడుతుంటుంది.

◆ **బీపీ, షుగర్**

మధుమేహం ఉన్నవారిలో ఇది చాలా సాధారణ సమస్య.. ఎందుకంటే వారి శ్వాసలో ఎక్కువ కీటోన్లు ఉంటాయి. ఇవి ఒకవిధమైన చెడు శ్వాసను వెలువరిస్తుంటాయి. అదేవిధంగా దీర్ఘకాలికంగా బీపీ ఉన్న వారు వాడే కొన్ని రకాల మందులు కూడా నోటి దుర్వాసనకు కారణం కావచ్చు.

◆ **కాలేయ సంబంధ వ్యాధులు**

లివర్ సిర్రోసిస్ లేదా ఫ్యాటీ లివర్ వంటి కాలేయ సమస్యల వల్ల శరీరంలోని వ్యర్థాల నిర్వహణ సరిగా జరగదు. అందువల్ల కాలేయంలో ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు కూడా నోటి దుర్వాసన వస్తుంది.

అందువల్ల నోటి దుర్వాసన ఉన్నప్పుడు దంత వైద్యుని సంప్రదించి, వారు సూచించిన మౌత్‌వాష్‌లను, ఇతర విధాలైన మౌత్ ఫ్రెష్‌నర్లను ఉపయోగించినా కూడా నోటి దుర్వాసన వదలకపోతుంటే మాత్రం అది ఇతర వ్యాధులకు సూచనగా భావించి ఫ్యామిలీ వైద్యుని సంప్రదించి వారి సూచన మేరకు తగిన పరీక్షలు చేయించుకుని మందులు వాడాల్సి ఉంటుంది.

రాజమహేంద్రవరంలో....



● రామ్‌చరణ్

రాజమహేంద్రవరం పయనమయ్యారు రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా 'గేమ్ చేంజర్' అనే పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అంజలి, శ్రీకాంత్, సునీల్, జయరాం, నవీన్ చంద్ర, ఎస్‌జే సూర్య ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఈ చిత్రంలో తండ్రీకొడుకులుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని తెలిసింది. తండ్రి పాత్రలో అప్పన్నగా, కొడుకు పాత్రలో ఐఏఎస్ ఆఫీసర్ రామ్‌నందన్‌గా రామ్‌చరణ్ కనిపిస్తారట. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ రాజమహేంద్రవరంలో ప్రారంభం కానుంది. ఈ చిత్రీకరణలో పాల్గొనేందుకు శుక్రవారం రామ్‌చరణ్ హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వెళ్లారు. ఈ షెడ్యూల్‌తో 'గేమ్ చేంజర్' సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తవుతుందట. ఇక రామ్‌చరణ్, అంజలి, శ్రీకాంత్‌తో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని తెలిసింది. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్.

ప్రేమ పరీక్షలు పెట్టా!



● తాప్సీ



● మథియాస్‌తో...

''మథియాస్‌తో నాది లవ్ ఎట్ ఫస్ట్ సైట్ కాదు. మథియాస్ కన్నా ముందు నేను కొంతమంది అబ్బాయిలతో డేటింగ్ చేశాను. కానీ మథియాస్ పరిచయమై, తనతో మాట్లాడటం మొదలుపెట్టాక ఫైనల్‌గా నా అభిప్రాయానికి తగ్గ మనిషిని కనుగొనగలిగాను అనిపించింది'' అని తాజాగా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు తాప్సీ. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్, తాప్సీ ఈ ఏడాది మార్చి 23న అత్యంత సన్నిహితుల సమక్షంలో ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా పెళ్లి చేసుకున్నారు. ఈ ఇద్దరిదీ లవ్ మ్యారేజ్. అయితే మథియాస్‌తో ప్రేమలో పడే ముందు కొన్ని ప్రేమ పరీక్షలు పెట్టానని తాప్సీ చెబుతూ – ''నాకు క్రీడాకారులంటే ఇష్టం. దేశం కోసం వాళ్లు ఆడుతుంటారు. ఇక మథియాస్‌తో నాది లవ్ ఎట్ ఫస్ట్ సైట్ కాదు. అలాగే ఒక నెలలో పుట్టిన ప్రేమ కూడా కాదు. మా మధ్య ఉన్నది నిజమైన ప్రేమేనా అని తెలుసుకోవడానికి కొన్ని ప్రేమ పరీక్షలు పెట్టాను. అన్నింటిలోనూ మథియాస్ గెలిచాడు. ఒక అనుబంధం బలంగా నిలవడం ముఖ్యం. అందుకే నేను తొందరపడలేదు. అంతకు ముందు నాకు పరిచయం ఉన్న అబ్బాయిలు వేరు... మథియాస్ వేరు. ఆ అబ్బాయిల్లో ఏ ఒక్కరినీ మథియాస్‌తో పోల్చలేం. పరిణతి, భద్రతాభావం... ఇవే అతను నాకు సరైన వ్యక్తి అని నిర్ణయించుకునేలా చేశాయి'' అన్నారు.

కొంత గ్యాప్ తర్వాత...



● వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మట్కా'. 'పలాస' ఫేమ్ కరుణకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. రజనీ తాళ్లూరి ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. యావత్ భారత దేశాన్ని కదిలించిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా డిఫరెంట్ టైమ్‌లైన్స్‌లో సాగే ఈ సినిమాలో వరుణ్ తేజ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారు. కాగా కొంత గ్యాప్ తర్వాత ఈ సినిమా షూటింగ్ మళ్లీ ఆరంభం కానుంది. తాజా షెడ్యూల్ చిత్రీకరణను ఈ నెల 19న హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఓ స్టూడియోలో ప్లాన్ చేశారు. ప్రస్తుతం సెట్ వర్క్ జరుగుతోంది. కొత్తగా ప్రారంభం కానున్న షూటింగ్ షెడ్యూల్‌లో ఓ యాక్షన్ ఎపిసోడ్‌తో పాటు ప్రధాన తారాగణంపై కొంత టాకీ పార్టును కూడా చిత్రీకరిస్తారట మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

ఆమె కదిలే కవిత్వం!

గోవా, ఖాట్మండు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులు గెలుచుకుని విమర్శకుల ప్రశంసలు పొందిన 'మను' సినిమాతో దర్శకుడిగా పరిచయం అయ్యారు ఫణీంద్ర నర్సెట్టి. ఆయన దర్శకత్వంలోని తర్వాతి సినిమాకు '8 వసంతాలు' అనే టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో 'మ్యాడ్' మూవీ ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసి, శుద్ధీ అయోధ్య పాత్రలో అనంతిక నటిస్తున్నట్లు వెల్లడించారు మేకర్స్. అలాగే ఫస్ట్ లుక్ పోస్టర్‌పై ఆమె కదిలే కవిత్వం అనే ట్యాగ్‌లైన్ ఉంది.



● అనంతిక

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ''శుద్ధీ అయోధ్య ఓ మంచి కుమార్తె... ప్రేమికురాలు. మార్షల్ ఆర్ట్స్ స్టూడెంట్, రైటర్, మంచి మానవతావాది. ఆమె జీవితంలో 19 ఏళ్ల నుంచి 27 ఏళ్ల వరకు జరిగిన ఎనిమిది సంవత్సరాల ప్రయాణం ఈ సినిమాలో ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: నరేశ్ కుమారన్, కెమెరా: విశ్వనాథ్ రెడ్డి.

మిస్ యు



● సిద్ధార్థ్

సిద్ధార్థ్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'మిస్ యు' అనే టైటిల్ ఖరారైంది. 'మాప్పిళ్లయ్ సింగమ్' ఫేమ్ ఎన్. రాజశేఖర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఆషికా రంగనాథన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్యామ్యూల్ మాథ్యూ నిర్మిస్తున్నారు. ఈ రొమాంటిక్ డ్రామా సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు. ఇక సిద్ధార్థ్ ఓ లీడ్ రోల్‌లో నటించిన 'ఇండియన్ 2', 'ది టెస్ట్' సినిమాలు కూడా ఈ ఏడాదే విడుదలకు సిద్ధం అవుతున్నాయి.

ఆ క్షణాల కోసం ఎదురు చూస్తున్నా!

\- మైఖేల్ బి జోర్డాన్



విల్ స్మిత్ నటించిన హాలీవుడ్ హిట్ ఫిల్మ్ 'ఐ యామ్ లెజెండ్'. ఫ్రాన్సిస్ లారెన్స్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2007లో విడుదలై, ఘనవిజయం సాధించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఐ యామ్ లెజెండ్ 2'ని దాదాపు రెండేళ్ల క్రితం ప్రకటించారు. విల్ స్మిత్‌తో పాటు మైఖేల్ బి జోర్డాన్ కూడా ఈ సీక్వెల్‌లో నటించనున్నారు. ఈ విషయం గురించి జోర్డాన్ మాట్లాడుతూ– ''ఇంకా ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. చిత్రీకరణ ఎప్పుడు మొదలవుతుంది? ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుంది? అనే విషయాల గురించి ఇప్పుడే చెప్పలేను. అయితే విల్ స్మిత్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనుండటం ఆనందంగా ఉంది. విల్‌తో కెమెరా ముందు నటించే క్షణాల కోసం ఎదురు చూస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు. ఇక 'ఐ యామ్ లెజెండ్ 2'కి ఎవరు దర్శకత్వం వహిస్తారనే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మళ్లీ ఏ



ఉపేంద్ర హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'ఏ' చిత్రం మళ్లీ విడుదల కానుంది. 1998లో దాదాపు రూ. 1 కోటీ 25 లక్షలతో రూపొందిన ఈ చిత్రం రూ. 20 కోట్లు వసూలు చేసింది. కొత్త తరహా రొమాంటిక్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో చాందినీ కథానాయికగా నటించారు. ఈ చిత్రాన్ని తాజాగా 4కేలో ఉపేంద్ర ఉప్పి క్రియేషన్స్, లింగం యాదవ్ చందు ఎంటర్‌టైన్మెంట్ విడుదల చేయనున్నాయి. ఈ నెల 21న ఈ చిత్రం తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా లింగం యాదవ్ మాట్లాడుతూ – ''అప్పట్లో 'ఏ' ఒక సంచలనం. ఇప్పటికే కన్నడలో రీ రిలీజ్ అయిన ఈ చిత్రం అద్భుతమైన స్పందన రాబట్టింది. జూన్ 21న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విడుదల చేయనున్నాం. ఇక మేం 4కేలో విడుదల చేసిన ప్రభాస్ 'ఛత్రపతి, యోగి' చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. 'ఏ'కి కూడా మంచి ఆదరణ దక్కుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

గర్వంగా చెప్పుకునే సూపర్ హీరో ఫిల్మ్ ఇది


\- అరవింద్ కృష్ణ



● జ్యోతి, అరవింద్ కృష్ణ, మనీష్

అరవింద్ కృష్ణ, మనీష్ గిలాడ, జ్యోతి పూర్వజ్, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో సుకు పూర్వజ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఏ మాస్టర్ పీస్'. ఫిల్మ్ ప్రొడక్షన్ స్టూడియో మెర్జ్ ఎక్స్‌ఆర్‌తో కలిసి సినిమా బండి ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ నిర్మిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో అరవింద్ కృష్ణ మాట్లాడుతూ– ''ఏ మాస్టర్ పీస్' మనం గర్వంగా చెప్పుకునే సూపర్ హీరో మూవీ అవుతుంది. నేను సినిమాలు వదిలేసిన సమయంలో నాలాంటి హీరో ఇండస్ట్రీలో ఉండాలని, నన్ను సినిమాలు చేయమని ప్రోత్సహించిన సుకుకు థ్యాంక్స్'' అన్నారు. ''ఓ సూపర్ హీరో క్యారెక్టర్‌కు మన పురాణాల నేపథ్యాన్ని జోడిస్తే మన నేటివ్ సూపర్ హీరో ఫిల్మ్ చేయవచ్చనే ఆలోచనతో 'ఏ మాస్టర్ పీస్' సినిమాను ప్రారంభించాం. కథలో మైథాలజీని, సైన్స్ ఫిక్షన్‌ను కలిపేందుకు శివుడి పాత్రను సందానంగా తీసుకున్నా. ఇది పురాణాల్లో ఉండదు. కల్పిత పాత్రగా రాసుకున్నాను. క్లైమాక్స్ మినహా షూటింగ్ పూర్తయింది. ఈ సినిమాలో నా భార్య జ్యోతి పూర్వజ్ ఇంపార్టెంట్ రోల్ చేస్తోంది'' అన్నారు సుకు పూర్వజ్. ''ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్నాను'' అన్నారు నటుడు–నిర్మాత మనీష్ గిలాడ. హీరోయిన్ జ్యోతి పూర్వజ్, సినిమాటోగ్రాఫర్ శివరామ్ చరణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మాధవ్ మాట్లాడారు.

ఫుల్ కామెడీ



● రవికృష్ణ

రవికృష్ణ, సమీర్ మళ్ల, రాజీవ్ కనకాల ముఖ్య పాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. బొమ్మా బొరుసా పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి విస్కి దర్శకుడు. ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ – ''నేను ఎంఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లినప్పుడు ఐదుగురు చిన్ననాటి స్నేహితులకు జరిగిన ఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. ఇదొక కామెడీ డ్రామా. ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. సినిమా సహజంగా ఉండాలని సింక్ సౌండ్ వాడాం. మంచి కంటెంట్, టెక్నికల్ వేల్యూస్‌తో రానున్న ఈ చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రశాంత్ శ్రీనివాస్, కెమెరా: సంకీర్త్ రాహుల్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	1,619	469
	76,693	23,290

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,206	▲	32
డోజోన్స్	38,911	▲	25
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,245	▼	40
డాక్స్	18,557	▼	95
షాంఘై	3,051	▲	2
నికాయ్	38,684	▼	20

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,913	▼	844
బంగారం (99.5 స్వచ్ఛత)	71,625	▼	841
వెండి (కేజీ)	90,535	▲	125

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధాయపరుపటి	81.54	85.22
£	బ్రిటన్ పౌండ్	ధాయపరుపటి	104.33	109.19
€	యూరో	ధాయపరుపటి	88.64	93.11
¥	జపాన్ ఎన్ (100)	ధాయపరుపటి	41.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధాయపరుపటి	53.23	58.01
S$	సింగపూర్ డాలర్	ధాయపరుపటి	59.69	64.36
SAR	సౌదీ రియాల్	ధాయపరుపటి	21.34	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	ధాయపరుపటి	21.81	23.60
¥	చైనా యువాన్	ధాయపరుపటి	10.39	12.46

ఆర్థికాభివృద్ధి.. ధరల కట్టడే లక్ష్యం

ఎనిమిదోసారీ కీలక రుణ రేటు యథాతథం

6.50 శాతంగా కీలక వడ్డీ రేటు కొనసాగింపు • ఆర్‌బీఐ విధాన సమీక్షలో నిర్ణయం
• 2024–25లో జీడీపీ వృద్ధి రేటు 7 శాతం నుంచి 7.2 శాతానికి పెంపు
• ద్రవ్యోల్బణం అంచనా 4.5 శాతం

ముంబై: అంతా ఊహించినట్లే రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీ రేట్లను (రెపో) వరుసగా ఎనిమిదో సారీ యథాతథంగా ఉంచింది. ఇటు పటిష్టమైన వృద్ధి అటు ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని 6.5 శాతం స్థాయిలోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) వృద్ధి రేటు గతంలో భావించిన 7 శాతానికి మించి 7.2 శాతంగా ఉండవచ్చని అంచనా వేసింది. అలాగే ద్రవ్యోల్బణం 4.5 శాతం స్థాయిలో ఉండొచ్చని పేర్కొంది. ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షకు సంబంధించి బుధవారం నుంచి మూడు రోజుల పాటు సమావేశమైన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం ఈ విషయాలు వెల్లడించారు. ఆగస్టు 8న తదుపరి పాలసీ ప్రకటన ఉంటుంది. వడ్డీ రేటును తగ్గించాలని గత సమీక్షలో అభిప్రాయపడిన వారు ఒకరే ఉండగా ఈసారి అది ఇద్దరికి పెరిగింది. ఎక్స్‌టర్నల్ సభ్యులు (ఆషిమా గోయెల్, జయంత్ వర్మ) వీరిలో ఉన్నారు. బ్యాంకులకు ఆర్‌బీఐ తానిచ్చే నిధులపై వసూలు చేసే వడ్డీ రేటే రెపో. బ్యాంకింగ్ వ్యవస్థలో వడ్డీ రేట్లు ప్రధానంగా దీనిపై ఆధారపడి ఉంటాయి. 2023 ఫిబ్రవరి నుంచి ఈ రేటు యథాతథంగా ఉంది.

బల్క్ డిపాజిట్ల పరిమితి పెంపు



బ్యాంకుల అసెట్ మేనేజ్‌మెంట్‌ను మెరుగుపర్చేందుకు తోడ్పడేలా బల్క్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల ప్రారంభ పరిమితిని ఆర్‌బీఐ రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్లకు పెంచింది. సాధారణంగా రిటైల్ టర్మ్ డిపాజిట్లతో పోలిస్తే బల్క్ ఎఫ్‌డీలపై బ్యాంకులు కొంత అధిక వడ్డీ రేటు ఇస్తాయి. పరిమితులను సవరించడం సాధారణంగా జరిగేదేనని కొన్నేళ్ల క్రితం ఇది కోటి రూపాయలుగా ఉండేదని, తర్వాత రెండు కోట్లకు పెరిగిందని, తాజా పరిస్థితుల కు అనుగుణంగా దీన్ని రూ. 3 కోట్లకు పెంచామని డిప్యూటీ గవర్నర్ జె. స్వామినాథన్ తెలిపారు.

యూపీఐ లైట్ వాలెట్లు, ఫాస్టాగ్‌లకు ఆటోలోడ్ సదుపాయం..



చిన్న మొత్తాలను డిజిటల్‌గా చెల్లించేందుకు ఉపయోగపడే యూపీఐ లైట్ వాలెట్లలో బ్యాలెన్స్ తగ్గినప్పుడల్లా ఆటోమేటిక్‌గా లోడ్ చేసుకునే సదుపాయాన్ని కస్టమర్లకు అందుబాటులోకి తేవాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఇందుకోసం దీన్ని ఈ–మ్యాన్‌డేట్ ఫ్రేమ్‌వర్క్ పరిధిలోకి తేవాలని నిర్ణయించింది. యూపీఐ లైట్ వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ఇది ఉపయోగపడగలదని దాస్ తెలిపారు. ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ)లను కూడా ఈ–మ్యాన్‌డేట్ పరిధిలోకి తేవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రస్తుతం యూపీఐ లైట్ రోజువారీపరిమితి రూ. 2,000గా ఉండగా, ఒకసారి గరిష్ఠంగా రూ. 500 వరకు మాత్రమే చేయడానికి వీలుంది. యూపీఐ లైట్ యాప్‌లో బ్యా లెన్స్ గరిష్ఠంగా రూ. 2,000కు మించరాదు.

బ్యాంకుల సిస్టమ్ వైఫల్యాల వల్లే పేమెంట్స్ అంతరాయాలు..

చెల్లింపు లావాదేవీల్లో అంతరాయాలతో కస్టమర్లకు సమస్యలు ఎదురవడానికి కారణం బ్యాంకుల సిస్టమ్‌ల వైఫల్యమే తప్ప యూపీఐ, ఎన్‌పీసీఐలు కాదని దాస్ చెప్పారు. ప్రతి అంతరాయాన్ని కేంద్రీయ బ్యాంకులో సంబంధిత అధికారులు నిశితంగా అధ్యయనం చేస్తారని, ఈ విషయంలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) లేదా ఏకీకృత చెల్లింపుల విధానం ప్లాట్‌ఫాం లోపాలున్నట్లుగా ఏమీ వెల్లడి కాలేదని ఆయన తెలిపారు. టెక్నాలజీకి సంబంధించి బ్యాంకులు గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నాయన్నారు.



> మబ్బులు పడుతున్నాయా లేదా విడిపోతున్నాయా అనే విషయాన్ని నిశితంగా పరిశీలిస్తూ, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మేము తగు నిర్ణయాలు తీసుకుంటాం. ఇప్పటికీ ఆందోళనకరంగానే ఉన్న ద్రవ్యోల్బణం కట్టడే మా ప్రధాన లక్ష్యం.
> – శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్

సానుకూలంగా లగ్జరీ కార్ల మార్కెట్

• ఈ ఏడాది 50,000 పైచిలుకు అమ్మకాలు
• ఆడి ఇండియా హెడ్ ధిల్లాన్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా లగ్జరీ కార్ల మార్కెట్ వృద్ధి అవకాశాలపై తాము ఆశావహంగా ఉన్నామని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో తమ సంస్థ 33 శాతం వృద్ధితో 7,027 యూనిట్లు విక్రయించినట్లు సాక్షి బిజినెస్ బ్యూరోకు చెప్పారు. అలాగే తమ ప్రీ–ఓన్డ్ కార్ల వ్యాపార విభాగం ఆడి అప్రూవ్డ్: ప్లస్ కూడా 50 శాతం వృద్ధి నమోదు చేసినట్లు వివరించారు. ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండటం, స్టాక్ మార్కెట్లు పనితీరు బాగుండటం, చురుకైన స్టార్టప్ వ్యవస్థ, ఉద్యోగిత పెరుగుతుండటం తదితర అంశాలు భారత్‌లో లగ్జరీ కార్ల సెగ్మెంట్ వృద్ధికి దోహదపడుతున్నాయని ధిల్లాన్ చెప్పారు. 2023 నాటి రికార్డు స్థాయి అమ్మకాలతో పోలిస్తే లగ్జరీ మార్కెట్ కాస్త తగ్గినా 2024లో పరిశ్రమవ్యాప్తంగా 50,000 పైచిలుకు వాహన విక్రయాలు నమోదు కావచ్చని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రూ.లక్షకే చేతక్ స్కూటర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీలో ఉన్న బజాజ్ చేతక్ తాజాగా 2901 మోడల్‌ను ప్రవేశపెట్టింది. హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో ధర రూ.99,998 ఉంది. కంపెనీ ఆఫర్ చేస్తున్న మోడళ్లలో ఇదే తక్కువ ధర కలిగింది. చేతక్ అర్బేన్ ధర రూ.1,23,319 కాగా, చేతక్ ప్రీమియం రూ.1,47,243 ఉంది. 2901 మోడల్ స్కూటర్ ఒకసారి చార్జింగ్‌తో 123 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. 2.88 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. టాప్ స్పీడ్ గంటకు 63 కిలోమీటర్లు. స్టీల్ బాడీతో తయారైంది. చార్జింగ్‌కు 6 గంటలు తీసుకుంటుంది. రూ.3 వేలు చెల్లించి టెక్‌ప్యాక్ సబ్‌స్క్రిప్షన్ తీసుకుంటే హిల్ హోల్డ్ అసిస్ట్, రివర్స్ మోడ్, యాప్ కనెక్టివిటీ, కాల్ మేనేజ్‌మెంట్, మ్యూజిక్ కంట్రోల్, జియో–ఫెన్సింగ్ ఫీచర్లు అదనంగా చేరతాయి.

• ఆర్‌బీఐ వృద్ధి అంచనాల పుష్

మార్కెట్ల హై జంప్



• సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త రికార్డులు
• సెన్సెక్స్ @ 76,693– 23,290కు నిఫ్టీ
• మళ్లీ 5 ట్రిలియన్ డాలర్లకు మార్కెట్

వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు లాభాల దౌడు తీశాయి. పాలసీ సమీక్షలో భాగంగా ఆర్‌బీఐ వృద్ధి అంచనాలను పెంచడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో సమయం గడిచేకొద్దీ మార్కెట్లు బలపడుతూ వచ్చాయి. చివరి సెషన్‌కల్లా సెన్సెక్స్ 1,721 పాయింట్ల 'హై'జంప్ చేసింది. 76,795ను అధిగమించింది. చివరికి 1619 పాయింట్లు జమ చేసుకుని 76,693 వద్ద ముగిసింది. ఈ బాటలో నిఫ్టీ 469 పాయింట్లు ఎగసి 23,290 వద్ద స్థిరపడింది. వెరసి ఇండెక్సులు చరిత్రాత్మక గరిష్టాలను సాధించాయి. ఇక ఇంట్రాడేలో నిఫ్టీ 499 పాయింట్లు దూసుకెళ్లి గరిష్ఠంగా 23,320కు చేరింది. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకానున్నప్పటికీ ఈ ఏడాది దేశ జీడీపీ 7.2 % పురోగమించనుందన్న అంచనాలతో బీఎస్‌ఈ, ఎన్ఎస్‌ఈలలో అన్ని రంగాలూ లాభపడ్డాయి. టెలికం, ఐటీ, ఆటో, రియల్టీ, మెటల్, ఆయిల్ 4–2% మధ్య పుంజుకున్నాయి.

రూ. 423 లక్షల కోట్ల పైకి...

మంగళవారం పతనం తదుపరి మూడు రోజుల్లో బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్(విలువ)కు రూ. 28.65 లక్షల కోట్లు జమయ్యింది. దీంతో మళ్లీ రూ. 423 లక్షల కోట్లను అధిగమించింది. 5.08 ట్రిలియన్ డాలర్లను తాకింది. బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ సోమవారం రూ. 426 లక్షల కోట్ల(5.13 ట్రిలియన్ డాలర్లు)కు చేరడం ద్వారా సరికొత్త రికార్డ్ నెలకొల్పిన విషయం విదితమే. సానుకూల రుతుపవనాలు ఆర్‌బీఐ లక్షిత 4.5 శాతం ద్రవ్యోల్బణ కట్టడికి సహకరించనున్న అంచనాలు సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. మంగళవారం మార్కెట్ విలువలో రూ. 31 లక్షల కోట్ల చిల్లుపడినప్పటికీ మూడు రోజుల్లోనే రికవర్‌కావడం విశేషం!!

ఎఫ్‌పీఐల యూటర్న్



దేశీ స్టాక్స్‌లో ఇటీవల భారీ స్థాయిలో అమ్మకాలు చేపడుతున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) తాజాగా కొనుగోళ్ల యూటర్న్ తీసుకున్నారు. నగదు విభాగంలో నికరంగా రూ. 4,391 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. గత మూడు రోజుల్లో ఎఫ్‌పీఐలు ఏకంగా రూ. 24,960 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న సంగతి తెలిసిందే.

గ్లాండ్ ఫార్మా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా శ్రీనివాస్ సాదు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ గ్లాండ్ ఫార్మా ఎండీ, సీఈవో శ్రీనివాస్ సాదు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, సీఈవోగా పదోన్నతి పొందారు. జూన్ 10 నుంచి ఆయన నియామకం అమలులోకి వస్తుందని కంపెనీ శుక్రవారం తెలిపింది. సంస్థ వృద్ధి, విజయంలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రీనివాస్ 2019 ఏప్రిల్ 25న ఎండీ, సీఈవోగా బాధ్యతలు స్వీకరించారని గ్లాండ్ ఫార్మా తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-6-2024	
విశాఖ	455–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	450–00
విజయవాడ	455–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440–00
వరంగల్	442–00
రిటైల్ ధర	5.00

సాక్షి స్పోర్ట్స్



షూటర్ సిఫ్ట్ కౌర్‌కు కాంస్యం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు రెండో పతకం లభించింది. మ్యూనిక్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్ సామ్రా కాంస్య పతకం సొంతం చేసుకుంది. ఎనిమిది మంది షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో సిఫ్ట్ కౌర్ 452.9 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. గురువారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ సరబ్‌జోత్ సింగ్ స్వర్ణ పతకం సాధించాడు.

క్వార్టర్ ఫైనల్లో సహజ



అమెరికాలో జరుగుతున్న అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల డబ్ల్యూ75 టోర్నీలో తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సహజ 6–4, 2–6, 6–1తో స్కాట్ కత్రీనా (అమెరికా)పై నెగ్గింది. ఈ మ్యాచ్‌లో సహజ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

అల్‌కరాజ్ అదరహో

తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్లోకి • సెమీస్‌లో రెండో ర్యాంకర్ సినెర్‌పై గెలుపు



పారిస్: కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించడానికి స్పెయిన్ టెన్నిస్ స్టార్, ప్రపంచ మూడో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ విజయం దూరంలో నిలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అల్‌కరాజ్ తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. వచ్చే వారం కొత్త ప్రపంచ నంబర్‌వన్‌గా అవతరించనున్న ప్రస్తుత రెండో ర్యాంకర్ యానిక్ సినెర్ (ఇటలీ)తో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో అల్‌కరాజ్ 2–6, 6–3, 3–6, 6–4, 6–3తో గెలుపొందాడు. నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), గత ఏడాది రన్నరప్ కాస్పర్ రూడ్ (నార్వే) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో అల్‌కరాజ్ తలపడతాడు. 21 ఏళ్ల అల్‌కరాజ్ 2022లో యూఎస్ ఓపెన్, 2023లో వింబుల్డన్ టోర్నీలో విజేతగా నిలిచాడు. అడ్రియానో పనట్టా (1976లో) తర్వాత ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరిన తొలి ఇటలీ ప్లేయర్‌గా ఘనత వహించాలనుకున్న సినెర్‌కు నిరాశ ఎదురైంది. 4 గంటల 9 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో సినెర్ చివరి రెండు సెట్‌లలో అల్‌కరాజ్ ఆటకు ఎదురునిలువలేక ఓడిపోయాడు. 8 ఏస్‌లు, 7 డబుల్ ఫాల్ట్‌లు చేసిన అల్‌కరాజ్ 65 విన్నర్స్‌తో అదరగొట్టాడు. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయిన ఈ మాజీ నంబర్‌వన్ ప్రత్యర్థి సర్వీస్‌ను కూడా ఆరుసార్లు బ్రేక్ చేశాడు. 15 పాసింగ్, 23 డ్రాప్ షాట్‌లతో అలరించిన అల్‌కరాజ్ నెట్ వద్దకు 27 సార్లు దూసుకొచ్చి 16 సార్లు పాయింట్లు గెలిచాడు.

స్వియాటెక్ X జాస్మిన్

• నేడు మహిళల సింగిల్స్ ఫైనల్
• సాయంత్రం గం. 6:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో



కెరీర్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా స్వియాటెక్... తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలనే పట్టుదలతో జాస్మిన్ పావ్లిని... నేడు జరిగే ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో తలపడనున్నారు. ప్రపంచ నంబర్‌వన్ స్వియాటెక్ (పోలాండ్) ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను మూడుసార్లు (2020, 2022, 2023) చేజిక్కించుకోగా... 15వ ర్యాంకర్ జాస్మిన్ (ఇటలీ) మాత్రం కెరీర్‌లో 18వ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతూ తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్‌కు చేరింది.

లక్ష్య సేన్ ఓటమి



జకార్తా: ఇండోనేసియా ఓపెన్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్, ప్రపంచ 14వ ర్యాంకర్ లక్ష్య సేన్ ఓటమి పాలయ్యాడు. ప్రపంచ ఐదో ర్యాంకర్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)తో 61 నిమిషాలపాటు జరిగిన పోరులో లక్ష్య సేన్ 22–24, 18–21తో ఓడిపోయాడు. లక్ష్య సేన్‌కు 7,150 డాలర్ల (రూ. 5 లక్షల 96 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

హంపి, వైశాలి పరాజయం

స్టావెంజర్: నార్వే చెస్ టోర్నీ తొమ్మిదో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు హంపి, వైశాలి, ప్రజ్ఞానంద ఓడిపోయారు. జూ వెన్‌జున్ (చైనా)తో 'అర్మగెడాన్' గేమ్‌లో హంపి 42 ఎత్తుల్లో... టింగ్లీ లె (చైనా)తో జరిగిన క్లాసికల్ గేమ్‌లో వైశాలి 26 ఎత్తుల్లో ఓడిపోయారు. కరువానా (అమెరికా) 'అర్మగెడాన్' గేమ్‌లో 46 ఎత్తుల్లో ప్రజ్ఞానందను ఓడించాడు.

ఐర్లాండ్‌కు కెనడా షాక్

12 పరుగుల తేడాతో కెనడా జయభేరి • సమష్టిగా దెబ్బతీసిన బౌలర్లు



న్యూయార్క్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శాశ్వత సభ్య దేశం ఐర్లాండ్ జట్టుకు తొలిసారి టి20 ప్రపంచకప్‌లో ఆడుతున్న కెనడా జట్టు షాక్ ఇచ్చింది. గ్రూప్ 'ఎ'లో శుక్రవారం జరిగిన పోరులో కెనడా తక్కువ లక్ష్యాన్ని కాపాడుకొని 12 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను కంగుతినిపించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. ఓపెనర్లు ఆరోన్ జాన్సన్ (14), నవ్‌నీత్ ధలివాల్ (6) సహా పర్గత్ సింగ్ (18), దిల్‌ప్రీత్ (7) నిరాశపరిచారు. ఈ దశలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నికోలస్ కిర్టన్ (35 బంతుల్లో 49; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మొవ్వ శ్రేయస్ (36 బంతుల్లో 37; 3 ఫోర్లు) రాణించడంతో కెనడా కోలుకుంది. ప్రత్యర్థి బౌలర్లలో క్రెయిగ్ యంగ్, మెకార్తి చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఐర్లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేసి ఓడిపోయింది. హేలిగెర్ (2/18), గోర్డాన్ (1/13), సిద్దిఖీ (1/27), జాఫర్ (1/22) సమష్టిగా దెబ్బ కొట్టారు. దీంతో 59 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన ఐర్లాండ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో డాక్‌రెల్ (23 బంతుల్లో 30 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), మార్క్ అడైర్ (24 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా చివరకు ఐర్లాండ్‌కు ఓటమి తప్పలేదు.

'సూపర్' సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

సౌరభ్ నేత్రావల్కర్ ఆసక్తికర నేపథ్యం • అమెరికాను గెలిపించిన భారత ప్లేయర్





డాలస్: టి20 ప్రపంచకప్‌లో భాగంగా పాకిస్తాన్‌తో గురువారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో 'సూపర్ ఓవర్'ను అద్భుతంగా బౌల్ చేసి అమెరికాను గెలిపించిన లెఫ్టార్మ్ పేసర్ సౌరభ్ నేత్రావల్కర్‌పై అన్ని వైపుల నుంచి ప్రశంసలు కురుస్తున్నాయి. భారత్‌కు చెందిన అతను చదువు, ఉద్యోగరీత్యా యూఎస్‌కు వెళ్లి ఇప్పుడు తొలిసారి వరల్డ్ కప్ ఆడుతున్న తమ టీమ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. 32 ఏళ్ల సౌరభ్ 2013లో తన తొలి రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడాడు. సూర్యకుమార్ యాదవ్, శార్దుల్ ఠాకూర్, వసీం జాఫర్ ఆ మ్యాచ్‌లో అతని సహచరులు. అయితే ఎన్నో ఆశలతో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన అతనికి అదే చివరి రంజీ మ్యాచ్ కూడా అయింది. అజిత్ అగార్కర్, జహీర్ ఖాన్, అవిష్కార్ సాల్వి, ధావల్ కులకర్ణిలాంటి పేసర్లు ఉన్న ముంబై టీమ్‌లో అతనికి చోటు దక్కడం కష్టమైపోయింది. అంతకు మూడేళ్ల క్రితమే అండర్–19 వరల్డ్ కప్‌లో ఆడి భారత్ తరఫున అత్యధిక వికెట్లు (9) తీసిన బౌలర్‌గా నిలిచాడు. అయితే అతను ఆశించినట్లుగా దేశవాళీ కెరీర్ ఊపందుకోకపోగా, ఐపీఎల్ అవకాశం కూడా దక్కలేదు. నిజానికి 2009లోనే సౌరభ్ వెలుగులోకి వచ్చాడు. ఎయిరిండియా ప్రతిభాన్వేషణలో భాగంగా బెంగళూరు ఎన్‌సీఏలో అద్భుత బంతితో యువరాజ్ సింగ్‌ను బౌల్డ్ చేయడంతో అతనికి స్కాలర్‌షిప్ లభించింది. కొద్ది రోజులకే అదే ఎయిరిండియా తమ ప్రధాన జట్టులోకి తీసుకోవడంతో యువరాజ్, రైనాలతో కలిసి కార్పొరేట్ టోర్నీ కూడా ఆడాడు. తర్వాతి ఏడాది కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, ఉనాద్కట్, హర్షల్ పటేల్‌లతో కలిసి అండర్–19 ప్రపంచకప్‌లో పాల్గొన్నాడు.

అయితే ఏకైక రంజీ మ్యాచ్ తర్వాత మళ్లీ ఆశించిన అవకాశాలు రాలేదు. మరో రెండేళ్లు క్రికెట్‌లో గట్టిగా ప్రయత్నిస్తానని, లేదంటే ఆటను ఆపేస్తానని సౌరభ్ తన తండ్రికి చెప్పాడు. చివరకు అదే జరిగింది. కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన అతను ఎమ్మెస్ చేసేందుకు 2015లో అమెరికాకు వెళ్లిపోయాడు. న్యూయార్క్‌లో ప్రతిష్టాత్మక కార్నెల్ యూనివర్సిటీలో అవకాశం లభించింది. చదువులో ప్రతిభతో పాటు క్రికెట్ పరిజ్ఞానంతో 'క్రిక్‌డీకోడ్' అనే యాప్‌ను తయారు చేయడంతో ప్రత్యేక స్కాలర్‌షిప్ కూడా లభించింది. చదువు పూర్తి కాగానే అతనికి ఒరాకిల్ సంస్థలో ఉద్యోగం కూడా వచ్చింది. అమెరికా చేరాక సరదాగా వారాంతపు క్రికెట్ ఆడుతూ వచ్చిన సౌరభ్... ఆ తర్వాత ఆటపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన యూఎస్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో ఆడటంతో మరింత గుర్తింపు వచ్చింది. ఈ క్రమంలో అమెరికా తరఫున 2018లో తొలి వన్డే ఆడిన నేత్రావల్కర్ గత ఏడాది జరిగిన మేజర్ లీగ్‌లో ఆకట్టుకోవడంతో టి20 టీమ్‌లో రెగ్యులర్ సభ్యుడిగా మారాడు. అండర్–19 వరల్డ్ కప్‌లో పాక్‌తో మ్యాచ్‌లో బాబర్ ఆజమ్‌తో తలపడిన సౌరభ్... ఇప్పుడు బాబర్ టీమ్‌ను చిత్తు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. వరల్డ్ కప్ మ్యాచ్ కోసం ఆఫీసుకు సెలవు పెట్టిన సౌరభ్ ప్రదర్శన తర్వాత సౌరభ్ కంపెనీ 'ఎక్స్' ద్వారా తమ ఇంజినీర్‌ను అభినందించింది.

స్కాట్లాండ్ బోణీ



బార్బడోస్: టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో స్కాట్లాండ్ తొలి విజయం నమోదు చేసింది. గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో స్కాట్లాండ్ ఐదు వికెట్ల తేడాతో నమీబియాపై నెగ్గింది. ఇంగ్లండ్–స్కాట్లాండ్ మధ్య జరిగిన తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా... ఈ గెలుపుతో స్కాట్లాండ్ మూడు పాయింట్లతో గ్రూప్ 'బి'లో అగ్రస్థానంలోకి వెళ్లింది. స్కాట్లాండ్‌తో పోరులో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. కెప్టెన్ ఎరాస్మస్ (31 బంతుల్లో 52; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు. బ్రాడ్ వీల్ 3, బ్రాడ్ కరీ 2 వికెట్లు తీశారు. అనంతరం స్కాట్లాండ్ 18.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ బెరింగ్టన్ (35 బంతుల్లో 47 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మైకేల్ లీస్క్ (17 బంతుల్లో 35; 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడి స్కాట్లాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

టి20 ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X అఫ్గానిస్తాన్
వేదిక: గయానా ; ఉదయం గం. 5 నుంచి
బంగ్లాదేశ్ X శ్రీలంక
వేదిక: డాలస్ ; ఉదయం గం. 6 నుంచి
దక్షిణాఫ్రికా X నెదర్లాండ్స్
వేదిక: న్యూయార్క్ ; రాత్రి గం. 8 నుంచి
ఆస్ట్రేలియా X ఇంగ్లండ్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; రాత్రి గం. 10:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

క్లుప్తంగా...

జలవనరుల శాఖ సలహాదారుగా ఆదిత్యనాథ్‌దాస్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ జలవనరుల శాఖ సలహాదారుగా మాజీ ఐఏఎస్ అధికారి ఆదిత్యనాథ్ దాస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాగునీటి రంగంలో అనుభవం కలిగిన సీనియర్ అధికారి కావడంతో ఆదిత్యనాథ్ దాస్ సేవలు వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది.

విజిలెన్స్ డీజీగా జితేందర్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ రతన్ హఠాన్మరణంతో ఆ పోస్టు ఖాళీ అయిన విషయం తెలిసిందే.

సందీప్ శాండిల్య పదవీకాలం పెంపు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా 1993 బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్యను పునఃనియమిస్తూ రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకుంది. జూన్ 1 నుంచి ఏడాదిపాటు కాలపరిమితితో ఆయనను డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా పనిచేస్తున్న సందీప్‌శాండిల్య ఈ ఏడాది మే 31న పదవీ విరమణ పొందిన సంగతి తెలిసిందే. తిరిగి అదే పోస్టులో ఆయనను కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ల్యాండింగ్ సమయంలో తిరిగి టేకాఫ్

శంషాబాద్: ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై ప్రతికూల పరిస్థితుల కారణంగా విమానం తిరిగి టేకాఫ్ తీసుకున్న సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. పలువురు ప్రయాణికులు తెలిపిన సమాచారం మేరకు...గురువారం సాయంత్రం షిర్డీ నుంచి బయల్దేరిన విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతున్న సందర్భంలో రన్‌వేపై ప్రతికూల పరిస్థితులుండటంతో వెంటనే తిరిగి టేకాఫ్ తీసుకుని పదినిమిషాల పాటు గాల్లో చక్కర్లు కొట్టింది. తిరిగి ఏటీసీ అనుమతి అనంతరం విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. అయితే ఎయిర్‌పోర్టు అధికారులు మాత్రం అధికారికంగా ఈ వివరాలను వెల్లడించలేదు.

'భరోసా'కు రూ.1.5 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 'భరోసా' కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర మహిళా భద్రత విభాగం, వయాట్రిస్ సంస్థల మధ్య ఎంఓయూ కుదిరింది. ఈ ఒప్పందంపై రాష్ట్ర మహిళా భద్రత విభాగం అడిషనల్ డీజీ శిఖాగోయల్, వయాట్రిస్ సంస్థ సీఎస్ఆర్ ఇండియా నిధుల డైరెక్టర్ మిచెల్లె డొమినిక సంతకాలు చేశారు. శుక్రవారం రాష్ట్ర మహిళా భద్రత విభాగం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో రూ.1.5 కోట్ల చెక్‌ను శిఖాగోయల్‌కు డొమినిక అందించారు.

వీరగల్లుల 'వీర్నపల్లి'



వీర్నపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం పెద్దవాగు సమీపంలో ఆరు పురాతన వీరగల్లు విగ్రహాలు బయటపడ్డాయి. ఈ విగ్రహాల ఎడమచేతిలో విల్లు, బాణం, కుడిచేతిలో కత్తి, కొప్పు, ఈటె ఉన్నాయి. ఒకప్పుడు రాజ్యంలోని ప్రజలను, పంటలు, పశుపక్ష్యాదులను శత్రువుల బారి నుంచి రక్షిస్తారనే విశ్వాసంతో ఊరికో వీరగల్లును నియమించేవారని గ్రామస్తులు తెలిపారు. తమ గ్రామంలో పలువురు వీరగల్లులు ఉండేవారని ఆ కారణంగానే ఊరికి వీర్నపల్లి అనే పేరొచ్చి ఉంటుందని గ్రామస్తులు చర్చించుకున్నారు.

కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు: శశిధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్ రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కులగణన చేయాలని గతంలో కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించిందన్నారు. జనాభాలో 42%పైగా ఉన్న బీసీలకు జనాభా ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు.

టీచర్ల బదిలీలు, పదోన్నతులు

రంగారెడ్డి మినహా నేటి నుంచి ప్రక్రియ మొదలు.. షెడ్యూల్ విడుదల

మొత్తం 18,495 మందికి ప్రమోషన్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ మొదలైంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్య కమిషనర్ ఎ.దేవసేన శుక్రవారం విడుదల చేశారు. రంగారెడ్డి మినహా మిగతా జిల్లాలకు సంబంధించి శనివారం నుంచి మొదలయ్యే పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఈ నెల 30వ తేదీతో ముగుస్తుంది. వివిధ కేటగిరీలకు చెందిన మొత్తం 18,495 మంది టీచర్లకు పదోన్నతులు లభించనున్నాయి. రంగారెడ్డి జిల్లాలో మినహా మిగతాచోట్ల కోర్టు కేసులు పరిష్కారం కావడంతో అన్ని స్థాయిల ప్రమోషన్లను ఏకకాలంలో చేపడుతున్నారు. వాస్తవానికి టీచర్ల పదోన్న తులు, బదిలీల ప్రక్రియను 2023 ఫిబ్రవరిలోనే మొదలుపెట్టారు. కానీ నోటిఫి కేషన్ ఇచ్చిన వెంటనే నాన్ స్పౌజ్‌లు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆగస్టులో కోర్టు బదిలీలు, పదోన్నతులపై స్టే ఇచ్చింది.తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు వెళ్ళడంతో స్టే ఎత్తివేసింది. దీంతో సెప్టెంబర్‌లో షెడ్యూల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మల్టీజోన్–1లో హెచ్‌ఎంల స్థాయిలో బదిలీలు, పదోన్నతులు చేపట్టారు. హెచ్‌ఎంలు (గ్రేడ్–2) 1,788 మందికి, స్కూల్ అసిస్టెంట్లు, సమాన కేడర్‌కు చెందిన 10,684 మందికి పదోన్నతులు కల్పించారు. ఈ సమయంలోనే జోన్ వివాదం తలెత్తడంతో జోన్–2లో హెచ్‌ఎంల పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. దీంతో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీల పదోన్నతులు చేపట్టాలని భావించారు. కానీ ప్రమోషన్లకు టెట్ అర్హత ఉండాలన్న ఎన్‌సీటీఈ నిబంధనను క్రోడీకరిస్తూ కొంతమంది కోర్టుకు వెళ్ళారు. కోర్టు స్టే ఇవ్వడంతో మళ్ళీ పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. తాజాగా కేసులు పరిష్కారం కావడం, 2010 ఆగస్టు 23 కన్నా ముందు నియామకం జరిగిన టీచర్లకు టెట్ అవసరం లేదని ఎన్‌సీటీఈ స్పష్టత ఇవ్వడంతో బదిలీలు, ప్రమోషన్లకు మార్గం సుగమం అయ్యింది.

ఎంతమందికి పదోన్నతులు?

కేటగిరీ	పదోన్నతి లభించే వారు
హెచ్‌ఎం గ్రేడ్‌-2	763
స్కూల్ అసిస్టెంట్	5,123
ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం	2,130
లాంగ్వేజ్ పండిట్లు, స్కూల్ అసిస్టెంట్లు (లాంగ్వేజ్), స్కూల్ అసిస్టెంట్లు (ఫిజికల్ ఎడ్యుకేషన్)	10,479
మొత్తం	18,495

పదోన్నతులు, బదిలీల షెడ్యూల్

మల్టీజోన్-1		10-11.6.2024	వెబ్ ఆప్షన్లు
8-9.6.2024	సీనియారిటీ జాబితా, ఖాళీల సంఖ్య వెల్లడి	12-13.6.2024	పదోన్నతుల తర్వాత ఖాళీల వెల్లడి
10-11.6.2024	సీనియారిటీపై అభ్యంతరాల స్వీకరణ	14.6.2024	సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ
12.6.2024	ఫైనల్ సీనియారిటీ జాబితా వెల్లడి	15.6.2024	స్కూల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్‌లో పదోన్నతుల ఉత్తర్వులు
13-16.6.2024	వెబ్ ఆప్షన్లు, పదోన్నతుల ఉత్తర్వులు	16-18.6.2024	ఎస్‌జీటీల ఫైనల్ సీనియారిటీ లిస్ట్
17.6.2024	ఎస్‌జీటీ ఖాళీల వెల్లడి	19.6.2024	స్కూల్ అసిస్టెంట్ల బదిలీ ఉత్తర్వులు
18-20.6.2024	సీనియారిటీ జాబితా, కౌన్సెలింగ్	20.6.2024	బదిలీల తర్వాత మిగిలిన ఖాళీల వెల్లడి
21-22.6.2024	బదిలీల ఉత్తర్వులు	21-24.6.2024	ఫైనల్ సీనియారిటీ జాబితా (ఎస్‌ఏ) వెల్లడి, ఎస్‌జీటీల పదోన్నతులు
మల్టీజోన్-2			
8.6.2024	స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ లిస్ట్	25.6.2024	ఎస్‌జీటీల బదిలీ ఉత్తర్వులు
9.6.2024	అభ్యంతరాల స్వీకరణ	29-30.2024	అన్ని స్థాయిల ఎస్‌జీటీల బదిలీ ఉత్తర్వులు

'ఆర్ట్' వేసుకున్న భాగ్య నగరం!

- హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మక ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్
- మూడు రోజుల పాటు 40 నగరాలకు చెందిన కళాకారుల చిత్రాల ప్రదర్శన
- కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి



ఆర్ట్ ఫెస్టివల్‌లో చిత్రాలను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్‌కు హైదరాబాద్ నగరం వేదికగా మారింది. నగరంలో తొలిసారిగా ఇక్కడి గుడిమల్కాపూర్ కింగ్స్ కోహినూర్ కన్వెన్షన్‌లో ప్రారంభమైంది. 3 రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని శుక్రవారం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ ఫెస్టివల్‌లో దేశంలోని 40 నగరాలకు, సింగపూర్‌కు చెందిన 250 మంది ఆర్టిస్టులు గీసిన 3,500కుపైగా చిత్రాలను ప్రదర్శిస్తున్నట్టు ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్ వ్యవస్థాపక డైరెక్టర్ రాజేంద్ర పాటిల్ తెలిపారు. ఈ చిత్రాలు దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూనే.. అధునాతన కళలోని వైవిధ్యాన్ని అద్భుతంగా ప్రదర్శిస్తున్నాయని వీక్షకులు అంటున్నారు. విభిన్నమైన రంగాలతోపాటు కళలు, సంస్కృతికి కూడా హైదరాబాద్ నగరం కేంద్రంగా మారిందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో ఒక పెయింటింగ్, కళాప్రతిమను పెట్టుకోవాలని.. అవి మన ఆలోచనా విధానాన్ని మార్చుతాయని చెప్పారు. ఇలాంటి ప్రదర్శనలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిస్ట్ లక్ష్మాగౌడ్, ప్రముఖ కార్టూనిస్ట్ శంకర్, ఆర్ట్ కలెక్టర్ పార్వతి రెడ్డి, రచయిత అంజు పొద్దార్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాతో హైదరాబాద్ బంధం బలమైనది

ఆ దేశ స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, జెన్నిఫర్ లార్సన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: అమెరికాతో హైదరాబాద్ బంధం బలమైందని.. రాబోయే రోజుల్లో ఇది మరింత బలోపేతం అవుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన యూఎస్ 248 స్వాతంత్ర దిన వేడుకలకు భట్టి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ స్వాగతం పలికారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ వేడుకలకు తనను ఆహ్వానించిన జెన్నీఫర్ లార్సన్‌కు ధన్యవాదాలు తెలిపారు. భారతదేశానికి వ్యూహాత్మకంగా కూడా అమెరికా మంచి మిత్రదేశం అన్నారు. తెలుగు ప్రజలకు అమెరికాతో అవినాభావ సంబంధం ఉందని చెప్పారు. 'మన సినిమా షూటింగులు అమెరికాలో ఎక్కువగా జరుగుతాయి. మన పిల్లలు ఉన్నత చదువులకు అమెరికాకు ఎక్కువగా వెళుతుంటారు. అమెరికాలో ప్రస్తుతం అతివేగంగా విస్తరిస్తున్న భాష ఏదైనా ఉందా అంటే అది తెలుగు భాష మాత్రమేనని.. రాబోయే రోజుల్లో తాను ఇలాంటి వేడుకల్లో తెలుగులోనే మాట్లాడాల్సిన పరిస్థితి వస్తుందని' చెప్పారు. భారతీయులను అమెరికన్లు సాదరంగా ఆహ్వానించి అక్కడి పౌరులుగా గౌరవ మర్యాదలు ఇస్తారని వారితో సమానంగా చూసుకుంటారని తెలిపారు.

వానాకాలం పంటలకు కాళేశ్వరం నీళ్లు

- వేగంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు తాత్కాలిక మరమ్మతులు: మంత్రి ఉత్తమ్
- ఎన్‌డీఎస్‌ఏ సూచనలకు అనుగుణంగా పంటలకు నీరిచ్చేందుకు ప్రయత్నాలు
- ఎట్టి పరిస్థితుల్లో మేడిగడ్డ గేట్లు దించేది లేదు.. అందుకే బ్యారేజీలను సందర్శించాం
- ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినవారికి శిక్ష తప్పదు
- బ్యారేజీలు, మరమ్మతు పనులను పరిశీలించిన మంత్రి.. అధికారులు, ఏజెన్సీతో సమీక్ష



మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఇంజనీర్లతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్/మంథని: కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వానాకాలం సీజన్‌లో పంటలకు సాగునీరు అందించేలా చర్యలు చేపడుతున్నామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనలు, సిఫార్సుల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని తెలిపారు. వానాకాలం ఊపందుకునేలోగా ఈ పనులు పూర్తి కావాలని అధికారులను ఆదేశించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను, మరమ్మతు పనులను శుక్రవారం మంత్రి ఉత్తమ్ పరిశీలించారు. హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా బయలుదేరిన మంత్రి.. తొలుత సుందిళ్ల వద్ద ఉన్న పార్వతి బ్యారేజీని సందర్శించారు. తర్వాత జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారానికి చేరుకున్నారు. అక్కడి సరస్వతి బ్యారేజీ వద్ద మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం మేడిగడ్డకు చేరుకున్నారు. లక్ష్మి బ్యారేజీ వద్ద దెబ్బతిన్న పియర్లు, మరమ్మతు పనులను చూశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉండటంతో ఇన్నిరోజులుగా పనులను ఇంజనీరింగ్ అధికారులే పర్యవేక్షించారని చెప్పారు. ఇకపై మరమ్మతు పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. తాత్కాలిక మరమ్మతు పనులు అన్నారంలో 60శాతం మేర, మేడిగడ్డ వద్ద 80శాతం మేర పూర్తి కావొచ్చాయన్నారు. సుందిళ్లలో నత్తనడకన సాగుతున్న పనుల విషయంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశామన్నారు.

బ్యారేజీల గేట్లన్నీ ఎత్తి ఉంచాల్సిందే..

గత ప్రభుత్వం రూ.94 వేల కోట్లు ఖర్చు చేస్తే.. కేవలం లక్ష ఎకరాల ఆయకట్టు తయారైందని.. అది కూడా ఇప్పుడు కుంగుబాటుకు గురైందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. ''కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలకు నష్టం వాటిల్లింది. మా ప్రభుత్వం ఏర్పడ్డాక దీనిపై డ్యాం సేఫ్టీ అధికారులను సంప్రదించాం. వారు చంద్రశేఖర్ అయ్యర్ ఆధ్వర్యంలో కమిటీ వేశారు. బ్యారేజీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. మూడు బ్యారేజీలను గేట్లు ఎత్తి ఉంచాలని, అలా ఉంచితే బ్యారేజీలకు మరింత నష్టం వాటిల్లదని చెప్పారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నాం..'' అని తెలిపారు. బ్యారేజీల కుంగుబాటుపై జ్యుడిషియల్ విచారణ కొనసాగుతోందని చెప్పారు. ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణ కూడా జరిగిందని.. ఆ రిపోర్ట్ ప్రకారం మాజీ ఇరిగేషన్ చీఫ్‌ను విధుల నుంచి తప్పించామని వివరించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినవారికి శిక్ష తప్పదన్నారు. గత ప్రభుత్వంలో కమీషన్ల కోసం ఆశపడ్డారే తప్ప సీరియస్‌గా ఏ ఒక్క పనీ చేయలేదని ఉత్తమ్ విమర్శించారు.

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తాం

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తామని మంత్రి తెలిపారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు గతంలోనే డిజైన్ చేసిన డీపీఆర్ ప్రకారం పనులు పూర్తి చేస్తామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ భూమి సాగులోకి వచ్చే ప్రాజెక్టులను త్వరగా చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, రాజ్ ఠాకూర్, అడ్లూరి లక్ష్మణ్, ఇంజనీర్లు, అధికారులు ఉన్నారు.

జియోట్యూబ్‌లతో నీటిని ఆపి, ఎత్తిపోయొచ్చు!

తాత్కాలిక మరమ్మతు పనులు మేడిగడ్డ, అన్నారంలలో వేగంగా నడుస్తున్నాయని, సుందిళ్లలో కాస్త నెమ్మదిగా జరుగుతున్నాయని ఈఎన్సీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మేడిగడ్డ వద్ద 5 మీటర్లలో ఎత్తులో జియోట్యూబ్‌లు ఏర్పాటు చేస్తే నీటిని ఎత్తిపోయవచ్చన్నారు. అదే అన్నారంలో 11 మీటర్ల ఎత్తులో, సుందిళ్లలో 9 మీటర్ల ఎత్తులో ఆపితే నీటిని లిఫ్ట్ చేయవచ్చన్నారు.

రామోజీరావు ఆరోగ్యం విషమం?



సాక్షి, హైదరాబాద్: ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు ఆరోగ్యం విషమంగా ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన వెంటిలేటర్‌పై ఉన్నట్టు తెలిసింది. కొంతకాలంగా రామోజీరావు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవల గుండె సంబంధిత ఇబ్బంది తలెత్తడంతో ఆస్పత్రికి తరలించారు. మూడు రోజుల క్రితం ఆయనకు వైద్యులు శస్త్రచికిత్స చేసి స్టంట్స్ వేశారు. వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్న రామోజీరావు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వైద్యులు ఆయనకు వెంటిలేటర్ అమర్చారు. రామోజీరావు ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగానే ఉన్నట్టు తెలిసింది. వయోభారంతో ఉన్న ఆయన ఇప్పటికే పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, మరికొన్ని గంటలు గడిస్తే గానీ పరిస్థితి చెప్పలేమని వైద్యులు అంటున్నారని సమాచారం. రామోజీరావు కుటుంబ సభ్యులు సైతం ఆయన హెల్త్ బులెటిన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయాన్ని ఆస్పత్రి వర్గాలు ధ్రువీకరించట్లేదు.

నేడు, రేపు పలుప్రాంతాల్లో మోస్తరు వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో రుతుపవనాల కదలికలు చురుగ్గా ఉన్నాయని వివరించింది. రానున్న మూడు రోజుల్లో ఇవి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించే పరిస్థితులున్నట్లు వెల్లడించింది. రాయలసీమ, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్న ఉపరితల ఆవర్తనం శుక్రవారం తెలంగాణ ప్రాంతంలో ఉన్నట్లు వాతావరణ శాఖ నిపుణులు తెలిపారు. రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే ఆదిలాబాద్‌లో గరిష్టంగా 40.3 డిగ్రీల సెల్సియస్, హనుమకొండలో 23.0 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. శనివారం నుంచి గరిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

మెదడులో రక్తనాళాల మధ్య కణితి తొలగింపు

- నిమ్స్‌లో న్యూరో వైద్యుల ఆపరేషన్ విజయవంతం
- క్రేనియోటమీ, ఆక్సిపిటల్ ట్రాన్స్‌స్టెనోరియల్ అప్రోచ్ పద్ధతిలో శస్త్రచికిత్స

లక్డీకాపూల్(హైదరాబాద్): మెదడులోని రక్తనాళాల మధ్య ఏర్పడిన కణితిని నిమ్స్ వైద్యులు విజయవంతంగా తొలగించారు. క్రేనియోటమీ, ఆక్సిపిటల్ ట్రాన్స్‌స్టెనోరియల్ అప్రోచ్ పద్ధతిలో న్యూరోసర్జరీ వైద్యబృందం యువకుడికి శస్త్రచికిత్స చేసింది. సంగారెడ్డికి చెందిన 35 ఏళ్ల నరహరి కొంతకాలంగా తీవ్రమైన తలనొప్పి, వాంతులతో బాధపడుతున్నాడు. పలువురు డాక్టర్లను సంప్రదించినా, సమస్య పరిష్కారం కాలేదు. చివరకు నిమ్స్ వైద్యులను ఆశ్రయించాడు. ఎంఆర్ఐ, సిటీ స్కాన్ చేయగా, అత్యంత సంక్లిష్టమైన మెదడు మధ్య భాగాన అతి ముఖ్యమైన రక్తనాళాల మధ్యలో కణితి ఉన్నట్టు గుర్తించారు. నిమ్స్ న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ వై.తిరుమల్ వైద్యబృందం 3డీ వీనోగ్రామ్ పరీక్ష ద్వారా ప్రీఆపరేటివ్ ప్లానింగ్ చేసింది. గతవారం అత్యంత సంక్లిష్టమైన మెదడుకు ఆపరేషన్ చేసి విజయవంతంగా కణితిని తొలగించారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ తిరుమల్‌తోపాటు వైద్యనిపుణులు నితిన్, విశాల్, దీపక్‌లు పాల్గొన్నారు.

న్యూరో సర్జరీ వైద్యుల ఘనత: నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

మెదడు భాగాన్ని ఓపెన్ చేసి రక్తనాళాల మధ్య ఏర్పడిన కణితిని విజయవంతంగా తొలగించడం న్యూరోసర్జరీ వైద్యుల ఘనత అని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప చెప్పారు. బ్రెయిన్ ట్యూమర్ చికిత్సలు నిమ్స్ వైద్యులు సునాయంగా చేస్తున్నారని..ఇలాంటి సంక్లిష్ట ఆపరేషన్లు నిర్వహించడంలో ప్రత్యేకత చాటుకుంటున్నారన్నారు. వాస్తవానికి ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.10 నుంచి 15 లక్షలు ఖర్చయే ఆపరేషన్‌ను నిమ్స్‌లో ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేశామని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వ సహాయ, సహకారాలతో నిమ్స్ వైద్యులు అద్భుతాలు సృష్టిస్తున్నారని తెలిపారు. న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుచంద, డాక్టర్ వంశీకృష్ణ, అనస్తషీయా, రేడియోలజీ విభాగాలను ఆయన అభినందించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా కుదరదు

పిటిషనర్లకు తేల్చిచెప్పిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 563 పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించనున్న గ్రూప్– 1 ప్రిలిమ్స్ పరీక్ష వాయిదా వేయాలంటూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. వాయిదా కోరుతూ దాఖలైన అప్పీళ్లను కొట్టివేసింది. ఇంటెలిజెన్స్ బ్యూరో డిపార్ట్‌మెంట్ పరిధిలోని అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్– ఐఐ/ఎగ్జిక్యూటివ్ పోస్టుకు 2వ స్క్రీనింగ్ టెస్ట్ ఈ నెల 9న ఉన్న నేపథ్యంలో అదే రోజు నిర్వహిస్తున్న గ్రూప్–1 ప్రిలిమ్స్ వాయిదా వేయాలని కోరుతూ ఎం.గణేశ్, భూక్యా భరత్ హైకో ర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి ప్రిలిమ్స్ వాయిదా వేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చారు. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్లు అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్(ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఈ నెల 9న జరగనున్న గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు 4,03,645 మంది దరఖాస్తు చేసుకున్నారు. 33 జిల్లాల్లో 897 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల పుస్తకాలు, ఓఎంఆర్ షీట్లు తరలింపు అంతా సిద్ధం చేశారు. ఇక రెండు రోజుల్లోపరీక్ష అనగా మరోసారి వాయిదా పడితే (ఇప్పటికే రెండుసార్లు పరీక్ష రద్దు అయిన విషయం తెలిసిందే) లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర నిర్వేదంలో మునిగిపోతారు. ఇప్పటికే పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేసు కున్న వారు తీవ్ర ఇబ్బందులు పడతారు. ఇద్దరి కోసం లక్షల మంది భవిష్యత్‌ను కష్టాల్లోకి నెట్టొద్దు. గతంలో నీట్ వాయిదా కోరుతూ దాఖలైన ఓ పిటిషన్‌ను సుప్రీంకోర్టు అనుమతించలేదు' అని పేర్కొన్నారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు

వాదనలు విన్న ధర్మాసనం.. 'జూన్ 6 నాటికి 70% మంది అభ్యర్థులు హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఇప్పటికే ఆయా ప్రాంతాలకు వెళ్లడం ప్రారంభించారు. ఈ పరిస్థితుల్లో గ్రూప్–1 ప్రిలిమ్స్ వాయిదా వేయడం కుదరదు' అని స్పష్టం చేసింది.

31 జిల్లాలు.. 897 పరీక్ష కేంద్రాలు

గ్రూప్–1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసిన టీజీపీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 563 గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఈ నెల 9న జరగనున్న ప్రిలిమినరీ పరీక్షకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఉద్యోగాల కోసం 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 31 జిల్లాల్లో 897 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుంది. ఉదయం 10 తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరు. అభ్యర్థి గుర్తింపు కార్డును చూపించిన తర్వాతే కేంద్రంలోకి అనుమతిస్తారు. అన్ని పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, లోకల్ రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను ఇప్పటికే నియమించారు. ప్రతి కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్ ఉంటుంది. ప్రతి 3 నుంచి 5 కేంద్రాలకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ ఉంటుంది. ప్రతి వంద మంది అభ్యర్థులకు ఒక చెకింగ్ అధికారిని నియమించారు. పరీక్ష కేంద్రం ప్రవేశ ద్వారంతోపాటు చేట్టూ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థులు ఒకరోజు ముందే పరీక్షా కేంద్రాన్ని చూసుకుంటే పరీక్ష రోజు ఇబ్బందులుండవని కమిషన్ సూచించింది. హాల్‌టికెట్‌లో నిర్దేశించిన అన్ని రకాల సూచనలు అనుసరించాలని, ఎలాంటి లోపాలున్నా అనుమతి నిరాకరిస్తామని స్పష్టం చేసింది.

ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి

ముగ్గురు డీఆర్‌జీ జవాన్లకు తీవ్ర గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందగా, ముగ్గురు డీఆర్‌జీ జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్ పోలీసుల కథనం మేరకు.. నారాయణపూర్–కొండగావ్–దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లోని తూర్పు బస్తర్ డివిజన్ గోబెల్, మంగేడి అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో మూడు జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఐటీబీటీ 45 బెటాలియన్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. రాత్రంతా హోరాహోరీగా ఎదురుకాల్పులు జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున ఆ ప్రాంతంలో బలగాలు గాలించగా ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. విప్లవ సాహిత్యం, మందుగుండు సామగ్రి, తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను నారాయణపూర్‌కు తరలించగా, గాయపడిన జవాన్లను దంతెవాడకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆ ప్రాంతంలో అదనపు బలగాల కూంబింగ్ కొనసాగుతోంది.

సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై మావోయిస్టుల దాడి

నారాయణపూర్ జిల్లా కరక్‌బట్టీ సమీపాన ఉన్న సీఆర్‌పీఎఫ్ 135 బెటాలియన్ క్యాంపుపై మావోయిస్టులు గురువారం రాత్రి రాకెట్ లాంచర్లను ప్రయోగించారు. అప్రమత్తమైన బలగాలు ఎదురుకాల్పులకు దిగడంతో మావోయిస్టులు పారిపోయారని ఎస్పీ ప్రభాత్‌కుమార్ తెలిపారు. దాడిలో 200 మంది మావోయిస్టులు పాల్గొన్నట్లు గుర్తించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.